www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

భోగి శుభాకాంక్షలు

సోమవారం | 13-1-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 269 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి తె. 3.57 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆర్ద్ర ఉ. 10.38 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.10.27-12.02; దుర్ముహూర్తం: మ.12.45-1.30, మ.2.58-3.42; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం:6.51; సూర్యాస్తమయం: 5.55 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● సోమవారం 13 జనవరి 2025

# మార్చి 21 నుంచి ఐపీఎల్

**మే 25న ఫైనల్**

**ఉప్పల్‌లో రెండు క్వాలిఫయర్స్**

**ముంబై:** క్రికెట్ ప్రేమికులను అలరించేందుకు ఐపీఎల్ 18వ సీజన్ సిద్ధమవుతోంది. మార్చి 21 నుంచి లీగ్ జరగనుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. ఆదివారం బోర్డు ప్రత్యేక సాధారణ సమావేశం (ఎస్‌జీఎం)లో పాల్గొన్న అనంతరం శుక్లా ఈ విషయాన్ని వెల్లడించాడు. 66 రోజులపాటు జరిగే ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్ మే 25న కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. అంతకుముందు రెండో ప్లేఆఫ్స్‌ను కూడా ఇక్కడే నిర్వహించనున్నారు. లీగ్‌లో తొలి రెండు క్వాలిఫయర్స్‌కు మాత్రం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. పూర్తిస్థాయి షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించాల్సి ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును ఈనెల 18 లేక 19న వెల్లడిస్తామని శుక్లా తెలిపాడు. ప్రస్తుతానికి ఇంగ్లండ్, అఫ్ఘానిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ తమ ప్రాథమిక జట్లను ప్రకటించాయి.



సైకియాను అభినందిస్తున్న హెచ్‌సీఏ చీఫ్ జగన్‌మోహన్ రావు

**సైకియా, ప్రభ్‌తేజ్ ఏకగ్రీవంగా..:** ఇద్దరు ఆఫీస్ బేరర్ల ఎన్నికే ఎజెండాగా ఆదివారం బీసీసీఐ ఎస్‌జీఎం జరిగింది. ఇందులో బోర్డు నూతన కార్యదర్శిగా అసోం క్రికెట్ సంఘానికి చెందిన దేవజిత్ సైకియా ఎన్నికయ్యాడు. జైషా ఐసీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తుండడంతో అతడి స్థానంలో కొత్త కార్యదర్శి ఎంపిక అనివార్యమైంది. సైకియా ఇప్పటివరకు బోర్డు సంయుక్త కార్యదర్శిగా కొనసాగాడు. అలాగే ఇప్పటిదాకా కోశాధికారిగా ఉన్న ఆశిష్ షెలర్ మహారాష్ట్ర మంత్రి అయ్యారు. దీంతో ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా కోశాధికారిగా ఎన్నికయ్యాడు.

# గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ సొబగు

**ఖో-ఖో వరల్డ్‌కప్ నేటి నుంచే**

- బరిలో 23 దేశాలు
- ఆరంభ పోరులో భారత్‌తో నేపాల్ ఢీ





స్టార్‌స్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్‌లో రాత్రి 8.30 నుంచి

ఖో ఖో.. కొత్త శోభ సంతరించుకుంది. మన గ్రామీణ క్రీడ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అలరించేందుకు ప్రపంచ కప్ రూపంలో వచ్చేసింది. ఈ క్రీడ చరిత్రలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న మెగా టోర్నీ ఆతిథ్యానికి దేశ రాజధాని గ్రాండ్‌గా ముస్తాబైంది. పురుషులు, మహిళల జట్లు పోటీపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ సోమవారం నుంచి వారం పాటు జరగనుంది.

**న్యూఢిల్లీ:** ఇటీవల అల్టిమేట్ ఖో ఖో లీగ్‌తో కార్పొరేట్ స్థాయికి ఎదిగిన మన గ్రామీణ క్రీడ ఇక విశ్వవ్యాప్తం కానుంది. ఖో ఖో చరిత్రలో మొదటిసారిగా ప్రపంచకప్ జరుగుతోంది. అంతర్జాతీయ ఖో ఖో సమాఖ్య సహకారంతో భారత ఖో ఖో సంఘం ఈ మెగా టోర్నీని నిర్వహిస్తోంది. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ విశ్వకప్ జరగనుంది. మొత్తం 23 దేశాలు టోర్నమెంట్‌లో తలపడుతున్నాయి. పురుషుల విభాగంలో 20, మహిళల కేటగిరీలో 19 జట్లు బరిలో దిగుతున్నాయి. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీలు జరుగుతాయి. రెండు విభాగాల్లోనూ ఆయా జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ చేరతాయి. భారత పురుషుల జట్టు నేపాల్, పెరూ, బ్రెజిల్, భూటాన్‌తో కలిసి గ్రూప్-ఏలో, భారత మహిళల జట్టు దక్షిణ కొరియా, ఇరాన్, మలేసియాతో కలిసి గ్రూప్-ఏలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. భారత పురుషుల జట్టుకు తెలుగు యోధాస్ కెప్టెన్, మహారాష్ట్ర ఆటగాడు ప్రతీక్ కిరణ్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లే సారథ్యం వహించనున్నారు. పురుషుల జట్టులో బాపట్ల జిల్లా క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డికి ఆల్‌రౌండర్‌గా చోటు లభించగా, వికారాబాద్ కుర్రాడు విశ్వనాథ్ జానకిరామ్‌కు స్టాండ్‌బైగా ఎంపికయ్యాడు. ఈ విశ్వకప్‌లో భారత్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సోమవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు నేపాల్‌తో తలపడనుంది. భారత మహిళల జట్టు తమ తొలి మ్యాచ్‌ను మంగళవారం దక్షిణకొరియాతో ఆడనుంది.

**ఇలా ఆడతారు**

ప్రతి జట్టులో 12 మంది క్రీడాకారులుంటారు. కోర్టులో మాత్రం తొమ్మిది మంది మాత్రమే ఆడతారు. ఆట స్థితిగతులు బట్టి మిగిలిన ప్లేయర్లు మారుతుంటారు. మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్ ఉంటాయి. ఒకసారి జట్టు చేజ్ చేస్తే మరోసారి తాము చేసిన స్కోరును కాపాడుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఆడే క్రీడాకారులను డిఫెండర్, చేజర్, ఆల్‌రౌండర్‌గా విభజిస్తారు.

**టోర్నీలో తెలుగు తేజం**



పోతిరెడ్డి శివారెడ్డి.. ఖో ఖో వరల్డ్‌కప్‌లో ఆడే భారత జట్టులో చోటు దక్కించుకున్న ఏకైక తెలుగోడు. శివారెడ్డి స్వస్థలం బాపట్ల జిల్లా, ముండ్లమూరు మండలం, ఈదర గ్రామం. శివారెడ్డిది రైతు కుటుంబం. తండ్రి గురువారెడ్డి, తల్లి కోటేశ్వరమ్మ. ఆర్థిక సమస్యలతో కెరీర్ ప్రారంభంలో శివారెడ్డి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా, ఆటే లక్ష్యంగా ముందుకు సాగాడు. తొలిసారిగా 2018లో జాతీయ జట్టుకు ఎంపికైన అతను.. తనదైన ప్రతిభతో అనతికాలంలోనే జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. అల్టిమేట్ ఖో-ఖో లీగ్ తొలి సీజన్‌లో ముంబై ఖిలాడీస్, నిరుడు గుజరాత్ జెయింట్స్ జట్టు తరఫున శివారెడ్డి ఆడాడు. కోచ్‌లు కాశీవిశ్వనాథ్ రెడ్డి, సీతారామరెడ్డి ప్రోత్సాహంతో ఈస్థాయికి వచ్చిన తాను.. ఈ వరల్డ్‌కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడమే తన లక్ష్యమని ఆంధ్రజ్యోతితో శివారెడ్డి తెలిపాడు.



# ఔరా..ఇరా!

## 157 బంతుల్లో 346

**అండర్-19 క్రికెట్‌లో త్రిశతకంతో చరిత్ర**

**ఆలూరు (బెంగళూరు):** పద్నాలుగేళ్ల ముంబై ఓపెనర్ ఇరా జాదవ్ చరిత్ర సృష్టించింది. అండర్-19 క్రికెట్‌లో త్రి శతకం చేసిన తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనత అందుకుంది. మేఘాలయా జట్టుతో ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ మ్యాచ్‌లో ఇరా ఈ ఫీట్ నమోదు చేసింది. కేవలం 157 బంతుల్లో 42 ఫోర్లు, 16 సిక్సర్లతో జాదవ్ అజేయంగా 346 పరుగులు కొల్లగొట్టింది. కాగా.. మహిళల అండర్-19 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు మాత్రం సౌతాఫ్రికాకు చెందిన లిజెల్లీ లీ (427 నాటౌట్, 2010) పేరిట ఉంది. ఇక.. కెప్టెన్ హర్లీ గాలా (116)తో కలిసి రెండో వికెట్‌కు ఇరా 274 పరుగులు జత చేసింది. అనంతరం దీక్షా పవార్ (39)తో కలిసి మూడో వికెట్‌కు 186 పరుగులు జాదవ్ జోడించింది. దాంతో ముంబై 50 ఓవర్లలో 563/3 స్కోరు చేసింది. అత్యంత భారీ లక్ష్య ఛేదనలో మేఘాలయ 25.4 ఓవర్లలో 19 పరుగులకే ఆలౌటైంది. సచిన్, కాంబ్లీ, అజిత్ అగార్కర్‌లాంటి మేటి క్రికెటర్లు చదివిన శారదాశ్రమ్ విద్యామందిర్ విద్యార్థిని అయిన ఇరా..గత నెలలో జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగలడం గమనార్హం.

## సబలెంక, జ్వెరెవ్ శుభారంభం

**ఆస్ట్రేలియన్ ఓపెన్**

**మెల్‌బోర్న్:** డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంక, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సబలెంక 6-3, 6-2తో స్లోన్ స్టీఫెన్స్‌పై అలవోకగా నెగ్గింది. చైనా ప్లేయర్ క్విన్‌వెన్ జాంగ్ 7-6(3), 6-1తో అంకా తొడోనిను, 11వ సీడ్ పౌలా బడోసా 6-3, 7-6(5)తో వాంగ్ జిన్‌ను, ఆండ్రీవ 6-3, 6-3తో బజ్కోవాను, డోనా వెకిక్ 6-4, 6-4తో దయానిను ఓడించి రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. పురుషుల్లో జ్వెరెవ్ 6-4, 6-4, 6-4తో లూకాస్‌పై, ఆరో సీడ్ కాస్పర్ రూడ్ 6-3, 1-6, 7-5, 2-6, 6-1తో మునార్‌పై గెలిచి నెగ్గారు.

**నగాల్‌కు నిరాశ:** భారత ఆటగాడు సుమీత్ నగాల్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. 26వ సీడ్ థామస్ మచాక్‌తో పోరులో నగాల్ 3-6, 1-6, 5-7తో వరుస సెట్లలో పరాజయం పాలయ్యాడు.

## హజారే సెమీస్‌లో విదర్భ, హరియాణా

**వడోదర:** విదర్భ, హరియాణా జట్లు విజయ్ హజారే ట్రోఫీలో సెమీఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రాజస్థాన్‌ను విదర్భ, గుజరాత్‌ను హరియాణా ఓడించాయి. బుధవారం జరిగే సెమీస్‌లో కర్ణాటకతో హరియాణా, మహారాష్ట్రతో విదర్భ తలపడతాయి.

## పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్



**చండీగఢ్:** టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కొత్త కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈమేరకు జట్టు యాజమాన్యం ఆదివారం అతడి పేరును ప్రకటించింది. గత నవంబరు మెగా వేలంలో శ్రేయాస్‌ను అత్యంత భారీ మొత్తం రూ.26.75 కోట్లు వెచ్చించి పంజాబ్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో అతడినే సారథిగా నియమిస్తారని అంచనా వేశారు. 2024లో శ్రేయాస్ కెప్టెన్సీలోనే కోల్‌కతా నైట్‌రైడర్స్ టైటిల్ గెలిచింది. 'జట్టు నాపై నమ్మకం ఉంచడాన్ని గౌరవంగా భావిస్తున్నా. కోచ్ పాంటింగ్‌తో కలిసి మరోసారి పని చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని అయ్యర్ స్పందించాడు. 2020లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ హెడ్ కోచ్‌గా ఉన్న సమయంలో శ్రేయాస్ ఆ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వారిద్దరి ఆధ్వర్యంలో ఆ సీజన్‌లో ఢిల్లీ టోర్నమెంట్ రన్నరప్‌గా నిలిచింది.

## జెమీమా సెంచరీ

**రెండో వన్డేలోనూ ఐర్లాండ్ చిత్తు**

**భారత్‌దే సిరీస్**



జెమీమా (102)

**రాజ్‌కోట్:** టాపార్డర్ బ్యాటర్లంతా ధనాధన్ బ్యాటింగ్‌తో అదరగొట్టారు. జెమీమా రోడ్రిగ్స్ (102) తొలి అంతర్జాతీయ శతకం నమోదు చేయగా, హర్లీన్ డియోల్ (89) కొద్దిలో సెంచరీ చేజార్చుకుంది. ఇక కెప్టెన్ మంధాన (73) తన జోరు కొనసాగించగా, యువ క్రీడాకారిణి ప్రతికా రావల్ (67) మరో అర్ధ హాఫ్ సెంచరీతో భళా అనిపించింది. దాంతో ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 116 పరుగులతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే మిగిలుండగానే కైవసం చేసుకుంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 370/5 స్కోరు చేసింది. భారీ ఛేదనలో ఐర్లాండ్ 50 ఓవర్లలో 254/7 స్కోరుకే పరిమితమైంది. క్రిస్టినా (80) అర్ధ శతకంతో సత్తా చాటింది.

**47 ఏళ్లలో తొలిసారి..:** 1978లో ఇంగ్లండ్‌పై భారత మహిళల జట్టు తొలి వన్డే ఆడింది. ఆ క్రమంలో 47 ఏళ్ల తర్వాత మన జట్టు మొదటిసారి వన్డేలలో 370 పరుగుల మార్క్‌ను అందుకొని రికార్డు సృష్టించింది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్:** 50 ఓవర్లలో 370/5 (జెమీమా 102, హర్లీన్ 89, మంధాన 73, ప్రతిక 67, ప్రెండెర్‌గాస్ట్ 2/75, కెల్లీ 2/82).

**ఐర్లాండ్:** 50 ఓవర్లలో 254/7 (క్రిస్టినా 80, సారా 38, డెలానీ 37, దీప్తి శర్మ 3/37, ప్రియ 2/53).

# బిజినెస్

## 23,750 పైన బుల్లిష్

(జనవరి 13-17 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

**ఆస్ట్రో నెట్**

నిఫ్టీ గత వారం 24,089-23,344 పాయింట్ల మధ్యన కదలాడి 537 పాయింట్ల నష్టంతో 23,432 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,548, 23,753, 23,749, 24,095 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,750
బ్రేక్‌డౌన్ స్థాయి: 23,200
నిరోధ స్థాయిలు: 23,650, 23,750, 23,850 (23,550 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,225, 23,125, 23,025 (23,325 దిగువన బేరిష్)

**ఫామ్‌గేట్ ధర** — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 104 | విజయవాడ | 111 |
| వరంగల్ | 104 | గుంటూరు | 110 |
| కరీంనగర్ | 104 | ఒంగోలు | 110 |
| మహబూబ్‌నగర్ | 104 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 104 | నెల్లూరు | 95 |
| విశాఖపట్నం | 107 | అనంతపురం | 95 |
| గోదావరి | 111 | | |

## ఎయిర్ ఇండియాకు 'రూపాయి' కష్టాలు

**ఖర్చులు పైపైకి.. లాభాలు కిందికి**



**న్యూఢిల్లీ:** డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను భయపెడుతోంది. దీంతో ఖర్చులు పెరిగి లాభాలకూ గండి పడుతుందని కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) నిపుణ్ అగర్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. డాలర్‌తో రూపాయి పతనం ఎయిర్ ఇండియాకే గాక, ఇతర విమానయాన సంస్థలకూ నష్టమేనన్నారు. ఉద్యోగుల జీతాలు తప్ప.. తమ ఇతర ఖర్చులన్నీ డాలర్లలో ఉండడం ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే విదేశాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి విదేశీ కరెన్సీలలో వసూలు చేసే టిక్కెట్ల చార్జీలు కొంతలో కొంత తమను ఆదుకునే అవకాశం ఉందన్నారు. దీనికి తోడు ఖర్చులు తగ్గించుకోవడం, ఇతర చర్యల గురించీ ఆలోచిస్తున్నట్టు అగర్వాల్ తెలిపారు.

**ప్రీమియం సీట్లపై దృష్టి**

ఆదాయం పెంచుకోవడంపైనా ఎయిర్ ఇండియా దృష్టి పెట్టింది. ఇందుకోసం వైడ్ బాడీ విమానాల ముందు భాగంలో బిజినెస్, ఎకానమీ ప్రీమియం సీట్ల సంఖ్య రెట్టింపు చేస్తున్నట్టు అగర్వాల్ తెలిపారు. మరో రెండేళ్లలో తమకు అందే ఎయిర్‌బస్ ఏ350-1000 తరహా విమానాల్లో బోయింగ్ 777 విమానాల్లో ఉన్నట్లుగా ఫస్ట్ క్లాస్ సీట్లు ప్రవేశ పెట్టబోతున్నట్టు చెప్పారు. అగ్రశ్రేణి విమానయాన సంస్థలతో పోటీపడాలంటే తమ విమానాల్లోనూ ఫస్ట్ క్లాస్ సీట్లు పెంచుకోక తప్పదన్నారు.

## ఉద్యోగాల తీసివేతలు ఉండవు

**మైక్రోసాఫ్ట్ ఇండియా**

**న్యూఢిల్లీ:** భారత్‌లోని తన ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ ఇండియా చల్లటి కబురు చెప్పింది. ఈ సంవత్సరం భారత్‌లో ఎవరినీ ఉద్యోగాల నుంచి తొలగించే ఆలోచన లేదని మైక్రోసాఫ్ట్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో 20,000 మంది భారత్‌లో ఉన్నారు. పనితీరు ఆధారంగా తన మొత్తం ఉద్యోగుల్లో ఒక శాతం మందిని తీసివేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ ప్రభావం భారత్‌లోని ఉద్యోగులపైనా పడుతుందని భయపడ్డారు. అయితే అదేమీ లేదని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ ప్రకటించడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు కృత్రిమ మేథ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ కోసం మరింత మంది ఉద్యోగులను నియవించుకుంటామని పునీత్ చెప్పడం విశేషం.

## ఓయో షేర్లపై బాలీవుడ్ సెలబ్రిటీల ఆసక్తి

**న్యూఢిల్లీ:** రితేశ్ అగర్వాల్ స్థాపించిన ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ కంపెనీ షేర్లపై బాలీవుడ్ ప్రముఖులు ఆసక్తి చూపిస్తున్నారు. మాధురీ దీక్షిత్, అమృతా రావు, నిర్మాత, షారూఖ్ ఖాన్ సతీమణి గౌరీ ఖాన్ గడిచిన కొద్ది నెలల్లో పెద్ద మొత్తంలో ఈ కంపెనీ షేర్లను కొనుగోలు చేశారు. గత ఏడాది ఆగస్టులో ముగిసిన సీరిస్ జీ ఫండింగ్‌లో భాగంగా గౌరీ ఖాన్ ఏకంగా 24 లక్షల షేర్లు కొనుగోలు చేశారు. ఈ సీరిస్ జీ ఫండింగ్ ద్వారా ఓయో హోటల్స్ గత ఏడాది వివిధ మదుపరుల నుంచి దాదాపు రూ.1,400 కోట్లు సమీకరించింది. మాధురీ దీక్షిత్, ఆమె భర్త డాక్టర్ శ్రీరామ్ నెనె, మరో డాక్టర్ రితేష మాలిక్‌తో కలిసి మరో 20 లక్షల షేర్లు కొనుగోలు చేశారు. అమృతా రావు, ఆమె భర్త కూడా సెకండరీ మార్కెట్ నుంచి పెద్ద మొత్తంలోనే ఓయో షేర్లు కొన్నట్టు సమాచారం. కాగా ఓయో గత ఏడాది పబ్లిక్ ఇష్యూకి వస్తున్నట్టు ప్రకటించింది.

## ఇండెక్స్ షేర్లపై సెబీ నిఘా

**న్యూఢిల్లీ:** ఇండెక్స్‌ల్లో అధిక వెయిటేజీ ఉన్న షేర్ల లావాదేవీలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిశితంగా గమనిస్తోంది. క్యాష్ సెగ్మెంట్‌లో ఎవరైనా ఈ షేర్లలో అక్రమాలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకునేందుకు ఈ నిఘా పెట్టినట్టు సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత నారాయణ్ చెప్పారు. క్యాష్ మార్కెట్లో ఎవరైనా ఈ షేర్లలో అక్రమాలకు పాల్పడితే అది మార్కెట్ ఆటుపోట్లకు దారితీసి, ఆ ప్రభావం డెరివేటివ్ మార్కెట్‌పైనా పడుతుందన్నారు. హెడ్జింగ్ లేదా అధిక లాభాల కోసం, క్యాష్ అండ్ డెరివేటివ్స్ మార్కెట్లో బెట్స్ తీసుకోవడం అసాధారణం కాకపోయినా ఆ పేరుతో 'పంప్ అండ్ డంప్' కార్యకలాపాలపై మాత్రం నిఘా ఉంచినట్టు నారాయణ్ చెప్పారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 13వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 490 | విజయవాడ | 515 |
| వరంగల్ | 492 | గోదావరి | 515 |
| చిత్తూరు | 523 | విశాఖపట్నం | 520 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

## లిథియం కోసం అర్జెంటీనాలో అన్వేషణ

**కోల్ ఇండియా**

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఇతర ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తిపైనా దృష్టి పెట్టింది. ప్రస్తుతం బొగ్గుకు మాత్రమే పరిమితమైన ఈ మహా నవరత్న కంపెనీ అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీ దేశాల్లో లిథియం, నికిల్, కోబాల్ట్ వంటి అరుదైన లోహాల అన్వేషణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అర్జెంటీనాలో లిథియం ఖనిజ అన్వేషణలో తోడ్పడే టెక్నికల్ కన్సల్టెంట్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ ఆహ్వానించింది. విద్యుత్ వాహనాల్లో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీల్లో లిథియం ప్రధాన ముడి పదార్థం. ప్రస్తుతం మన దేశం ఈ ఖనిజాన్ని లేదా బ్యాటరీలను పెద్దఎత్తున దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. విదేశాల్లో లిథియం గనులను చేజిక్కించుకోవడం ద్వారా చైనా లేదా ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించుకోవచ్చని కోల్ ఇండియా భావిస్తోంది.

## ఆచితూచి వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే నిఫ్టీ 200 ఎస్ఎంఏ కిందకు వచ్చింది. జీవితకాల గరిష్ఠం నుంచి 11 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. కీలకమైన 23,431 పాయింట్ల స్థాయి కన్నా దిగజారితే మీడియం టర్మ్ డౌన్‌ట్రెండ్ మొదలయ్యే ప్రమాదం ఉంది. గత వారం ఐటీ మినహా అన్ని రంగాల సూచీలు పతనమయ్యాయి. ఎఫ్ఎంసీజీ విభాగం కొద్దిగా మెరుగ్గా కనిపిస్తోంది. బడ్జెట్ సమీపిస్తుండటంతో మార్కెట్లు మరింత ఆటుపోట్లు ఎదుర్కొనే అవకాశం ఉంది.

**స్టాక్ రికమండేషన్స్**

**హెచ్‌సీఎల్ టెక్:** నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. టెయిల్ విండ్ సెక్టార్ కావటం అనుకూలం. చివరి మూడు సెషన్లలోనే ఈ షేరు 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం 3.12 శాతం లాభంతో రూ.1,995 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,990 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,960 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఎస్‌బీఐ లైఫ్:** గత ఏడాది సెప్టెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు 30 శాతం మేర దిద్దుబాటుకి లోనైంది. ప్రధాన మద్దతు స్థాయి రూ.1,400 వద్ద నుంచి అక్యుములేషన్ మొదలైంది. ఒడుదొడుకులు తగ్గాయి. బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ ఈ కౌంటర్ పటిష్ఠతను ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.1,478 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,450 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,420 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**హిందుస్థాన్ యూనీలివర్:** ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఎఫ్ఎంసీజీ రంగం మాత్రమే ఆశాజనకంగా కనిపిస్తోంది. సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో 25 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కీలకమైన రూ.2,300 స్థాయిలో మద్దతు లభించింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,442 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,400 శ్రేణిలో ప్రవేశించి రూ.2,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,360 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**మారికో:** నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. నష్టాల మార్కెట్లోనూ దూకుడుగా ముందుకు సాగుతోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత మంచి కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం కీలకమైన రూ.600 స్థాయి కన్నా పైన చలిస్తోంది. చివరి మూడు సెషన్లలో ఈ షేరు 10 శాతం పెరిగింది. గత శుక్రవారం రూ.673.90 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.635 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**బ్రిటానియా:** గత అక్టోబరులో జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు ద్వితీయ త్రైమాసిక ఫలితాల అనంతరం కుప్పకూలింది. 26 శాతం కరెక్షన్ జరిగిన తర్వాత ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతోంది. డిసెంబరు చివరి వారం నుంచి జోరును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.4,939 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,900 వద్ద పొజిషన్ తీసుకుని రూ.5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

## మద్దతు స్థాయిలు 23,250, 23,000

**టెక్ వ్యూ**



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 24,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం అంతా డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడవుతూ 570 పాయింట్ల నష్టంతో 23,430 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయి 23,500 వద్ద రెండు నెలల పాటు సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం ఆ స్థాయిలో నిలదొక్కుకోవడంలో విఫలమైంది. అంతకన్నా దిగువనే క్లోజ్ కావడం మరింత అప్రమత్తతను సూచిస్తోంది. గత మూడు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లోనే ఉన్న మార్కెట్ ఇటీవలి గరిష్ఠ స్థాయిల నుంచా 3,000 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 3,350 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 1,400 పాయింట్లు నష్టపోయాయి. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్లో భారీ పతనం కారణంగా ఈ వారంలో మార్కెట్ మరింత బలహీనత ప్రదర్శించవచ్చు. సోమవారం ఏర్పడవచ్చునుకుంటున్న ఇంట్రాడే రియాక్షన్ అనంతరం మార్కెట్ పునరుజ్జీవం సాధిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

**బుల్లిష్ స్థాయిలు:** నిఫ్టీ ప్రధాన మద్దతు స్థాయి 23,250 (గతంలో ఏర్పడిన మేజర్ బాటమ్) చేరువకు వస్తోంది. సానుకూలత కోసం మార్కెట్ ఇక్కడ నిలదొక్కుకోవాలి. రికవరీ బాట పట్టినట్టయితే స్వల్పకాలిక సానుకూలత కోసం ప్రధాన నిరోధం 23,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

**బేరిష్ స్థాయిలు:** మరింత బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 23,250 వద్ద పునరుజ్జీవం సాధించాలి. విఫలమైతే మరింత బలహీన పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,000 వద్ద కన్సాలిడేట్ కావచ్చు. ఇక్కడ కూడా విఫలమైతే మరింత అప్రమత్తత తప్పదు.

**బ్యాంక్ నిఫ్టీ:** గత వారం ఈ సూచీ అంతకు ముందు వారంతో పోల్చితే 2,250 పాయింట్లు నష్టపోయి 48,730 వద్ద ముగిసింది. గత మూడు నెలల కాలంలో కీలక స్థాయి 50,000 వద్ద ఎన్నో సార్లు రికవరీకి సాధించిన సూచీ చివరికి అంతకన్నా దిగువకు పడిపోయింది. రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి, మానసిక అవధి 48,000.

**పాటర్న్:** నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైంది. ఇది మరింత అప్రమత్త సంకేతం. ప్రస్తుతం 23,250 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. మార్కెట్ ఇప్పుడు 50 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 23,440, 23,500 |
| మద్దతు | 23,300, 23,250 |

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
భోగి శుభాకాంక్షలు
సోమవారం | 13-1-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పెట్టుబడిదారులకు రాష్ట్రంలో మంచి స్నేహపూర్వక వాతావరణం ఏర్పరుస్తాం. పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ముందుకు రావాలి.

మన గోదావరి బేసిన్‌లో 40 శాతం సహజ వాయువు ఉత్పత్తి జరుగుతోంది. దీనిని రాష్ట్రంలో ఉపయోగించుకునేందుకు పూర్తి సహకారం అందిస్తాం.

– సీఎం చంద్రబాబు



తిరుచానూరులో పైపు లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారు ఇంటిలో టీ పెడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే పులివర్తి నాని

# గ్రీన్ అండ్ క్లీన్

## స్వచ్ఛ ఎనర్జీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం: సీఎం

1995-96లో మేమే దీపం కనెక్షన్లు ఇచ్చాం
నేడు దీపం-2 కింద ఏటా 3 ఉచిత సిలిండర్లు
గోదావరి బేసిన్‌లో గ్యాస్‌ను రాష్ట్రంలో ఉపయోగించుకునేందుకు సహకారం
ఈ రంగంపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం
పన్నులు 24 శాతానికి పెంపు
దీంతో వేరే రాష్ట్రాలకు వెళ్లిపోయిన కంపెనీలు
మేమొచ్చాక పన్నులను 5 శాతానికి తగ్గించాం
పెట్టుబడిదారులకు స్నేహపూర్వక వాతావరణం
సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాలి: బాబు
తిరుచానూరులో పైపులైను ద్వారా వంట గ్యాస్ సరఫరా ప్రారంభం

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత ఇంధన వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాన్ని గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆదివారం సాయంత్రం తిరుపతిలోని హోటల్ తాజ్‌లో ఏజీ అండ్ పీ ప్రథమ్-థింక్ గ్యాస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంధన రంగంలో దేశంలోనే

మిగతా 10వ పేజీలో...

## పేదరిక నిర్మూలనకు పీ-4

అట్టడుగున ఉన్న 20% మందికి చేయూతనివ్వండి
ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలకు సీఎం పిలుపు
'జీరో పావర్టీ'.. స్వర్ణాంధ్ర-2047లో తొలి సూత్రం
పేదరికం లేని సమాజం మా నినాదం.. మా విధానం
ఉన్నత స్థానాల్లోని వారు తమ వంతు తిరిగివ్వాలి

# జే ట్యాక్స్ పోయిందిగా

మరింత దిగొస్తున్న మద్యం ధరలు
తగ్గింపునకు కంపెనీల క్యూ

ఇప్పటికే 10 బ్రాండ్ల ధరల తగ్గింపు
మరో 6 కంపెనీలు దరఖాస్తు
క్వార్టర్‌పై రూ.20–80 తగ్గుదల
గత ఐదేళ్లూ ఇవే బ్రాండ్లపై దోపిడీ
అదనపు రేట్ల మొత్తం తాడేపల్లికి
కూటమి ప్రభుత్వంలో కమీషన్లు బంద్



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కాలం గడిచేకొద్దీ ఏ వస్తువుకైనా ధర పెరుగుతుంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా తయారీదారులు ఎమ్మార్పీలను పెంచుతూ ఉంటారు. మద్యం కంపెనీలు కూడా అలాగే ఎప్పటికప్పుడు తమ బ్రాండ్ల ధరలు పెంచుకోవాలని చూస్తాయి. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో సీన్ రివర్స్ అయింది. ధరలు పెంచడం సంగతి అటుంచితే, ఉన్న ధరలనే తగ్గించాలని మద్యం కంపెనీలు కోరుతున్నాయి. అది కూడా నోటి మాటగా కాకుండా ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకుంటున్నాయి. దీనికి కారణం ఏంటంటే.. జే ట్యాక్స్ లేకపోవడమే! జగన్ ప్రభుత్వంలో తాడేపల్లికి కప్పం కట్టాల్సి ఉండటంతో ధరలను అదనంగా

మిగతా 10వ పేజీలో...

# 'అదానీ డేటా'లో కదలిక

ఎట్టకేలకు సెంటర్ పనులకు మార్గం సుగమం
తాజాగా పర్యావరణ అనుమతులు జారీ
నాడు టీడీపీ హయాంలో విశాఖలో భూమి
ఏకంగా కొండనే కేటాయించిన వైసీపీ
అయినా మొదలుకాని నిర్మాణం
అధికారంలోకి రాగానే కూటమి దృష్టి
ఆరు నెలల్లోనే చకచకా సాగిన ప్రక్రియ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో అదానీ డేటా సెంటర్‌కు భూమి కేటాయించి ఏళ్లు గడుస్తున్నా అక్కడ చిన్న గొయ్యి కూడా తవ్వలేదు. నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తోంది. మధురవాడలో ఈ సంస్థకు ఏకంగా ఒక కొండనే కేటాయించారు. కొత్తగా కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై దృష్టి సారించడంతో ప్రాజెక్టులో కదలిక వచ్చింది. నిబంధనలతో కూడిన పర్యావరణ అనుమతులను 'రాష్ట్ర స్థాయి పర్యావరణ

మిగతా 10వ పేజీలో...

## పండగొచ్చింది..

భీమవరంలో భోగి మంట ముందు యువతుల సందడి



## బైక్స్ పైనా చలో చలో..



విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ.. హైదరాబాద్ నుంచి బైక్‌పై ఏపీకి వస్తున్న యువకులు

వందల కిలోమీటర్లు బైక్‌లపైనే.. రైళ్లు, బస్సులు ఫుల్.. ప్రైవేటులో చార్జీల మోత
హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనాలపై స్వస్థలాలకు తరలిన జనం
మూడు రోజుల్లో ఏపీ వైపు 60 వేలకు పైగా బైక్‌లు.. సంక్రాంతి ప్రభావంతో హైదరాబాద్ ఖాళీ

9

## నేటి నుంచే మహా కుంభమేళా!



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

7

45 రోజుల పాటు నిర్వహణ.. కోట్లాదిగా రానున్న భక్తులు
విస్తృత ఏర్పాట్లు చేసిన యూపీ.. ఏఐ సాంకేతికతతో దిశా నిర్దేశం

## పాకిస్థాన్‌లో 33 టన్నుల బంగారం నిక్షేపాలు!

సింధు నది లోయలో గుర్తింపు
విలువ రూ.18 వేల కోట్లకు పైనే..
వెలికి తీసేందుకు కసరత్తు

ఇస్లామాబాద్, జనవరి 12: తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌లో 'బంగారం' పంట పండింది. ఆ దేశంలోని పంజాబ్ ప్రావిన్స్ అటోక్ జిల్లాలో విస్తరించి ఉన్న సింధు నది లోయలో భారీగా బంగారం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 32.6 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ పాకిస్థాన్ (జీఎస్‌పీ) వెల్లడించింది. వీటి విలువ రూ.18 వేల కోట్లకు పైనే (600 బిలియన్ పాకిస్థానీ రూపాయలు) ఉంటుందని

మిగతా 7వ పేజీలో...



ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా గుమ్‌చూర్ కొండల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణం బాంబులు

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఐదుగురు నక్సల్స్ మృతి

5 తుపాకులు, ఒక బీజీఎల్ లాంచర్ సీజ్
నారాయణపూర్ జిల్లాలో భారీ డంప్
వాటిలో భారీగా బాణం బాంబులు
సుక్మాలో ఐఈడీ పేలి బాలికకు గాయాలు

7

## రూ.14.73 కోట్ల స్మగ్లింగ్ బంగారం

బెజవాడలో స్వాధీనం.. 16 మంది అరెస్ట్

10

# బాబోయ్ కానిస్టేబుల్ ఉద్యోగమా?

ప్రమోషన్లు లేవు.. విధుల్లో ఒత్తిడి
ఎంపిక ప్రక్రియలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి పద్ధతులే
కఠినంగా ఫిట్‌నెస్, 1600 మీ. పరుగు
30 శాతం అభ్యర్థులు ఫెయిల్
నాటికి, నేటికీ సమాజం, సాంకేతికతలో ఎన్నో మార్పులు
అనుగుణంగా మారని వైనం

### యువతలో తగ్గిపోతున్న ఆసక్తి



ఒంటిపై యూనిఫామ్.. సమాజంలో గౌరవం.. తప్పుడు పనులు చేసే వారిని దండించే ధైర్యం.. నిస్సహాయులకు అండగా నిలిచే అవకాశం.. ఒకప్పుడు పోలీసు ఉద్యోగమంటే ఎంతో క్రేజ్ ఉండేది. కానీ మారుతున్న పరిస్థితుల్లో ఈ ఉద్యోగంపై యువతకు ఆసక్తి తగ్గుతోంది. ఇంకా చెప్పాలంటే.. 'మాకొద్దు బాబోయ్.. ఈ పోలీసు ఉద్యోగం' అంటున్నారు. ఓ మోస్తరు ప్రైవేటు ఉద్యోగం లభించినా చాలంటున్నారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ నుంచి విధుల నిర్వహణలో సమస్యల వరకు ఎన్నో కారణాలు ఉన్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కుటుంబ సభ్యుల ఒత్తిడితోనో, ఏ ఉద్యోగమూ లేకనో కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేసినా.. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించినవారిలో చాలామంది ఫిట్‌నెస్ పరీక్షలకు వచ్చేసరికి ముఖం చాటేస్తున్నారు. ఫిట్‌నెస్ పరీక్షలు కఠినంగా ఉండటమే ఇందుకు కారణం. ఎప్పుడు రిక్రూట్‌మెంట్ నిర్వహించినా రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు మరణిస్తున్నారు. తాజాగా మచిలీపట్నంలో ఒక అభ్యర్థి రన్నింగ్‌లో ప్రాణాలు వదలడం విషాదకరం. కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి పద్ధతులు పాటించడం ఎందుకనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో సాంకేతిక పరిజ్ఞానం అంతగా

మిగతా 7వ పేజీలో...

కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని అంపాపురం వద్ద సిద్ధమైన బరి



# కాయ్.. రాజా కాయ్!

కోడి పందేలకు బరులు సిద్ధం
పేకాట, గుండాటలు కూడా
కోస్తా పల్లెల్లో సంక్రాంతి కోలాహలం
పల్లెలు దాటి పట్టణాలకు పందేలు
విజయవాడ నగరానికి చేరిన సంస్కృతి
గెలిచిన వారికి భారీ కానుకలు కూడా
బుల్లెట్లు, జీపుల వంటి వాహనాలు
తెలంగాణ సహా పలు రాష్ట్రాల నుంచి నోట్ల కట్టలతో పందెంరాయుళ్లు సై

తెలుగు వారి అతిపెద్ద పండుగ సంక్రాంతి. పిల్లాపాపల సందళ్ల నుంచి యువతుల రంగవల్లుల వరకు సంక్రాంతి శోభ ద్విగుణీకృతం!! అంతేనా.. కోడిపందేలు, పేకాట, గుండాటలతో పందెం రాయుళ్లు చేసే సందడి మరో లెవెల్. వెరసి భోగి నుంచి కనుమ వరకు మూడు రోజుల పాటు పల్లెల్లో 'కాయ్.. రాజా కాయ్'!!

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలుగు లోగిళ్లు సంక్రాంతి సొబగును సంతరించుకున్నాయి. సోమవారం భోగితో ప్రారంభమయ్యే మూడు రోజుల అతి పెద్ద పండుగ అందరినీ

మిగతా 9వ పేజీలో...


## కాలిఫోర్నియా కార్చిచ్చు

# హాలీవుడ్ ప్రముఖులపై ప్రజాగ్రహ జ్వాల



కార్చిచ్చు ఆర్పడానికి హెలికాప్టర్‌తో నీళ్లు కుమ్మరిస్తున్న దృశ్యం

నీటి కొరత కారణంగా అదుపులోకి రాని మంటలు.. ఇళ్లను కాపాడుకోవడానికి విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న హాలీవుడ్ ప్రముఖులు
ప్రైవేటు ఫైర్ ఫైటర్లకు గంటకు 2వేల డాలర్లు ఇస్తున్న వైనం
నీటి కొరతకు సెలబ్రిటీలే కారణమంటూ ప్రజల ఆగ్రహం
గతంలో నిబంధనలు ఉల్లంఘించి తోటలకు నీటిని అడ్డగోలుగా వాడారని ఆరోపణ



లాస్‌ఏంజెలెస్‌లో కార్చిచ్చు కారణంగా తగలబడిన చెట్లు, ఇళ్లు

లాస్‌ఏంజెలెస్: ఎటుచూసినా ఎగసిపడుతున్న మంటలు! నలువైపుల నుంచీ చుట్టుముడుతున్న కార్చిచ్చు!! కాల్చే వేడి.. కమ్మేస్తున్న పొగ.. దావాగ్ని ధాటికి దారిలో ఉన్నవన్నీ దగ్ధమై తెల్లటి మంచులా కురుస్తున్న బూడిద! హాలీవుడ్ తారలు నివసించే చోటుగా, 'సిటీ ఆఫ్ ఏంజెల్స్'గా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లాస్‌ఏంజెలెస్‌లో ప్రస్తుత పరిస్థితి ఇది!! కాలిఫోర్నియా రాష్ట్రంలో ఆరు చోట్ల దావానలం రగలగా.. వాటిలో లాస్‌ఏంజెలెస్ ప్రాంతంలో మొదలైన 'ప్యాలిసేడ్స్ వైల్డ్‌ఫైర్' పెను విధ్వంసం సృష్టిస్తోంది. ఆ మంటలను ఆర్పడానికి అగ్నిమాపక


మిగతా 7వ పేజీలో...

# వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

## నవలా శిల్పం

అంపశయ్య నవీన్



# ‘అంపశయ్య’ను టెక్నిక్ కోసం రాయలేదు

నాటి నూతన సహస్రాబ్ది సందర్భంలో వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో వెలువడిన వేలాది గ్రంథాల్లోంచి వంద అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రచురించాలని సంకల్పించి అబ్బూరి ఛాయాదేవి, బి.ఎస్.రాములు, చందు సుబ్బారావు, చేకూరి రామారావు, కేతు విశ్వనాథరెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, వేగుంట మోహనప్రసాద్ వంటి హేమాహేమీలతో ఒక కమిటీని ఏర్పరచి వాళ్ళ ఏకీకృత అభిప్రాయంతో వంద అత్యుత్తమ గ్రంథాలను ‘ఆంధ్రజ్యోతి’ ప్రకటించినపుడు ‘అంపశయ్య’ నవల 49వ స్థానంలో నిలిచింది. మొదటి నవలతోనే అంతటి అసాధారణ గౌరవాన్ని పొంది, ఆ నవల పేరునే ఇంటిపేరుగా చేసుకుని, తర్వాత మరెన్నో నవలలతో విశిష్ట నవలాకారుడిగా తెలుగు సాహిత్యంలో స్థానాన్ని సుస్థిరం చేసుకున్న ‘అంపశయ్య’ నవీన్‌తో ఆయన నవలల గురించి జరిపిన సంభాషణ ఇది.

**మీ నవలల్లో ‘అంపశయ్య’కు ఎలాంటి స్థానం ఇస్తారు?**

నేను రాసిన 35 నవలల్లో ఈ నవలకే మొదటి స్థానం ఇస్తాను. ఆరంభ యౌవనంలో అడుగుపెట్టిన యువతీయువకుల మైండ్స్‌ని ఈ నవల శోధించినంత నిశితంగా, లోతుగా, నిర్భయంగా శోధించిన నవల తెలుగులో మరొకటి లేదనే నా అభిప్రాయం.

**‘అంపశయ్య’ను తెలుగులో చైతన్య స్రవంతి శైలిలో రాయబడిన మొదటి నవలగా పేర్కొంటారు. అదే శైలిలో రాసిన జేమ్స్ జాయ్స్, వర్జీనియా వూల్ఫ్ వంటి పాశ్చాత్య రచయితల ప్రభావాలు మీపై ఉన్నాయా?**

‘అంపశయ్య’ రాయడం సగం పూర్తి చేసేంతవరకు నాకు ‘చైతన్య స్రవంతి’ అనేది ఒకటుందని, ఆ శిల్పంతో జేమ్స్ జాయిస్, వర్జీనియా వుల్ఫ్ రచనలు చేశారని తెలియనే తెలియదు. నేను నల్గొండ కాలేజ్‌లో పనిచేస్తున్న రోజుల్లో సీతారామారావు అనే కామర్స్ లెక్చరర్ ఉండేవాడు. ఆయనకు సాహిత్యం మీద చాలా ఇంట్రస్ట్ ఉండేది. మేమంతా ఆయన చుట్టూ చేరి ఆయన చెప్పే సాహిత్యానికి సంబంధించిన కబుర్లని ఆసక్తిగా వింటూండేవాళ్ళం. నాకప్పుడు నేను రాస్తున్న ఈ నవల గురించి ఈయన ఏమంటాడో చూద్దామనిపించి సగం రాసిన నవలను అతనికిచ్చాను. దాన్ని చదివి “మీరు కొత్త టెక్నిక్‌తో రాస్తున్నారు. దీన్ని ‘చైతన్య స్రవంతి’ లేదా ‘స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్’ అంటారని మీకు తెలుసా” అన్నాడు. తెలియదన్నాను. “ఇదే టెక్నిక్‌తో జేమ్స్ జాయిస్ ‘యులిసెస్’ అనే గొప్ప నవలను రాశాడు. దీన్ని మన కాలేజీకి నేనే తెప్పించాను. ఓ పట్టాన అర్థం కాదనుకోండి. దానికి స్టువర్ట్ గిల్బర్ట్ అనే ఆయన ‘గైడ్ టు యులిసెస్’ రాశాడు. దాన్ని పక్కన పెట్టుకుని చదివితే అర్థమౌతుంది” అన్నాడు. లైబ్రరీకి వెళ్ళి ఆ పుస్తకాలు చదవబోయాను. కొంచెం అర్థమై కొంచెం అర్థం కాలేదు. నేను అంపశయ్యలో అంత సంక్లిష్టమైన టెక్నిక్‌ను ఉపయోగించ లేదు. టెక్నిక్ కోసం నేనా నవలను రాయలేదు. నాలో కలిగే ఫీలింగ్స్‌ని దాపరికం లేకుండా యథాతథంగా రాయాలని అనుకున్నానంతే.

**వందకు పైగా కథలు రాసినప్పటికీ మీకు నవలాకారునిగానే గుర్తింపు లభించింది. కారణం ఏమై ఉంటుంది?**

నన్ను నవలాకారునిగానే చూడడానికి చాలా కారణాలున్నాయి. కొందరు కావాలని కుట్రపూరితంగా నా కథల్ని అణచి వెయ్యాలని చూశారు. అయినా కొందరు సహృదయులు- ఆర్.ఎస్. సుదర్శనం, మధురాంతకం రాజారాం, మునిపల్లె రాజు లాంటి వాళ్ళు నవలాకారుడిగా నువ్వెంత గొప్పవాడివో కథకుడిగా కూడా అంతే గొప్పవాడివని ప్రశంసించారు. మన కొందరు విమర్శకులకు ఉద్యమాలను గురించి రాసిన కథలు మాత్రమే అర్థమౌతాయి గాని మానసిక సమస్యలను గూర్చి మనో విశ్లేషణే ప్రధానంగా రాసిన నా కథలు అర్థం కావు. అర్థమైనా పట్టించుకోరు.

> నన్ను నవలాకారునిగానే చూడడానికి చాలా కారణాలున్నాయి. కొందరు కావాలని కుట్రపూరితంగా నా కథల్ని అణచి వెయ్యాలని చూశారు. మన కొందరు విమర్శకులకు ఉద్యమాలను గురించి రాసిన కథలు మాత్రమే అర్థమౌతాయి గాని మానసిక సమస్యలను గూర్చి మనో విశ్లేషణే ప్రధానంగా రాసిన నా కథలు అర్థం కావు.

**మీ సుదీర్ఘ సాహిత్య జీవితంలో కవిత్వమే రాయలేదు. ఎందుకు?**

ప్రారంభ దశలో కవిత్వం రాశాను. ఛందోబద్ధంగా రాసిన తేటగీతుల్ని హైస్కూల్‌లో మాకు తెలుగు చెప్పిన విశ్వనాథ వెంకటేశ్వర్లు గారికి చూపించాను (ఆయన స్వయంగా విశ్వనాథ సత్యనారాయణ తమ్ముడు). నేను రాసిన కొన్ని చిన్న కథల్ని కూడా ఆయనకు చూపించాను. “నువ్వు రాసిన పద్యాలకంటే నీ కథలే బాగున్నాయిరా” అన్నాడు. ఇంకొక విషయమేమిటంటే ఆరోజుల్లో ఇంకా వచన కవిత్వం ప్రాచుర్యంలోకి రాలేదు. ఛందోబద్ధంగానే కవిత్వం రాయాలి. నాకు ఆ గణాలు, యతిప్రాసలు పాటిస్తూ రాయడం సర్కస్ ఫీట్‌లా అనిపించేది. బహుశా అప్పటికి వచన కవిత్వం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చివుంటే నేను కూడా కవిత్వం రాసేవాడినేమో.

**ఒకే ఘటనను కొందరు వ్యక్తులు తమ తమ భిన్నమైన కోణాల్లో అర్థం చేసుకుని భిన్నమైన అవగాహనతో ఎట్లా ప్రతిస్పందిస్తారో చూపిస్తుంది అకిరా కురసోవా ‘రషోమన్’ సినిమా. ఇదే శైలిలో ‘దృక్కోణాలు’ నవలను మీరు రాశారు. ఈ ప్రయోగాన్ని పాఠకులు ఎట్లా స్వీకరించారు?**

మంచి సినిమాలకూ, సాహిత్యానికీ చాలా సన్నిహితమైన సంబంధం ఉంటుంది. అకిరా కురసోవా ‘రషోమన్’ నన్ను చాలా ఆలోచింపజేసింది. సంఘటన ఒకటే ఐనా దాన్ని ఒక్కొక్కరం ఒక్కొక్క విధంగా, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వాళ్ళకు నచ్చిన విధంగా అవగాహన చేసుకుంటారు. నిజానిజాలతో పనిలేదు. ఆ సంఘటన నుండి వాళ్ళకిష్టమైన కన్‌క్లూజన్స్‌ను రాబట్టుకోవడమే వాళ్ళకు కావాలి. మనిషిలోని ఈ మానసిక స్థితినిబట్టి, ఏ కన్‌క్లూజన్ అతనికి తృప్తినిస్తుందో అన్నదాన్నిబట్టి మనిషిలోని ఆలోచనా విధానం ఉంటుంది. అందరి వ్యక్తుల కన్‌క్లూజన్స్ ఒకే విధంగా ఉండవు. మనిషిలోని ఈ అవగాహనా పద్ధతినిబట్టి వాళ్ళ దృక్కోణాలు మారుతూంటాయి. ఈ అంశాన్ని హైలైట్ చెయ్యడానికే నేను ‘దృక్కోణాలు’ నవలను రాశాను. కొందరు పాఠకులు నవల ప్రధాన సంఘటన ‘రేప్’ అయ్యుండకపోతే ఇంకా బావుండేదన్నారు.

**1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అతిసాహసోపేత వస్తువుతో ‘చీకటి రోజులు’ నవలను రాసి ప్రకటించారు. అప్పటి స్థితిగతుల గురించి చెప్పండి?**

1975 ఎమర్జెన్సీని సమయంలో నేను ‘అరసం’ సంస్థలో ఉన్నాను. అరసం సీపీఐకి అనుబంధ సంస్థ. సీపీఐ ఎమర్జెన్సీని సపోర్ట్ చేసింది. నన్ను అరెస్ట్ చేయాలని చూశారనీ, కాని అరసం సీపీఐ అనుబంధ సంస్థ కాబట్టి అరెస్ట్ చేయొద్దనుకున్నామని నాకు ఒక పోలీస్ ఆఫీసర్ చెప్పారు. అప్పుడు నా మిత్రుడు తిరుపతయ్య జమ్మికుంటలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ‘విరసం’ సంస్థతో చాలా కొద్ది చినచిన్న సంబంధాలున్నాయని పోలీస్‌వాళ్ళు కనిపెట్టి అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసి ఆయనను ఏ పోలీస్ స్టేషన్‌లోనో జైలులోనో నిర్బంధించలేదు. కరీంనగర్ దగ్గరున్న ఒక ఊరి పోలీస్ క్యాంప్‌లో పెట్టారు. 24 రోజుల తర్వాత విడుదల చేశారు. పోలీస్ క్యాంప్ నుండి విడుదలయ్యాక నేను జమ్మికుంటకు వెళ్ళి ఆయనను కలిశాను. ఇన్ని రోజులు ఆ పోలీస్‌క్యాంప్‌లో ఏం జరిగిందో, ఒక్కొక్క పోలీస్ ఆఫీసర్ ఎలా ప్రవర్తించాడో చెప్పాడు నాకు. “దీన్ని బ్యాక్‌గ్రౌండ్‌గా తీసుకుని ఒక నవల రాయి తిరుపతయ్యా” అన్నాను. దానికాయన “రాస్తే నన్ను పోలీసులు పట్టుకుపోవడం ఖాయం” అని భయపడ్డాడు. అప్పుడిక నేనే రాద్దామని నిర్ణయించుకున్నాను. ఆ రోజుల్లోనే ఒకసారి ‘ఈనాడు’ ఆఫీస్‌కు వెళ్ళి చలసాని ప్రసాదరావును కలిశాను. ఆయనకు ఈ ఆలోచన చెబితే- ఒక్క తిరుపతయ్య అనుభవాలే కాదు, ఆ రోజుల్లో మన దేశంలో అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అట్రాసిటీస్‌ని కవర్ చేస్తూ రాస్తే బాగుంటుందనీ, ఉన్నది ఉన్నదున్నట్టుగా కాకుండా కొంత కల్పనను కూడా జోడించి నవల పరిధిని విస్తృతం చేస్తే మంచి వర్క్ అవుతుందని చెప్పాడు. ఆయన చెప్పింది బాగానే ఉందనుకుని- కేరళకు చెందిన రాజన్‌ను మాయం చెయ్యడం, స్నేహలతారెడ్డిని పోలీస్ క్యాంప్‌లో పెట్టి హింసించడం, నరసింహులు అనే కేడీ కథ.. ఇవన్నీ కలిపి ఆ నవలను డైరీ రూపంలో రాశాను. ఎందుకోగాని దానికి రావలసిన గుర్తింపు రాలేదు. మొత్తం భారతదేశంలో ఎమర్జెన్సీ మీద రచించబడిన నవల అదొక్కటే అని అన్నారు చాలామంది.

ఇంటర్వ్యూ ■ రామా చంద్రమౌళి

## నా ఆత్మ ఆత్రం



నా వయస్సు లెక్కిస్తే అర్థమయింది
ఇంతవరకూ నేను బ్రతికున్నదానికంటే
బ్రతకడానికి నాకు తక్కువ సమయం ఉందని

ఆగామికంటే గతమే నాకు ఎక్కువని

ఆ చెర్రీ పండ్ల కలశంతో ఉన్న అబ్బాయిలా ఉంటుంది నాకు
ముందు ఆవురావురుమని వాటిని తిన్నాడు, కానీ
మిగిలినవి తక్కువేనని తెలిసాక, ముమ్మరంగా ఆవేశంగా రుచి చూసాడు.

సామాన్యమైన వాటితో వ్యవహరించే సమయం ఇంక నాకు లేదు

రగిలే అహంకార కవాతులు చేసే సభలలో నేను ఉండదలుచుకోలేదు

సమర్థుల్ని అపఖ్యాతి పాలుచేస్తూ, వారి స్థానాలు పీఠాలు ప్రతిభ ప్రగతి
అదృష్టం లాక్కోవాలని ఆశపడే అసూయపరులతో విసిగిపోయాను.

అప్రస్తుతం, నాకు పనికిరాని ఇతరుల జీవితాల విషయ చర్చలు,
అంతులేని సంభాషణలకు, నిజంగానే నాకు సమయం లేదు

కాలక్రమానుగత వయస్సున్నా అపరిపక్వులైన జనం సున్నితత్వాన్ని ముందుకు నడిపించడానికి లేదా నియంత్రించడానికి నాకు ఎక్కువ సమయం లేదు

కేవలం అధికార పత్రాలు తప్ప, విషయాన్ని చర్చించని వారిని, అధికారం కోసం పెనుగులాడేవారిని ఎదుర్కోవడం, నేను ద్వేషిస్తాను. అధికార పత్రాల్ని చర్చించడానికి నా దగ్గర అతితక్కువ సమయం ఉంది. ఈ ప్రపంచంలోని ఆంతరిక సారాంశాన్ని, నేను ఇప్పుడు అర్థం చేసుకోగలను.
నా ఆత్మ ఆత్రంలో ఉంది
నా కలశంలో ఎక్కువ చెర్రీలు లేవు

వారి బలహీనతల మీద వారే నవ్వుకునే వారికి,
మానవీయులకు దగ్గరగా ఉండాలనుకుంటాను,

స్వయంతృప్తులు, వారి విజయాలపై అతిగా ఊహించే వారికి దూరంగా,
స్వీయ ప్రాముఖ్యతలతో నిండి ఉన్నవారికీ దూరంగా

అత్యవసరాలే జీవితాన్ని విలువైనదిగా చేస్తాయి
కావలసినదానికంటే అత్యవసరాలే నాకు ఎక్కువ

అవును, నేను తొందరలో ఉన్నాను
పరిపూర్ణతనిచ్చే తీవ్ర ఆవేశంతో బ్రతకడానికి, నేను తొందరపడుతున్నాను
మిగిలిన చెర్రీలను నేను వ్యర్థం చేసుకోవాలనుకోవడం లేదు
అవి ప్రశస్తమైనవని నాకు ఖచ్చితంగా తెలుసు,
ఇంత వరకూ తిన్న వాటికంటే కూడా.

కన్‌ఫ్యూసియస్ చెప్పినట్టు “మనకు రెండు జీవితాలు. రెండవది మొదలయ్యేది, ఒక్కటే మిగిలుందని గ్రహింపుకు వచ్చినపుడు”

బ్రెజిల్ కవి ■ మారియో డె అంద్రాడే (1893–1945)
అనువాదం ■ ముకుంద రామారావు
✆ 99083 47273



## మరో కల వస్తుందా

సుదూర గతంలో ఒక సాయంత్రం
ఆ ఒంటరి భవంతి పైఅంతస్తు మూల గదిలో
ఒక్కడినే కాసేపు కూర్చుని కాసేపు పచార్లు చేసి
బయటికి నడిచాను నిమ్మళించిన లోపలితో

వచ్చేటప్పుడు గది కిటికీ లోని పూల తీగా
నిశ్శబ్ద రాగాల కొసా నా చేతిని తాకిన స్పర్శ గుర్తుంది

మెట్లు మృదువుగా దిగువకు దింపాయి
కింద అలంకారవిన్యాసాల సీతాకోకల రంగులనూ
రెపరెపలనూ అబ్బురంతో చూస్తూ వుండగానే..

కల చటుక్కున ఆగిపోయింది, బహుశా తెగిపోయిందేమో!

కళ్లు తెరిస్తే ఆ భవంతి లేదు, పూల తీగా లేదు
నిస్సవ్వడీ లేదు చుట్టూరా సీతాకోక ఒక్కటీ లేదు

చాలా ఏళ్లయినా గతపు పచ్చిక బయళ్ళ నుంచి
ఆ కల తలపుకొస్తూనే ఉంది అపుడపుడు
పాత స్నేహితుడి పలకరింపులా, పిలుపులా

ఇంతకీ
ఆ భవంతి ఎక్కడిది ఏ కాలం నాటిది ఎవరిది?
ఆ గది పాపం ఒంటరిగానే ఉందా నేనొచ్చాక?
ఆ పూల తీగ అట్లాగే వేచి వుందా వాడకుండా?
ఆ సీతాకోకలు రంగుల ఉత్సవోత్సాహంతో
అక్కడే తిరుగుతూ ఉన్నాయా కాలాన్ని ఓలలాడిస్తూ?

వెళ్లాలి, వాటిని మళ్ళీ కలవడానికి, కాసేపైనా
కానీ వెళ్లేదెట్లా?

ఏదో మరొక అపురూప రాత్రి ప్రయాణంలో
మరో కల వస్తుందా స్వయంగా ప్రియంగా
నన్ను అక్కడికి తీసుకెళ్లడానికి?

■ దర్భశయనం శ్రీనివాసాచార్య

✆ 94404 19039

# పుస్తకం చూసి నాలిక కరుచుకున్నాను!

## నా మొదటి పుస్తకం

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

నిజానికి నేను అచ్చులో చూసుకున్న నా మొదటి పుస్తకం ఒక నాటిక. 1973–80 మధ్య లెక్కలేనన్ని ప్రదర్శనలు, పురస్కారాల తరువాత జాతీయ నాటకంగా 14 భాషల్లో ఆకాశవాణిలో లెక్కలేనన్నిసార్లు ప్రసారం అయింది. నా బాల్యమిత్రుడు, నటుడు వి.ఎస్. రామేశ్వరరావు కథ చెప్పగా, కూర్పు చేసి నాటకీకరించాను. అది టీవీ నాటకం అయిన తరువాత ఎవరో సినిమాగా తీశారు. నేను చూడలేదు. నాకు ఇప్పటికీ ఆ నాటిక చేసిన హడావుడి అర్థం కాలేదు.

వచన రచయితలు చాలామందికి కవిత్వం అంటే ఇష్టం. 1963 ప్రాంతంలో నేను ‘గాలిబ్ గీతాల’ కిక్కులో కొన్ని డజన్లు రాశాను. కానీ అప్పుడే నా కవిత ఏదో ఒక పత్రికలో వచ్చింది. 1971 నుంచీ చాలా కవిత్వం రాశాను. నేను కవిని కాదనే గ్రహింపు ఉండేది అప్పటికే. ఇప్పటికీ కథలు రాస్తున్నప్పుడు మధ్యలో, మార్జిన్లో గిలుకుతుంటాను. 2015లో అనుకుంటాను– ఉగాది కవి సమ్మేళనానికి నన్ను ఆహ్వానించడానికి ప్రభుత్వ అధికారి ఒకాయన ప్రయత్నించాడు. ధన్యవాదాలు చెప్పి నేను కవిని కాదు గనక రాలేనని చెప్పుకున్నాను. ఆయన సంతోషించి “పది నిముషాల కవిత్వం చదవడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారుల చేత ఒత్తిడి చేయిస్తారు” అన్నాడు.



1990లో ‘గుండె గోదావరి’ పేరుతో నా కవితా సంకలనం అచ్చయింది. అవన్నీ అంతకుముందు ఎప్పుడో రాసుకున్నవి. ఆ కాయితాలు దొరికినప్పుడు ఒక పుస్తకంలో తిరగ రాసుకున్నాను. అప్పట్లోనే ‘మూగిదాని మానభంగం’ అని వలసల మీద దీర్ఘ కవిత రాశాను. ఆ రోజుల్లో నెలలో సగం పైగా హైదరాబాద్‌లో ఉండేవాడ్ని. ప్రసాద్ అనే బేంక్ మిత్రుడు ఒకసారి కవితల పుస్తకం చూసి “గురు గారూ, పుస్తకంగా వెయ్యండి సార్,” అన్నాడు. ఆ విషబీజం వేరూని నాలుగైదు రోజుల తరవాత అచ్చుకి పంపించాను. అందులో అక్షర దోషాలు వగైరాలున్నాయి. తరువాత దిద్దుబాట్లు చేసుకోవచ్చనుకున్నాను. నేను హైదరాబాద్‌కు వచ్చేశాను. అప్పటికి సుల్తాన్‌పూర్ పారిశ్రామిక కాలుష్య సమస్యలో పీకల దాకా మునిగి ఉన్నాం. ఢిల్లీ వెళ్లి PIL వేసే పనిలో ఉన్నాం. పుస్తకం తయారైందని తెలిసింది.

> చేరాతలు సంచలనం కలిగిస్తున్నప్పుడు మిత్రులు చేకూరి రామారావు గారు, స్నేహభావంతో అనుకుంటాను ‘గుండె గోదావరి’ మీద ఒక వారం రాశారు. తరవాత ఎప్పుడో ఒకాయన అందులో కొన్ని కవితలను ఇంగ్లీషులోకి అనువదించారు. నాకు నచ్చక ముందుకి వెళ్లనివ్వలేదు. నాకు అప్పటికే నా పుస్తకం మీద ఆసక్తి పోయింది. కొంచె అటూ ఇటూగా నా కవితల పుస్తకం బారిస్టరు పార్వతీశం టోపీలా తయారైంది.

మోహన్‌గారిని కలిసినప్పుడు ముఖచిత్రం గీసి ఇమ్మని అడిగేను. అతను నాలుగైదు రోజుల్లో బొమ్మ గీసి నేనుండే బంజారాహిల్స్‌కి శివాజీతో సహా తీసుకొచ్చాడు.

పుస్తకం అచ్చుకాకముందు తీసుకోవలసిన జాగ్రత్తలలో ఒక్కటి కూడా పట్టించుకోలేదు, ఎందుకో తెలీదు. అచ్చు అయిన దగ్గర్నుంచీ సుల్తాన్‌పూరు గొడవల్లో మునిగిపోయాను.

రాజమండ్రి వచ్చి పుస్తకం చూశాను. లోపల కొన్ని చదివి నాలిక బలంగా కరుచుకున్నాను. తెలుగు యూనివర్సిటీలో సాహిత్య సభలు జరిగేయి. మా అందరికీ మంచి కాలక్షేపంగా ఉండేది. పుస్తకం సభల సందర్భంగా ఆవిష్కరించాలనుకున్నాం. ఆచార్య జీవీ సుబ్రహ్మణ్యం గారు ప్రసంగించారు. మిత్రులు రామబ్రహ్మంగారు నడిపించారు. చాలామంది వచ్చేరు. యూనివర్సిటీ పని మీద వచ్చి సభని అలంకరించారు.

చేరాతలు సంచలనం కలిగిస్తున్నప్పుడు మిత్రులు చేకూరి రామారావు గారు, స్నేహభావంతో అనుకుంటాను, ‘గుండె గోదావరి’ మీద ఒక వారం రాశారు. తరవాత ఎప్పుడో ఒకాయన అందులో కొన్ని కవితలను ఇంగ్లీషులోకి అనువదించారు. నాకు నచ్చక ముందుకి వెళ్లనివ్వలేదు. నాకు అప్పటికే నా పుస్తకం మీద ఆసక్తి పోయింది. మరుసటి ఏడాది ‘వడ్ల చిలకలు’ కథా సంపుటి వేశాను. కొంచె అటూ ఇటూగా నా కవితల పుస్తకం బారిస్టరు పార్వతీశం టోపీలా తయారైంది.

ఫోన్: 94407 03440

## చదువు ముచ్చట

రవి మంత్రి

# రచయిత పరిశీలన కనపడే రచన నచ్చుతుంది




**మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?**
చలం ‘మైదానం’. 17–18 సంవత్సరాల వయసులో చదివాను.

**మీ పుస్తకాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?**
ఒక వర్గం కోసమో, ఎవరినో చదివించటానికో రాసే కథలు కాక, ఈ రచయిత చాలా పరిశీలన చేసి రాసాడు, జీవితం మీద పట్టు ఉంది అనిపించే కథలు నచ్చటం మొదలుపెట్టాయి.

**ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?**
కేశవరెడ్డి నవల ‘మునెమ్మ’.

**ఏ తరహా పుస్తకాల్ని చదవటానికి ఇష్టపడతారు?**
నిజ జీవితానికి దగ్గరగా ఉండేవి. ఇది నేను ఎక్కడో చూసాను అనిపించేవి.



**సాహిత్యంలో మీకు నచ్చిన కల్పిత పాత్ర?**
బుచ్చిబాబు ‘చివరకు మిగిలేది’ నవలలో దయానిధి.
యండమూరి ‘అనైతికం’ నవలలో అహల్య.

**గత కాలం రచయితల్ని కలిసి మాట్లాడగలిగితే ఎవరితో మాట్లాడతారు?**
చలం, గొల్లపూడి, యద్దనపూడి.

**మీకు తరచుగా గుర్తొచ్చే కొటేషన్/ కవితా పంక్తి?**
“నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే నిబిడాశ్చర్యంతో వీరు- నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలిపోతే నిర్దాక్షిణ్యంగా వీరే..”
(శ్రీశ్రీ ‘మహాప్రస్థానం’)

ఎవరైనా సక్సెస్ గురించో, నా విజయాల గురించో మాట్లాడితే ఈ మాట ఒకసారి నా మైండ్ లోకి వచ్చి వెళ్తుంది. అందుకే నేను దేనినీ తలకి ఎక్కించుకోను.

(రవి మంత్రి మొదటి నవల ‘అమ్మ డైరీలో కొన్ని పేజీలు’ 2023లో విడుదలైంది.)

### ఉగాది కవితల పోటీ


కార్తీక డెవలపర్స్ సాహితీ కిరణం సౌజన్యంతో శ్రీ విశ్వావసు నామ ఉగాది కవితల పోటీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.2వేలు, రూ.1500. రెండు ప్రత్యేక బహుమతులు ఒక్కొకటి రూ.1000. ముప్పై లైన్లు మించని కవితలను జనవరి 31లోగా పోస్ట్ కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. చిరునామా: ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం. 11–13–154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ – 500102కు పంపాలి. మరిన్ని వివరాలకు: 94907 51681.

సాహితీ కిరణం

### కవి సంధ్య కవితల పోటీ

మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా కవి సంధ్య, యానాం – చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్, నెల్లూరు సంయుక్త నిర్వహణలో కవితల పోటీని నిర్వహిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2500, రూ.1500. ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొకటి రూ.1000. ఫిబ్రవరి 15లోగా పోస్టు, కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. చిరునామా: దాట్ల దేవదానం రాజు, ఐక్రియనగర్, యానాం (పోస్ట్) – 533464. మరిన్ని వివరాలకు: 94401 05987.


కవిసంధ్య





సంక్రాంతి పండగ వేళ భారీ స్థాయిలో కోడి పందేలు నిర్వహించడానికి నిర్వాహకులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అంపాపురం, రామవరప్పాడులో హైటెక్ హంగులతో బరులు సిద్ధం చేశారు. వివిధ రకాల జూద క్రీడలతో ఇక్కడ కోట్ల రూపాయలు చేతులుమారనున్నాయి. ఇప్పటి వరకు ఉన్న బరులు కాకుండా కొత్తకొత్తగా బరులు వెలుస్తున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పందెం రాయుళ్లదే పైచేయిగా కనిపిస్తోంది. కూటమి నేతల కనుసన్నల్లో అనుచరులు 'బరి'తెగిస్తున్నారు.


ఈడుపుగల్లులో బరులు


రామవరప్పాడులో సిద్ధమైన బరులు

# బరితెగించారు!

## ఉమ్మడి జిల్లాలో కోడి పందేలకు భారీగా ఏర్పాట్లు

### రూ.3కోట్లు పలికిన అంపాపురం బరి

- రామవరప్పాడులో భారీ సెట్టింగ్‌లు
- తెలంగాణ సరిహద్దుల్లో కొత్తగా బరులు
- రాజకీయ బలం ఉన్న బరుల వైపు చూడని పోలీసులు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** కోడి పందేల ముసుగులో ఆదాయాన్ని ఆర్జించే 'ఆట'లకు రంగం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఉమ్మడి జిల్లాలో కోడి పుంజులు కత్తులు కట్టుకుని గాల్లోకి ఎగరబోతున్నారు. ఈసారి భారీగా కోడిపందేల నిర్వహణకు ఏర్పాటు చేశారు. కోడిపందేలకు ఎలాంటి అనుమతులు లేవని, ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసు అధికారులు కొద్దిరోజులుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వాటిని పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. మామిడి తోటల్లో, ఆట స్థలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, రైతుల పొలాల్లో ఇలా ఎక్కడ చూసినా కోడిపందేల బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. పలు తోటలు, పొలాల్లో వేసిన బరులను పోలీసులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. కొన్నిచోట్ల మాత్రం బరులను బహిరంగంగానే ఏర్పాటు చేస్తున్నారు. వాటి వెనుక కూటమి నేతల బలం ఉండడంతో అటు వైపుగా పోలీసులు చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో అతిపెద్ద బరి అంటే అంపాపురం గుర్తుకొస్తోంది. ఇక్కడ నిర్వహించే బరుల్లో జరిగే కోడిపందేలకు ఎన్టీఆర్,కృష్ణా జిల్లాలతో పాటు పక్కనే ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వస్తుంటారు. ఒక్క అంపాపురం బరిలోనే మూడు రోజులపాటు కోట్లాది రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ బరిని రూ.3కోట్లకు ఒక పార్టీ నేతలు కొనుగోలు చేసినట్టు సమాచారం. ఈ మొత్తాన్ని రాబట్టుకునేందుకు ఇక్కడ కోడిపందేలతోపాటు పేకాట, గుండాట, కోత ముక్కాటలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేశారు. దీనితో పాటు మద్యం విక్రయాలకు ప్రత్యేకంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి మద్యాన్ని షాపుల్లో తప్ప ఇతర ప్రదేశాల్లో విక్రయించడం నిషేధం. ఒకవేళ ఇలా విక్రయాలు చేస్తే అది బెల్టుషాపు కిందకు వస్తుంది. పొరుగు ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఈ మద్యం స్టాల్‌ను కట్టబెట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై స్థానికంగా దుమారం రేగుతోంది. ప్రభుత్వం కేటాయించిన షాపు ఇక్కడ ఉండగా బరుల్లో బెల్టు షాపును ఎలా ఏర్పాటు చేస్తారని సంబంధిత మద్యం వ్యాపారి గొడవ చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ బరులను క్యాసినో కింగ్ చీకోటి ప్రవీణ్ అనుచరులు నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

**అందరి చూపు అంపాపురం వైపే!**

### వెలుస్తున్న కొత్త బరులు


పటమటలో..

ఎన్టీఆర్ జిల్లాలో అంబాపురం, జక్కంపూడి లోని పాముల కాల్వ ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేయడానికి ఇద్దరు ప్రజాప్రతినిధుల అనుచరులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇక్కడ ఫుడ్‌స్టాల్, జూదం నిర్వహించే బల్లలను విక్రయించేసినట్టు తెలిసింది. బిర్యానీ స్టాల్‌కు రోజుకు రూ.10వేలను నిర్ణయించారు. లోపల-బయట, గుండాట బల్లలను రూ.5లక్షలకు విక్రయించేసినట్టు సమాచారం. తెలంగాణకు సరిహద్దు గ్రామాలుగా ఉన్న గరికిపాడు, బూదవాడ, తొర్రగుంటపాలెం, తిరుమలగిరి, జగ్గయ్యపేటలో బరులను ఏర్పాటు చేశారు. ప్రతి సంక్రాంతికి తెలంగాణ నుంచి వేలాది మంది పందేలకు వస్తుంటారు. ఈసారి వారిని సరిహద్దుల్లో నిలుపుదల చేయడానికి గరికపాడు, బూదవాడ గ్రామాల్లో కొత్తగా బరులు ఏర్పాటు చేశారు. పెనుగంచిప్రోలు, కంచికచర్లలో హైటెక్ జూదం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. పెనుగంచిప్రోలులో ఫంక్షన్ హాళ్లు ఎక్కువగా ఉన్నాయి. వాటిల్లో సంక్రాంతి సంబరాల ముసుగులో ఈ హైటెక్ జూదం నడపటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రామవరప్పాడులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నివాసం ఉండే ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీకి చెంతనే ఒక ప్రజాప్రతినిధి అనుచరులు కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలకు పరిమితమైన బరులు విజయవాడ నగరంలో అడుగుపెడుతున్నాయి. పటమటలంకలో డీమార్ట్ వెనుక భోగి నుంచి కనుమ వరకు పందేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బందరు మండలం రుద్రవరంలో భోగి మంట


# పండుగ కళ

## నేడు భోగి

గ్రామాల్లో పందెం కోళ్ల సందడి • ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతిని మూడు రోజుల పాటు జరుపుకునేందుకు పల్లెలు, పట్టణాలు సిద్ధమయ్యాయి. చదువులు, ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు స్వగ్రామాలకు తరలిరావడంతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి. రంగవల్లులతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సారి పిల్లలకు పది రోజుల పాటు సెలవులు ఇవ్వడంతో వీలైనన్ని ఎక్కువ రోజులు పల్లెల్లో ఉండటానికి ప్లాన్ చేసుకున్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యులందరితో కలిసి బంధువుల ఇళ్లు చుట్టేశారు. తెలిసిన వారి ఇళ్లకు వెళ్లి పలకరిస్తున్నారు. ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి పిండివంటలు ఆరగించటం దగ్గర నుంచి స్థానిక థియేటర్లలో సినిమాలు చూడటం వరకు బిజీగా గడుపుతున్నారు. సోమవారం భోగి పండగ కావడంతో భోగి మంటలకు సిద్ధం చేసుకున్నారు. చిన్నారులకు భోగి పళ్లు పోయటానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

**కొనసాగిన ప్రయాణికుల రద్దీ**

హైదరాబాద్ నుంచి వచ్చిన వారు, ఇక్కడి నుంచి వెళ్లే వారితో విజయవాడ నగరంలో ఆదివారం రద్దీ నెలకొంది. విజయవాడ వచ్చిన వారందరినీ తరలించటానికి విశాఖపట్నం 9 స్పెషల్ బస్సులు, రాజమండ్రి రూట్‌లో 62 బస్సులు, రావులపాలెం రూట్‌లో 12 బస్సులు, అమలాపురం 8, ఏలూరు 11, కాకినాడ - 2 బస్సుల చొప్పున నడిపారు. వీటితో పాటు భద్రాచలం - 3, అవనిగడ్డ - 5, తిరుపతి - 2 చొప్పున బస్సులు నడిచాయి. మొత్తంగా 114 స్పెషల్ బస్సుల ఆపరేషన్ చేపట్టారు. పల్లెలకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగటంతో ప్రైవేటు స్కూల్, కాలేజీ బస్సులను కూడా తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం వారం రోజుల ముందే వెలువడి ఉంటే.. పరిస్థితి బాగుండేది. ఆదివారం రద్దీ లేకపోవడం వల్ల ప్రైవేటు స్కూల్, కాలేజీ బస్సుల అవసరం పెద్దగా లేకుండా పోయింది. ఆదివారం ఆర్టీసీ అధికారులు కేవలం నాలుగు బస్సులనే ప్రైవేటు విద్యాసంస్థలవి తీసుకున్నారు. తిరుగు ప్రయాణాల సందర్భంలో ప్రభుత్వ ఆదేశాలు ఆర్టీసీకి ఉపయోగపడే అవకాశం ఉంది. జనవరి 17, 18, 19, 20, 21వ తేదీలలో వరుసగా తిరుగు ప్రయాణాలు ఉంటాయి. ఈ ప్రయాణాల సందర్భంలో డిమాండ్‌ను బట్టి ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఎందుకంటే తిరుగు ప్రయాణాల బుకింగ్ ఇప్పటికే నూరు శాతం జరిగిపోయింది. తిరుగు ప్రయాణాల కోసం ఆర్టీసీ బస్సులలో రిజర్వేషన్ చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. తిరుగు ప్రయాణాల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు స్కూల్ బస్సులను ఉపయోగించుకునే అవకాశం ఉంది.

# కాసుల కక్కుర్తి

## ఏపీటీడీసీ మాజీ అధికారి నిర్వాకం

- పాత తేదీలతో సంతకాలు చేసి ఫైల్స్ క్లియర్
- కాంట్రాక్టర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు
- ఇప్పటి వరకు 8 ఫైల్స్‌కు క్లియరెన్స్.. మరో 10 ఫైల్స్‌పై దృష్టి
- వెళ్లిపోయిన అధికారి ధనకార్యాలకు సహకరిస్తున్న ఏపీటీడీసీ అధికారులు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో సీటు వదిలినా.. ఆ మాజీ అధికారి అవినీతి కాంక్ష మాత్రం తీరలేదు. అందరూ పండగ హడావుడిలో ఉంటే ఆయన మాత్రం వెళ్లిపోయినశాఖలోని పాత ఫైల్స్ క్లియర్ చేసే పనిలో పడ్డాడు. సంక్రాంతి పండగ నేపథ్యంలో విజయవాడ వచ్చిన ఆ అధికారి ప్రాజెక్ట్ విభాగంలోని ఫైల్స్‌ను తెప్పించుకుంటూ పెండింగ్ ఫైల్స్‌ను పాత తేదీలతో సంతకాలు చేస్తూ అందిన కాడికి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకుంటున్నాడు. ఫైల్‌కు రూ.లక్ష చొప్పున ఇప్పటి వరకు ఎనిమిది ఫైల్స్‌పై సంతకం చేసి రూ.8 లక్షలు చప్పరించినట్లు సమాచారం. ఈ పండగలోపు మిగిలిన ఫైల్స్‌ను కూడా పాత తేదీలతో క్లియరెన్స్ చేసి దండిగా సొమ్ములు తీసుకుని వెళ్లిపోవాలన్నది ఆయన ఉద్దేశం. వివరాల్లోకి వెళితే... వైసీపీ ప్రభుత్వంలో ఏపీటీడీసీ ప్రాజెక్ట్ విభాగంలో గత ప్రభుత్వం చెప్పినట్టు తలాడించిన సదరు అధికారిని కూటమి ప్రభుత్వం రాగానే సొంతశాఖకు పంపింది. ఆయన గతంలో పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేసేవారు. పబ్లిక్ హెల్త్ నుంచి ఏపీటీడీసీలోకి వచ్చారు. గత ఐదేళ్లు వైసీపీ వీర విధేయ అధికారిగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి సొంత శాఖకు పంపించటం జరిగింది. సొంత శాఖకు వెళ్లిన మనసంతా ఏపీటీడీసీపైనే ఉంది. అవినీతి రుచి వదల్లేక.. ఏపీటీడీసీలో పెండింగ్ ఫైల్స్‌పై దృష్టి సారించారు. ప్రాజెక్ట్ విభాగంలోని ఒక డీఈ ద్వారా ఫైల్స్‌ను తాను ఉంటున్న ప్రాంతానికి తెప్పించుకుని పాత తేదీలతో సంతకాలు చేస్తున్నారు. ఫైల్స్ తీసుకువస్తున్న డీఈని కూడా సదరు మాజీ అధికారి ఏరికోరి తెచ్చుకున్నట్టు సమాచారం.

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ దూకుడు టీడీపీ అధిష్ఠానాన్ని చిక్కుల్లో పడేస్తోంది. ఇప్పటికిప్పుడే రాజకీయాల్లో ఎదగాలనే నాయకుల తరహాలో ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేస్తూ తాను బాధ్యతాయుతమైన ఎమ్మెల్యేనన్న విషయాన్ని కొలికపూడి విస్మరిస్తున్నారు. దీంతో తరచూ తాను వివాదాల్లో కూరుకుపోతూ... పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. ఎమ్మెల్యే వ్యవహారశైలితో పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని నాయకులు ఆరోపిస్తున్నారు. కొలికపూడిపై చర్యలకు డిమాండ్ చేస్తున్నారు.

# ఆయన తీరు మారదు!

## పదే పదే వివాదాల్లో తిరువూరు ఎమ్మెల్యే

- టీడీపీ క్యాడర్‌ను పక్కన పెట్టేసి వైసీపీ నాయకులకు దన్ను
- ఎమ్మెల్యే వ్యవహారశైలితో పార్టీకి తీవ్ర నష్టమంటున్న నేతలు
- పార్టీ అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్



**(విజయవాడ - ఆంధ్రజ్యోతి):** బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిపై చెప్పుతో దాడి చేయడంతో కొలికపూడి పేరు ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా అందరికీ పరిచయం అయింది. ఆ తర్వాత ఆయన రాజకీయ ప్రస్థానం అనూహ్యంగా సాగి ఆయన్ను ఎమ్మెల్యేను చేసింది. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా కొలికపూడి తన దుందుడుకు నైజాన్ని వదల్లేదు. వాస్తవానికి కొలికపూడి గుంటూరు జిల్లా తాడికొండ వాసి. అలాంటి వ్యక్తి అనూహ్యంగా తిరువూరు టికెట్‌ను సొంతం చేసుకున్నారు. అంతకు ముందు ఐదు సంవత్సరాలుగా తిరువూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న శావల దేవదత్‌ను పక్కన పెట్టి మరీ కొలికపూడికి ఎమ్మెల్యే టికెట్‌ను పార్టీ అధిష్ఠానం కేటాయించింది. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కొలికపూడి వైఖరిలో రోజురోజుకి తేడా వస్తోంది.


గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, రాజకీయ నేతలు

**ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది రోజులకే..**

ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది రోజులకే గత ఏడాది జూలైలో ఎ.కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ నాయకుడు పంచాయతీ స్థలం ఆక్రమించి, భవనం నిర్మిస్తున్నాడంటూ ఆ భవనం వద్దకు వెళ్లి దాన్ని పడగొట్టాల్సిందేనంటూ ఆందోళనకు దిగారు. ఉన్నపళంగా భవనాన్ని పడగొట్టలేమని, ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినా ఆయన ససేమిరా అంటూ అక్కడే బైఠాయించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కావడంతో టీడీపీ అధినేత చంద్రబాబు శ్రీనివాస్‌ను పిలిపించుకుని మందలించారు. ఆ తర్వాత పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారంటూ సొంత పార్టీ ప్రజాప్రతినిధిని అందరి ముందు దూషించడంతో ఆ ప్రజాప్రతినిధి సతీమణి మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ వివాదం కూడా రాష్ట్రస్థాయిలో సంచలనం రేకెత్తించింది. ఈ ఉదంతం చల్లారకముందే మద్యం షాపుల వారిపై తన ప్రతాపం చూపారు. ఏకంగా మద్యం షాపులకు తాళాలు వేసేశారు. తాజాగా ఎస్టీ మహిళ అని కూడా చూడకుండా వార్డు సభ్యురాలిపై దాడి చేయడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది.

**నోటికి ఎంత వస్తే అంత..?**

కొలికపూడి నోటికి అదుపు ఉండదు. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడి వివాదాలకు కారణమవుతుంటారు. తాను సొంత నిధులతో కాల్వ పూడిక తీయిస్తే రైతులు తనకు సంఘీభావం తెలపడానికి రాలేదంటూ కొలికపూడి రెచ్చిపోయారు. రైతులను కుక్కల కంటే హీనంగా పోలుస్తూ 'కుక్కలకైనా విశ్వాసం ఉంటుంది.. ఇక్కడ కొందరు రైతులకు విశ్వాసం ఉండదు' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మరో సమావేశంలో.. 'నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు మెతక వైఖరి అవలంబిచొచ్చు, నేను అలా కాదు నేను అంత మంచోడిని కాదు' అంటూ కొలికపూడి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. 'రానున్న సహకార ఎన్నికల్లో బీసీలకు పెద్ద పీట వేస్తా, బీసీలను అందలం ఎక్కించడానికి ఒకడొచ్చాడు' అంటూ పార్టీ అధినేత సామాజికవర్గాన్ని అణచివేస్తా అంటూ కొలికపూడి వ్యాఖ్యానించడం నియోజకవర్గంలో పెద్ద చర్చకు దారితీసింది. టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీలకు పెద్దపీట వేస్తూ వచ్చిందన్న సంగతి విస్మరించి కులాల నడుమ చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు చేయడంపై పలువురు పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన అంశాలను ఉద్దేశపూర్వకంగా బహిరంగంగా సభల్లో ప్రస్తావించడం.. పార్టీ కంటే నేనే సుప్రీం అనే తరహాలో కొలికపూడి వ్యవహరిస్తుండటం పార్టీ అధిష్ఠానానికి తీవ్ర తలనొప్పులు తెస్తోంది. కొలికపూడి తీరుతో నియోజకవర్గంలో టీడీపీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఆయనపై అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకుని పరిస్థితిని చక్కదిద్దకపోతే కష్టమని నియోజకవర్గ నేతలు కోరుతున్నారు.

**అక్రమ మైనింగ్‌కు అండగా..**

తిరువూరు నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. ప్రజాప్రతినిధి అండ లేకుండా ఇక్కడ మైనింగ్ చేయడం అసాధ్యం. ఎమ్మెల్యేగా గెలిచిన తొలినాళ్లలో నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌పై వార్తలు రాసినందుకు 'ఆంధ్రజ్యోతి'పై తన అక్కసు వెళ్లగక్కారు. తిరువూరు చరిత్రలో మొట్టమొదటి సారి జర్నలిస్టు సంఘాలు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ర్యాలీ తీసే పరిస్థితి కల్పించుకున్నారు. ఆ తర్వాత నాలిక్కరుచుకుని వారికి బేషరతు క్షమాపణలు చెప్పారు. తన గెలుపు కోసం పనిచేసిన పార్టీ శ్రేణులను పక్కన పెట్టేసి వైసీపీ వారితో అంటకాగుతున్నారనే ఆరోపణలు ఎమ్మెల్యేపై ఉన్నాయి. వైసీపీ వారే నియోజకవర్గంలో మైనింగ్‌లో కీలకంగా ఉన్నారు. ఎమ్మెల్యే తీరుతో విసిగిపోయిన నియోజకవర్గ టీడీపీ నాయకులు కొద్ది రోజుల క్రితం పెద్ద సంఖ్యలో పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆయనపై ఫిర్యాదు చేశారు.

## అమరావతి రాజధానిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

4లో

- ప్రీమియర్ లీగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీ కేశినేని

## ఆహార ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే

4లో

## పుస్తక పఠనం.. వ్యక్తిత్వ వికాసం

మిగిసిన విజయవాడ పుస్తక మహోత్సవం





ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆదివారంతో ముగిసింది. పుస్తక ప్రియుల సందడి, రచయితల పుస్తకాల ఆవిష్కరణలు, సభలతో ప్రతి రోజూ పండగ వాతావరణాన్ని తలపించింది. ఎందరో ప్రముఖులు స్టాల్స్‌ను సందర్శించి తమ మనస్సుకు నచ్చిన పుస్తకాలను సొంతం చేసుకున్నారు. వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనానికి మించిన ఆయుధం లేదని స్పష్టం చేశారు.

4లో

## బియ్యం మాయం కేసులో మరో నలుగురు అరెస్ట్

- న్యాయమూర్తి ఎదుట హాజరు.. 24 వరకు రిమాండ్

**మచిలీపట్నం, జనవరి12 (ఆంధ్రజ్యోతి):** పేర్ని నాని గోడౌన్ నుంచి బియ్యం మాయం కేసులో మరో నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మచిలీపట్నానికి చెందిన మాతా వెంకటసుబ్బారావు, పామర్తి నాగేశ్వరరావు, గోపిశెట్టి నాంచారయ్య, కందుల బాపూజీలను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, వారికి ఈ నెల 24వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు ఆర్‌పేట సీఐ ఏసుబాబు వెల్లడించారు. గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ, మిల్లు యజమాని బాల ఆంజనేయులు, లారీ డ్రైవర్ మంగారావు సహకారంతో ఈ నలుగురు గోడౌన్ నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బియ్యం కొనుగోలులో డొక్కు నాగరాజు అనే వ్యక్తి పేరు బయటకు వచ్చింది. అయితే అతను ఇటీవల మరణించారు. మిల్లు యజమాని బాలఆంజనేయులుతో నాగరాజుకు ఉన్న స్నేహం కారణంగా గోడౌన్ నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లుగా పోలీస్ విచారణలో తేలింది. కాగా, పేర్ని నాని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో ఇప్పటి వరకు 10మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్యూఆర్ కోడ్.. బసవన్న!



సంక్రాంతి పర్వదినాల్లో గంగిరెద్దులను పల్లెటూర్ల నుంచి అలంకరించి పురవీధుల్లోకి తెచ్చి ఆడిస్తూ ప్రజలు ఇచ్చే బియ్యం, కూరగాయలు లేకుంటే చిల్లర గానీ తీసుకునే వారు..! ఇది నిన్నటి మాట. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ లావాదేవీలే నడుస్తుండటంతో చిల్లర సమస్య లేకుండా గంగిరెద్దుకే క్యూఆర్ కోడ్ తగిలించి రావడం ఆశ్చర్యం కలిగించింది. ఆదివారం సమరం ఆస్పత్రి సమీపంలోని వాసవ్యనగర్‌లో గంగిరెద్దుకు క్యూఆర్ కోడ్ తగిలించి ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేయడంతో చూసిన వారు ముచ్చటపడుతూ ఫోన్‌పే, గూగుల్ పేతో నగదును చెల్లించారు.

(కృష్ణలంక, ఆంధ్రజ్యోతి)

# నగరం జనసంద్రం



కిటకిటలాడుతున్న బీసెంట్ రోడ్డు

సంక్రాంతి పండుగ వేళ నగరం జనసంద్రమైంది. రైల్వే స్టేషన్, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, ప్రధాన రహదారులన్నీ వాహనాలు, జనంతో కిక్కిరిసిపోయాయి. బీసెంట్ రోడ్డు ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయింది. ప్రయాణాలు కష్టమైనా కుటుంబసభ్యులతో పండగ జరుపుకొనేందుకు స్వస్థలాలకు చేరుకుంటున్నారు.

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)



ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన పండిట్ నెహ్రూ బస్ స్టేషన్



రైల్వే స్టేషన్‌లో రద్దీ





కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలితకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

## కనకదుర్గమ్మ సేవలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లలిత దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలను కల్పించగా అమ్మవారి దర్శనానంతరం.. ఆలయ అధికారులు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



» జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో అద్భుత ప్రారంభాలకు నాంది పలికి ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటూ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సిరి సంపదలతో సంక్రాంతిని, కనువిందుగా కనుమని జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కష్టాలను దహించే భోగిమంటలు, ధాన్యపు రాసులతో నిండిన గదులు, ఇంటి ముంగిట కళకళలాడే అందమైన రంగవల్లులు, చిన్నారుల చిరునవ్వులు, పిండి వంటల ఘుమఘుమలు, బంధుమిత్రుల సందళ్లు, బసవన్నల ఆటపాటలతో సంక్రాంతిని ఆనందోత్సాహాల నడుమ అంగరంగ వైభవంగా జరుపుకోవాలన్నారు. మకర సంక్రాంతి ప్రజల జీవితానికి ప్రకాశాన్ని అందించాలని, ప్రతి ఇంటినీ ఆనందంతో నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## ఆహార ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే

» ప్రత్యేక బృందాలతో ముమ్మర తనిఖీలు : కలెక్టర్ లక్ష్మీశ



తనిఖీలు చేస్తున్న ఆహార భద్రతా అధికారులు

కృష్ణలంక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆహార ఉత్పత్తుల ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిందేనని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో వుంచుకొని ఉత్పత్తులు అత్యంత నాణ్యంగా వుండేలా చూసుకోవాల్సిందేనన్నారు. పండగ వేళ ఆహార భద్రత అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. తనిఖీల్లో సేకరించిన నమూనాల్లో ఏమైనా కల్తీగాని, నాణ్యత లోపంగాని వుంటే చర్యలు తప్పవన్నారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 పటిష్ఠ అమలుకు వివిధ శాఖల సమన్వయంతో కృషిచేయడం జరుగుతుందన్నారు. ఆహార భద్రత కమిషనర్, కలెక్టర్ ఆదేశాలు మార్గదర్శకాల మేరకు విజయవాడలోని పలు స్వీట్ షాపులు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించినట్టు జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి నమూనాలు సేకరించామని, వీటిని ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఎమ్మెల్యే కొలికపూడిపై చర్యలు తీసుకోండి

» తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైసీపీ నేతల ఆందోళన

ఎ.కొండూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళాపై దాడిచేసి, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణమైన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆయన అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ వైసీపీ నేతలు, బాధిత మహిళ కుటుంబసభ్యులు ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. స్థానికంగా సీసీరోడ్డు వివాదం విషయంలో ఎమ్మెల్యే, ఆయన అనుచరులు కలసి భూక్యా కృష్ణ, అతడి భార్య చంటిని దూషిస్తూ దాడికి పాల్పడ్డారని, దాంతో మనస్థాపం చెందిన చంటి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసి ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య ఉందని అన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎ.కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే తన అనుచరులపై కేసు నమోదు కాకుండా రాజీయత్నాలు చేసినట్టు సమాచారం. తరచు వివాదాలు, వర్గ రాజకీయలతో రచ్చకెక్కుతున్న ఎమ్మెల్యే తీరుపై తెలుగు తమ్ముళ్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

## బాబు కృషితోనే గ్రీన్‌కో ప్రాజెక్టు

» మంత్రి టీజీ భరత్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో నిర్మించిన గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే తలమానికం అని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ముందుచూపుతో ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రంలో నెలకొల్పేందుకు గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2018లోనే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందన్నారు. అయితే ఇప్పుడు కొందరు వ్యక్తులు ప్రాజెక్టు జగన్ విజన్ అని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో అనేక ఇబ్బందులు సృష్టించిందని, అనుమతుల జారీపై జగన్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని తెలిపారు. ప్రాజెక్టును సరైన విధానంలో ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచన కూడా వైసీపీకి లేదన్నారు. దీనిపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# గురువుకు వందనం

» వైభవంగా తాడంకి జడ్పీహెచ్ స్కూల్ శతాబ్ది ఉత్సవం » దేశ విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

» చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని తన్మయత్వం » చరిత్రాత్మక వేడుక : మంత్రి కొల్లు రవీంద్ర





సభలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, శతాబ్ది పైలాన్ ఆవిష్కరిస్తున్న యలమంచిలి శివాజీ

పమిడిముక్కల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : దూరదృష్టితో పాఠశాల ప్రారంభించి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి, వారి ఉన్నతికి బాటలువేసిన తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలసి శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చరిత్రాత్మకమని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, రాజ్యసభ మాజీసభ్యుడు యలమంచిలి శివాజీ అధ్యక్షతన ఆదివారం జరిగిన శతాబ్ది ఉత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలో విద్యనభ్యసించి దేశ విదేశాల్లో స్థిరపడిన వారందరూ పాఠశాల, రాష్ట్రాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. తాడంకి పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీ బాలశౌరి అన్నారు. పూర్వ విద్యార్థులు కలసి శతాబ్ది ఉత్సవం ఘనంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. పూర్వవిద్యార్థులు శతాబ్ది ఉత్సవం జరుపుకోవడం నియోజకవర్గానికి గర్వకారణమని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ఎందరినో ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దిన నాటి ఉపాధ్యాయులు చిరస్మరణీయులని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పాఠశాల ప్రారంభించిన అప్పటి మునసబు యలమంచిలి పిచ్చయ్య కాంస్య విగ్రహం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేయాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విగ్రహ ఏర్పాటుకు తనవంతు రూ.50వేలు విరాళం ప్రకటించారు.

పాఠశాలలో విద్యనభ్యసించిన రోజులను రాజ్యసభ మాజీసభ్యుడు యలమంచిలి శివాజీ గుర్తు చేసుకున్నారు. విద్యనేర్పిన నాటి గురువులు, ఇప్పటి ఉపాధ్యాయులకు పోలిక వివరించారు. ఎంతో విశిష్టత కలిగిన తాడంకి పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, పాలిటెక్నిక్ కోర్సులు ఏర్పాటుచేయాలన్నారు. పాఠశాల ఆవరణలో శతాబ్ది ఉత్సవ పైలాన్‌ను పూర్వవిద్యార్థులతో కలసి శివాజీ ఆవిష్కరించారు.

### నాటి ఉపాధ్యాయులకు సత్కారం

పాఠశాల పూర్వపు ఉపాధ్యాయులను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యలమంచిలి శివాజీ, ఎమ్మెల్యేలు కుమార్‌రాజా, వెకంట్రావు సత్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు గురజాడ వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, బసవయ్యలను ఉచిత రీతిన సన్మానించారు.

### దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వవిద్యార్థులు

తాడంకి పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకున్నవారితో పాటు యూఎస్, ఆస్ట్రేలియా, పలుదేశాల్లో ఉంటున్న ఎనిమిది మంది కలసి వేదికపై ఉత్సాహంగా గడిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జక్కా శ్రీనివాసరావు, మస్తాన్‌రావు, హెచ్ఎం ప్రసాద్, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, మంటాడ సర్పంచ్ వీరమ్మ, డీ వైఈవో పద్మారాణి, పూర్వ విద్యార్థి యలమంచిలి వెంకటేశ్వరరావు, ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గూడూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అది బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లేనని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం గూడూరు మండలం పర్ణశాలలో రూ.30 లక్షలతో 15 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరిలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని రాసే అవకాశం అంబేడ్కర్‌కి వచ్చిందంటే చదువుకోవడం వల్లే సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించాలన్నారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ హక్కుల వల్లే తాము ఈ స్థాయిలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నిడుమోలు మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, పత్తిపాడు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు, జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, పంచాయతీ రాజ్ డీఈ కైలా బాలకృష్ణ, కనిగంటి భాస్కరరావు, వేము కోటేశ్వరరావు, బోసిగల రామారావు, కొనకళ్ల బుల్లయ్య, యుగంధర్‌బాబు, న్యాయవాది వేము కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచ్ చిన్నం వెంకటరమణ, గొట్రు కోటేశ్వరరావు, బడుగు గోపాలకృష్ణమూర్తి, సదర్ల రాజశేఖర్, గూడపాటి సోమశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు. ప్రజా గాయకుడు రంగం రాజేష్ అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రవీంద్ర, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు తదితరులు

# క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

» మంత్రి కొల్లు రవీంద్ర





బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువత లక్ష్యసాధనకు పట్టుదల, కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు 3కె రన్ నిర్వహించారు. తొలుత పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జెండా ఊపి 3కె రన్‌ను ప్రారంభించారు. 1800 మంది పాల్గొన్న 3కె రన్‌లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఎంపీ వల్లభనేని బాలశౌరి కుమారులు అనుదీప్, అఖిల్, ఇంటర్ జిల్లా అధికారి సాల్మన్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోనేరుసెంటర్‌లో లక్కీడిప్ ద్వారా 25 మందికి రూ. 5వేల చొప్పున నగదు బహుమతులు, 10 కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ప్రతి రోజూ నడక, వ్యాయామం, యోగ చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు వీర్నాల ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 3కె రన్ దోహదపడుతుందన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, ఎన్ఆర్ఐ వీర్నాల బాలాజీ యువతలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఐదు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, వ్యాయామం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, వీర్నాల ఫౌండేషన్ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తోందన్నారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, యువత క్రమశిక్షణతో ఉంటూ తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన యువకెరటాలతో పాటు వీర్నాల ఫౌండేషన్ నిర్వహించిన వివిధ పోటీలు జిల్లా, నగర ప్రజలను చైతన్యపరిచాయన్నారు. జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, యువతకు ఆటపాటలతో పాటు చదువు కూడా అవసరమన్నారు. వీర్నాల ఫౌండేషన్ అధ్యక్షుడు వీర్నాల బాలాజీ అధ్యక్షత వహించిన సభలో మండలి వెంకట్రామ్, మాదివాడ రాము, మానస తదితరులు పాల్గొన్నారు.





## పుస్తకాలే నిజమైన సంపద

» పుస్తక మహోత్సవం ముగింపు సభలో వక్తలు

విజయవాడ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో ఎన్ని సంపదలున్నా, మనిషికి నిజమైన విలువ మంచి పుస్తకం వల్లే వస్తుందని, పుస్తకం మనిషికి ఎప్పటికీ దూరం కాదని గజల్ శ్రీనివాస్ చెప్పారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరి రోజు రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యక్తుల్లో మానవత్వాన్ని పెంచేందుకు, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకూ సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. జి.మాల్యాద్రి మాట్లాడుతూ, వ్యక్తులుగా ప్రపంచస్థాయిలో రాణిస్తున్న తెలుగు వారు, సమూహంగా దేశంలోనే వెనుకబడి వుండటం విషాదకరమన్నారు. పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ, సమాజం అభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయిలో గ్రంథాలయాలను, విద్యార్థులలో పుస్తకాలు చదివే అలవాటునూ పెంచాలన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ, పుస్తకాలు మనుషులకు మంచి స్నేహితులన్నారు. పుస్తకమహోత్సవం సంఘం కార్యదర్శి టి.మనోహర నాయుడు, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ, సభ్యులు జేపీ పబ్లికేషన్స్ ప్రసాద్, నవసాహితీ రవి, ఎమెస్కో లక్ష్మి, కార్యకర్తలు జనవిజ్ఞాన వేదిక శ్రీనివాస్, గోళ్ల నారాయణరావు, ముంజులూరి కృష్ణకుమారి, బాలాంత్రపు ప్రసూన సభలో పాల్గొన్నారు. రతన్ టాటా ప్రతిభా వేదికపై బాలలకు నిర్వహించిన పోటీలలో విజేతలకు సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు.

### జీవితంలో హాస్యమనే వెలుతురుండాలి

విజయవాడ కల్చరల్ : జీవితంలో హాస్యం అనే కాంతి వున్నప్పుడు, విసుగులూ, విషాదాలు అనే మబ్బులు ముసురుకునే అవకాశం వుండదని ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరిరోజు ఆదివారం రామోజీరావు సాహిత్య వేదికపై మొదటి కార్యక్రమంలో జీఆర్‌కే - పోలవరపు సంస్కృతి సమితి వారు హాస్యరచయితల తాజా రచనల పఠనంతో హాస్యరథం సభకు ఆమె ప్రయోక్తగా వ్యవహరించారు. ఈ సభలో ఇంగ్లీషు మాట్లాడాలనే మోజుతో సమాజంలో జరుగుతున్న విచిత్రాలపై హాస్యంగా 'ఇంగ్లీషుతోనే ఎంతపనైనా'? అంటూ సశ్రీ తన కథనంలో వినిపించారు. సన్మానాల పేరుతో జరిగే సంఘటనలను 'సన్మాన వైరాగ్యం'తో రావెళ్ల శ్రీనివాసరావు హాస్యంగా వర్ణించారు. జీవితంలో పైకి రావాలంటే ఎలాంటి నిచ్చెనలు, ఎలా ఎక్కాలో 'పైకి ఎక్కాలేగాని...అన్నీ నిచ్చెనలే' అంటూ మన్నం సింధు మాధురి హాస్యంగా వివరించారు. అందరి భాషలో తప్పులు పట్టే తెలుగు మాస్టారికి బస్సు ప్రయాణంలో ఎదురైన సంఘటనలను మొలుగు కమలాకాంత్ 'సన్యాసిరావు బస్సు ప్రయాణం'లో వివరించారు. తాజాగా పదవీ విరమణ చేసిన వారి మనోభావాలు ఎలా వుంటాయో గోవిందరాజు మాధురి తన 'ఉద్యోగం విరమిస్తే అందరికీ లోకువే' అంటూ నవ్వుపుట్టేలా వివరించారు. కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు తన హాస్యకథనంలో హాస్యం చేయడంలో, ఆస్వాదించడంలో వున్న ప్రమాదాలను నవ్వుపుట్టేలా వివరించారు. సభలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ హాస్యరచనలను, రచయితలను ప్రోత్సహించడం ఆనందదాయకమన్నారు.

## యూనివర్సిటీల్లో జీతాలు ఆపలేదు

» ఉన్నత విద్యామండలి

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బందికి యథావిధిగా జీతాలు అందుతున్నాయని, కొన్ని యూనివర్సిటీల్లో సాంకేతిక కారణాలతో ప్రక్రియ నిలిచిపోవడం మినహా ఎక్కడా జీతాలను ఆపలేదని ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జ్ కార్యదర్శి టీవీఎస్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీల్లో జీతాలు ఆగిపోయాయనే ప్రచారంపై ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీలు సాంకేతిక కారణాలతో జీతాల బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేయలేదని, అందువల్ల అక్కడ జీతాలు ఆగాయన్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ నాలుగు వర్సిటీల్లోని సిబ్బందికి కూడా జీతాలు జమ అవుతాయని తెలిపారు.

### మోడల్ స్కూళ్లలో కారుణ్య నియామకాలు చేపట్టాలి

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తూ చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ సంఘం అధ్యక్షుడు కె.శివశంకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. గత పదేళ్లలో 25 మంది టీచర్లు చనిపోయారని, 010 పద్దు కింద జీతాలు ఇస్తున్నా కారుణ్య నియామకాలు చేపట్టడం లేదని తెలిపారు. సర్వీసు రూల్స్‌తో సబంధం లేకుండా ప్రభుత్వ, జిల్లా పరిషత్ టీచర్ల తరహాలో కారుణ్య నియామకాలకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు.

## అమరావతి రాజధానిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

» ప్రీమియర్ లీగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధానిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం రాబోతుందని విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఫ్రై డే ఆఫ్ మంగళగిరి పేరుతో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 23వ తేదీ వరకు మంగళగిరిలో ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) సీజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం శివనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, మంగళగిరి ప్రజలు చాలా అదృష్టవంతులని, మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో అందరికంటే ముందున్నారని కొనియాడారు. గతంలో నియోజకవర్గ స్థాయికే పరిమితమైన క్రికెట్ పోటీలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) సహకారంతో ఈ ఏడాది నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు మంగళగిరి జట్టుతో పాటు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కొక్క జట్టు పాల్గొంటుందన్నారు. ఫైనల్ మ్యాచ్ జనవరి 23న జరుగుతుందని, ఆ రోజే బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని, కొద్దిసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ నాయకులు సంకా బాలాజీ గుప్తా, టీడీపీ నాయకులు టి.పార్థసారథి, పర్వత మధు, ఎం.శివశేషయ్య, జి.దుర్గారావు, షేక్ రియాజ్, ఎం.వెంకట్, ఎ.భూలక్ష్మి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఐబిఎస్ కంపెనీ క్యాలెండర్ ఆవిష్కరణ..

మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్ హైదరాబాద్‌కు చెందిన ఐబిఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టేషన్ కంపెనీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంస్థ ఎండీ వడ్లమూడి హర్షకి ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.

# విజయవాడ తూర్పు

**బ్రాయిలర్ ధరలు**
అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 115,123, 134 |
| చికెన్ విత్ స్కిన్ | 216 |
| చికెన్ స్కిన్‌లెస్ | 226 |



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

## వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

**పాయకాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) :** భారత జాతికి వివేకానంద ఆదర్శాలు అవసరమని విశ్వహిందూ పరిషత్ సంఘటన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జన్మదినం పురస్కరించుకుని రామకృష్ణ సమితి, అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శోభయాత్రను నిర్వహించారు. ముందుగా స్కూలులోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలమే జీవనం బలహీనతయే మరణం అన్న వివేకానంద సూక్తిని ఆదర్శంగా తీసుకోవాలని వీహెచ్‌పీ సంఘటన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్ అన్నారు.

# మేరీమాత ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు

● ఎంపీ కేశినేని శివనాథ్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**కృష్ణలంక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** గుణదల మేరీమాత ఉత్సవాలు దేశంలో తమిళనాడు నాగపట్నంలో, విజయవాడలో మాత్రమే జరుగుతాయని, ఫిబ్రవరి 9, 10, 11న జరిగే ఈ ఉత్సవాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా చర్చి కౌన్సిల్ సభ్యులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీ రాజశేఖర్‌బాబులతో పాటు ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించుకొన్నారు. 10 లక్షల మంది పైగా భక్తులు వస్తారని కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. చర్చి కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎస్.విజయరాజు మాట్లాడుతూ కొండపైకి వచ్చే రహదారిలో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని వాటిని తొలగించాలని, అలాగే నిత్యం విజయవాడ బస్టాండ్ నుంచి, రైల్వే స్టేషన్ నుంచి గుణదల చర్చికి మినీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని వారిని అరికట్టడానికి ఆలయ ప్రాంగణంలో పోలీసు అవుట్ పోస్టు స్టేషన్ ఏర్పాటు చేయాలని అడిగారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గుణదల మేరీమాత ఉత్సవాలకు సంబంధించి ఇలాంటి రివ్యూ మీటింగ్ చర్చి కౌన్సిల్ సభ్యులతో జరగటం ఇదే మొదటిసారని అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకొంటామని తెలిపారు. గుణదల చర్చి ప్రెసిడెంట్ నువ్వుల విజయబాబు, వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి జోసెఫ్ బాప్టిస్టా, కోశాధికారి గోలి విజయానంద్ జోసెఫ్, సభ్యులు జి.రవికుమార్, పిల్లి చిరస్తుదాసు, సేవ అబ్రహం, దాసరి సిల్వ ప్రసాద్, బండి జయరాజు, జి.బాల బాబూజీ, సి.అరుణకుమారి, జి.యేసు దీవెనమ్మలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీడీపీ దళిత నేతలు నందిపాటి దేవానంద్, ఇత్తడి విక్టర్ చార్లెస్ ఊర్ల మోహనరావు, చాట్ల రాజశేఖర్, పరిసపోగు రాజేష్, సంకె విశ్వనాథం పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల ఫొటోతో ఉచిత క్యాలెండర్

**లబ్బీపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** వినియోగదారులకు మెరుగైన సేవలందించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంక్రాంతి పండుగ సందర్భంగా వినియోగదారులకు తమ కుటుంబ సభ్యుల ఫొటోతో నూతన సంవత్సరం క్యాలెండర్ అందజేస్తున్నామని పైలెట్ సర్వీస్ స్టేషన్ మేనేజర్ కె.వెంకటప్పయ్య తెలిపారు. బందర్ రోడ్డులోని తమ పెట్రోల్ బంకు నందు 14న ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు వినియోగదారులు వారి కుటుంబ సభ్యులతో వస్తే ఫొటోలు దింపి 2025 క్యాలెండర్‌పై ముద్రించి ఉచితంగా అందిస్తామనిని తెలిపారు.

## ఉద్యోగులకు 1300 కోట్ల బకాయిల విడుదలపై హర్షం

**ధర్నాచౌక్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుకగా రూ.1300 కోట్ల పాత బకాయిలు విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన బకాయిలు కూడా విడుదల చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జీఎల్ బాండ్స్ ద్వారా రావాల్సిన నగదు రావడం లేదని ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ మంచి ఫిట్మెంట్ ఇవ్వాలని ప్రకటనలో ప్రభుత్వాన్ని రాజు కోరారు.





టెంట్ లాగి పడేస్తున్న పోలీసులు

# కోడి పందేలకు భారీ ఏర్పాట్లు

● పటమటలో బరుల్ని ధ్వంసం చేసిన పోలీసులు

**పటమట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** కోడి పందేలను ఉక్కుపాదంతో అణచి వేయాలని కోర్టులు హెచ్చరిస్తున్నా, పోలీసులు దాడులు చేస్తున్నా పందెం రాయుళ్లు ఏమాత్రం తగ్గడం లేదు. పటమట 14.వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లోని దేవదాయ భూమి 10 ఎకరాలను శుభ్రం చేసి బరులు సిద్ధం చేశారు. ఆకాశమంత షామియాన వేసి బరులు సిద్ధం చేశారు. పోలీసులు వచ్చి తనిఖీలు చేసినా పట్టించుకోవడం లేదు. కోడి పందేలకు ఒక పెద్ద బరి, పేకాటకు మరో బరిని సిద్ధం చేశారు. వాహనాలు నిలిపేందుకు ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఎవరైనా కోడి పందేలు, పేకాటలు, గుండాలు ఆడితే కఠినంగా శిక్షిస్తామని పటమట సీఐ పవన్ కిషోర్ హెచ్చరించారు. అంబేడ్కర్‌నగర్‌లోని బరిని ఆయన సిబ్బందితో ధ్వంసం చేయించారు. జూదాలు దూరంగా ఉండాలని, సంప్రదాయ క్రీడలు ఆడుకోవాలన్నారు. ఎస్సైలు వర్మ, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

**బరులను ధ్వంసం చేసిన పోలీసులు**

పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడి పందేల కోసం సిద్ధం చేసిన పలు బరులను ఆదివారం పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. అంబేద్కర్‌నగర్, రామలింగేశ్వరనగర్, ఎనికేపాడు, రామవరప్పాడులోని నిర్వాహకులు ఏర్పాటు చేసిన బరులను ట్రాక్టర్లతో దున్నించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముగ్గుల పోటీల, ఎద్దుల పోటీలు, ఆటల పోటీలు లాంటి సాంస్కృతిక క్రీడలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి సంబరాల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

**పాయకాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** సంక్రాంతి పండుగ సందర్భంగా డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, పీఎన్ఎం సంయుక్త ఆధ్వర్యంలో 60వ డివిజన్ వాంబేకాలనీ ఈ బ్లాక్ గ్రౌండ్ వద్ద షటిల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించిన సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె. దుర్గారావు మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఆటల పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం సంతోషించదగ్గ విషయమన్నారు. సంక్రాంతి పండుగ అనగానే కోడిపందాలు, పేకాట వంటి ఆటల్లో యువకులు పాల్గొనడం రూ.లక్షలలో జూదాలు ఆడుతూ నష్టపోతున్నారరని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేతలు ఎస్కే పీరు సాహెబ్, పి. రవి, జి సాయి, ఎ. రత్నకుమారి, ఎన్ మహేష్, ఎస్ అప్పన్న, కె. రంగస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## చుట్టూ ఉన్న జీవితాల్లోంచి పుట్టినవే నా కథలు

● వేమూరి సత్యం

**విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** నేను రాసింది తక్కువ కథలే. వాటిలోని సంఘటనలు, పాత్రలన్నీ నా చుట్టూ ఉన్న సమాజంలో నుంచి స్వీకరించినవే అని అన్నారు ప్రముఖ చిత్ర నిర్మాణ సారథి, కథారచయిత వేమూరి సత్యం. ఒక కథ అనుకొని ప్రారంభించిన తర్వాత, నామీద నాకు ఎప్పుడూ సందేహమే, బాగా రాయగలనా లేదా అని ఎప్పటికప్పుడు తర్కించుకొంటూ ఉంటానన్నారు సత్యం. ఆదివారం శిఖర్ పాఠశాలలో తన కథల సంపుటి 'ఎనభైలో ఇరవై' ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సంపుటిలోని కథలను పరిచయం చేస్తూ చినుకు రాజగోపాల్, సత్యంగారి కథల్లో కథాప్రారంభం, నడక, ముగింపు ఒక ప్రత్యేకతను కలిగి వుంటాయని చాలా సరళమైన భాషలో సంభాషణలు రాయడం, దృశ్యాన్ని కళ్లకు కట్టినట్లుగా రచన చేయడం ఈయన రచనా విశేషమన్నారు. సత్యం బాల్యమిత్రుడు తుమ్మల గోపాలరావు మాట్లాడుతూ స్వాతి పత్రిక ప్రారంభించినప్పటి నుంచి జ్యోతి పత్రిక, సినిమారంగం మీదుగ 'మహర్షి' సినిమా కథారచయితగా, అనేక సినిమాలకు నిర్మాణ సారథిగా జరిగిన ఆయన జీవన గమనాన్ని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ సత్యం గారి కథల్లో మానవీయత తొణికిసలాడుతూ వుంటుందని, ఆయన తొలి నాళ్లలో రాసిన కథలకు ఇటీవల రాస్తున్న కథలకు మధ్య తేడాని మనం గమనించవచ్చని ఆనాటి కథలు అప్పటి జీవితాలను ప్రతిబింబిస్తే, ఇప్పటి కథలు ఈనాటి జీవితాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. సభలో శ్రీ శ్రీ విశ్వేశ్వరరావు, అంజని యలమంచిలి, తోటకూర రఘు, అనిల్ డ్యానీ, పుప్పాల శ్రీరామ్ పాల్గొన్నారు.

## 28న చలో ఢిల్లీకి భారీగా తరలిరావాలి

● బోను నరేష్

**గుణదల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లోనూ ముందుండేలా చేసేందుకు తన వంతు కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గా నరేష్ తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ కార్యవర్గ సమావేశం నగరంలోని వెటర్నరీ కాలనీలో ఆదివారం నిర్వహించారు. బోను దుర్గా నరేష్ మాట్లాడుత బీసీలకు సముచిత న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈనెల 28లోపు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ అధ్యక్షులను ఎంపిక చేయడం విద్యార్థి సంఘం, యూత్ విభాగం, మహిళా విభాగం, ఉద్యోగ విభాగం తదితర కమిటీలను నియమించడం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలివెళ్లి ఏపీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున గళం వినిపించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రంగు విక్రమ్, బీసీ సంఘం నేతలు కిరణ్, చింత శ్రీనివాస్, మెండం జ్యోతి, వివిధ జిల్లాల బీసీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో డబ్బే ప్రధాన సమస్య

● టీడీపీ నేత గొట్టిపాటి



**పటమట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు రాజకీయంగా ఎదగాలంటే డబ్బు ప్రధాన సమస్య అయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ వర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గొట్టిపాటి కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. తాను స్వామి వివేకానందకు అనుచరుడిని అన్నారు. 1990లో సేవ ప్రారంభించి అప్పట్లో బ్లడ్ బ్యాంక్ ద్వారా చాలామంది ప్రాణాలు కాపాడామన్నారు. ముఖ్య అతిథి, రాష్ట్ర ఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భారతదేశం ఆర్థికాభివృద్ధిలో ప్రపంచ దేశాల సరసన చేరబోతుందన్నారు. 29 ఏళ్ల సగటు వయస్సున్న యువత దేశంలో ఉండటమే అందుకు కారణమన్నారు. ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఏ విద్యాసాగర్‌ను ఘనంగా సత్కరించారు. మాజీ డీజీపీ మండవ విష్ణువర్ధన్, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, చంద్రమౌళి, కార్పొరేట్ ముమ్మనేని ప్రసాద్, దుర్గారావు, సాయి పాల్గొన్నారు.

## యువతను మేలుకొల్పిన గొప్ప మహానుభావుడు వివేకానంద

● నాయీ బ్రాహ్మణ జన సేవాసమితి చైర్మన్ గుంటుపల్లి

**భారతీనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా సమతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పాలిటెక్నిక్ కళాశాల సెంటర్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి నాయీ బ్రాహ్మణ జన సేవా సమితి చైర్మన్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైందవ సంస్కృతికి, సనాతన భారతీయ హిందూ ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన దార్శనికుడు వివేకానందుడని అన్నారు. సమతా సేవ ఫౌండేషన్, నాయీ బ్రాహ్మణజన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## జీవో 21ను తక్షణమే రద్దు చేయాలి

● ఆటో కార్మికుల ధర్నా

**సత్యనారాయణపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** ఆటోరంగ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న జీవో 21ని తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్రప్రధాన కార్యదర్శి పోలారి డిమాండ్ చేశారు. మోటారు, రవాణ రంగ కార్మికుల ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలైన సంక్షేమబోర్డు, జీవో 21 రద్దు, ఏడాదికి 15వేల ఆర్థికసాయం హామీలను అమలు చేయాలని ప్రగతిశీల ఆటోకార్మికసంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌టీఎస్‌రోడ్డు మీసాల రాజారావు జంక్షన్ నుంచి 250 ఆటోలతో ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలారి మాట్లాడుతూ గత ప్రభుత్వం వాహన మిత్ర ద్వారా రూ.10వేలు ఇచ్చి ఫైన్‌ల పేరుతో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రగతి శీల ఆటో కార్మికసంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఆటో మోటార్ కార్మికులకు ప్రతీ సంవత్సరం15వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామని, కార్మికసంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, కూటమి ఎన్నికల సమయంలో హామి ఇచ్చారని నేటికి ఏ ఒక్కటి అమలు కాలేదని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వం తక్షణం ఆటో, మోటారు రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దెత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ఆటోకార్మికసంఘం అధ్యక్షులు దాది శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు మునిశంకర్, ప్రధానకార్యదర్శి సిహెచ్. పెద్దిరాజు, నాయకులు డి.శ్రీధర్‌బాబు, వై. అప్పారావు,పింగళి రమణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎల్ఎన్ రాజు ప్రమాణం

**ధర్నాచౌక్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** అఖిల భారతీయ కోలి సమాజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన పీవీఎల్ఎన్.రాజు ప్రమాణస్వీకారం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. సంఘం జాతీయ అధ్యక్షుడు కశ్యప్ దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల అధ్యక్షుల చేత ప్రమాణస్వీకారం చేయించి అందరికి నియామక పత్రాలను అందజేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో విజయవాడలో అఖిల భారత కోలి సమాజ్ మహాసభ నిర్వహిస్తామని పీవీఎల్ఎన్.రాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పీవీఎల్ఎన్ రాజును అభినందించారు.

## నేడు త్రిశక్తిపీఠంలో విశేష పుష్పార్చన

**కృష్ణలంక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** త్రిశక్తిపీఠంలోని శ్రీ మహాకాళీ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు సోమవారం భోగిపండుగ రోజున విశేష పుష్పార్చన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన వివిధ రకాలైన పుష్పాలతో అమ్మవార్లను అలంకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున భక్తులందరూ అమ్మవారి సేవలో పాల్గొని తరించాలని వారు కోరారు.

# నేటి నుంచి ఆరాధనోత్సవాలు

**విజయవాడ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** సంగీత సన్మండలి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత ఉత్సవాలు ఈనెల 13 నుంచి 19 వరకు 7 రోజుల పాటు జరగనున్నాయి. సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల వేదికగా 13న సాయంత్రం 5.30 గంటలకు టి.బాలమురళీకృష్ణ నాదస్వరంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 118 బృందాలు సంగీత కచేరీలు చేసేందుకు తరలివస్తున్నాయి. దాదాపుగా 600 మంది కళాకారులు పాల్గొననున్నారు. 8న ఉదయం సంగీత కళాశాల వేదిక నుంచి త్యాగరాజ స్వామి ఆంజనేయ స్వామి నగరోత్సవం నిర్వహించనున్నారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు త్యాగరాజ స్వామి పంచరత్న గోష్ఠి రాత్రి 8 గంటలకు మహా బృందగానం జరుగుతాయి. ఈ రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి. కార్యక్రమాన్ని ప్రముఖ సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ పర్యవేక్షణ చేస్తున్నారు.



## యోగా విజేతకు గద్దె అభినందనలు

**పటమట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** సింగపూర్‌లో జనవరి 6 నుంచి 8 వరకు జరిగిన 10వ ఏషియన్ యోగా చాంపియన్ షిప్ పోటీల్లో పలు విభాగాల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన పోరంకి సత్య ప్రసాద్ రాజును ఆదివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్యంతో పాటు పతకాలు సాధించవచ్చని సత్యప్రసాద్ రాజు నిరూపించారన్నారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పతక విజేత మాట్లాడుతూ 12 దేశాల నుంచి యోగ సాధన చేసిన వారు గట్టి పోటీ ఇచ్చినా పతకం సాధించానన్నారు.

**సంస్కృతి, సంప్రదాయాలు ముందు తరాలకు అందించాలి**

**రాణిగారితోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** మన సంస్కృతి, సంప్రదాయాలను, పండుగ విశిష్టతను ముందుతరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందని తెలుగుదేశం పార్టీ యువనేత గద్దె క్రాంతి అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్‌లో తెలుగు యువత, తెలుగుదేశం కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ అధ్యక్షులు రాయి రంగమ్మ, నేతలు కొప్పుల శ్రీనివాస్ చౌదరి, మునిపోలి పల్లి, మొకర ఆదిబాబు, పల్లా సాగర్, సునాబీ, దుర్గారావు పాల్గొన్నారు.

# చిత్రజ్యోతి
SINCE 1965

## మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

## కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

### డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షూపై దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షూ లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్ట్స్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాథరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షూ, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

## కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

## ఆ విషయం మరోసారి రుజువైంది

- బాబీ కొల్లి



బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

## దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.



## అగ్ర రాజ్యం.. అసాధ్యం కాదు

- మన యువత సామర్థ్యాలతో కచ్చితంగా ఎదుగుతాం: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 12: భారతీయ యువత శక్తిసామర్థ్యాలతో కచ్చితంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మనదేశం అగ్రరాజ్యంగా అభివృద్ధి చెందడం కష్టమని కొందరు అంటుంటారని.. కానీ అసాధ్యమైతే కాదని తేల్చిచెప్పారు. 'వికసిత్ భారత్' స్ఫూర్తితో ప్రతి అడుగు, విధానం, నిర్ణయం తీసుకుంటే.. భారత్‌ను ఎవరూ ఆపలేరని తెలిపారు. స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని ఆదివారమిక్కడ నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో.. దేశం నలుమూలల నుంచీ వచ్చిన 'వికసిత్ భారత్ యువ నేతల చర్చ'ను ఆయన ప్రారంభించారు. ఏ దేశమైనా ముందుకు సాగడానికి భారీ లక్ష్యాలు పెట్టుకోవాలని, భారత్ ఇప్పుడదే చేస్తోందని ఈ సందర్భంగా అన్నారు. వివిధ రంగాల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువు కంటే ముందే చేరుకుంటున్నామని చెప్పారు. "1930ల్లో దారుణ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి అమెరికా అగ్రరాజ్యంగా మారింది. కనీస మౌలిక వసతులు కూడా లేని వెనుకబడిన దేశంగా ఉన్న సింగపూర్ ప్రఖ్యాత ఆర్థిక శక్తిగా ఆవిర్భవించింది. భారీ లక్ష్యాలను నిర్దేశించుకుని చిత్తశుద్ధితో వాటిని నెరవేర్చుకునేందుకు కృషిచేయాలని ఈ రెండు ఉదాహరణలు నొక్కిచెబుతున్నాయి. బహిరంగ మలవిసర్జన దేశంగా మారాం. కొవిడ్ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేశాం. ప్రజలందరికీ అందించాం. వచ్చే దశాబ్దంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశిస్తున్నాం. ఈ దిశగా పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నాం. వచ్చే దశాబ్దంలో మన ఎకానమీ రూ.10 లక్షల కోట్లకు చేరుతుంది. 2047 వరకు ఈ పాతికేళ్లూ మన దేశానికి స్వర్ణయుగం (అమృతకాలం). మన యువత వికసిత్ భారత్ కల నెరవేరుస్తారని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది' అని మోదీ తెలిపారు. యువతరంపై స్వామి వివేకానందకు చాలా నమ్మకం ఉండేదని.. అన్ని సమస్యలకూ వారే పరిష్కారాలు కనుక్కుంటారని చెప్పేవారని చెప్పారు. తనకు కూడా వారిపై నమ్మకం ఉందని అన్నారు. వివేకానందుడికి నివాళులర్పించారు.

### రిపబ్లిక్ డే ముఖ్య అతిథిగా సుబియాంతో

ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా ఇండొనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో హాజరుకానున్నారు. భారత్ నుంచి ఇండొనేషియా బ్రహ్మోస్ క్షిపణలు కొనుగోలు చేయనుందనే కథనాల నడుమ సుబియాంతో పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఒప్పందం విలువ 450 మిలియన్ డాలర్లుగా ఉండే అవకాశం ఉందని రక్షణశాఖ వర్గాల ద్వారా తెలిసింది. భారత పర్యటన ముగిసిన వెంటనే సుబియాంతో పాకిస్థాన్ వెళ్లాలనుకున్నారని, అయితే భారత్ అభ్యంతరం తెలపడంతో తన నిర్ణయాన్ని మార్చుకున్నారని సమాచారం. కాగా, అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకానున్నారు.




# నదిలో నిర్మాణాలు!

## గంగా, యమున నదులపై 32 పాంటూన్ బ్రిడ్జిలు.. అవన్నీ తాత్కాలిక ప్రాతిపదికనే

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

ఈ ఫొటో చూశారా!? ఎదురుగా అంతెత్తున ఫ్లై ఓవర్. అది దాటిన తర్వాత రెండు రైల్వే బ్రిడ్జిలు! వాటికన్నా ముందు ఓ చిన్న బ్రిడ్జి ఉంది చూశారా!? దానినే పాంటూన్ బ్రిడ్జ్ అంటారు! మహా కుంభమేళాలో ఈ తాత్కాలిక బ్రిడ్జిలు ప్రత్యేకం కూడా! కుంభమేళాకు కోట్లాది మంది వస్తారు. వారికి రవాణా ఇక్కడ అతి పెద్ద సవాలు. దానిని అధిగమించడానికి వీటిని నిర్మిస్తారు. ఓవైపు నదిలో నీరు ప్రవహిస్తూనే ఉంది.. మరోవైపు భారీ ఇనుప గోళాలతో బ్రిడ్జిలను నిర్మించేస్తూనే ఉన్నారు. ఒక్కో ఇనుప గోళం దాదాపు ఆరు టన్నుల వరకూ బరువు ఉంటుందని అంచనా. గత కుంభమేళా సందర్భంగా కేవలం 18 పాంటూన్ బ్రిడ్జిలను నిర్మిస్తే.. ఈసారి గంగా, యమున నదులపై 32 నిర్మించారు. అవసరమైనచోట మరిన్ని నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నారు. పట్టణంలోని గంగా నదిలో దాదాపు వంద మీటర్లకు ఒకటి చొప్పున ఇవి కనిపించాయి. వీటిపై నుంచి మనుషులు మాత్రమే కాదు.. కార్లు కూడా ఎంచక్కా వెళుతున్నాయి. కుంభమేళా ఏర్పాట్లలో భాగంగా ప్రయాగ్‌రాజ్‌లో నది, నదీతీరంలోనే భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. అవన్నీ కూడా తాత్కాలికంగానే. అయితే, సాధారణ సమయాల్లో రవాణాకు పాంటూన్ బ్రిడ్జిలు ఎంతో అనుకూలమే కానీ, లక్షలాదిమంది వచ్చినప్పుడు.. తొక్కిసలాట వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వీటిపై భద్రత ప్రశ్నార్థకమే. జీహెచ్ఎంసీ వైశాల్యంలో దాదాపు సగం మాత్రమే ఉండే ప్రయాగ్‌రాజ్‌కు నెలన్నర సమయంలోనే దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా. అందులోనూ, ఇప్పుడు 144 సంవత్సరాలకు ఒక్కసారి జరిగే మహా కుంభమేళా!! అందుకనుగుణంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం.. వీలుకాని చోట తాత్కాలిక నిర్మాణాలకే మొగ్గు చూపుతోంది. ఇనుప రేకులు, థర్మోకూల్ షీట్లు తదితరాలతోనే మీడియా సెంటర్ వంటి నిర్మాణాలూ చేస్తోంది. అంతేనా.. వివిధ అఖాడాలు తమ టెంట్లు వేసుకోవడానికి స్థలాన్ని కూడా ఈ నదీ తీరాల్లోనే ఇచ్చారు. అక్కడి ఇసుకలోనే అఖాడాలకు చెందిన స్వాములు, మఠాలు టెంట్లు వేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న కళాగ్రామ్‌ను కూడా ఈ నదీ తీర ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తుండడం విశేషం. ఇప్పుడు వర్షాకాలం కాకపోవడం, నదిలో పెద్దగా నీరు లేకపోవడం ఇందుకు కలిసి వచ్చింది. ఇక, త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం చేయడానికి వచ్చే వీఐపీల కోసం గంగానది ఒడ్డునే నీటిలో తేలియాడే జెట్టీలు తయారు చేశారు. హెచ్‌డీపీఈ కంటైనర్లను పెద్దఎత్తున ఉపయోగించి దీనిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఒడ్డు నుంచి జెట్టీలోకి వెళ్లడానికి కూడా వీటితోనే మార్గం ఏర్పాటు చేశారు.

### ఇనుప రేకులతో రోడ్లు!



అవసరమైనచోట రహదారులను నిర్మిస్తున్నా.. చాలా వరకూ తాత్కాలిక రోడ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. నదులు, నదీ తీర ప్రాంతాల్లో తాత్కాలికంగా అయినా రోడ్లను నిర్మించడం మంచిది కాదు. అది అంత సులభం కూడా కాదు. అందుకే, వేల సంఖ్యలో ఇనుప రేకులను తీసుకొచ్చి.. వాటినే రోడ్డుగా పరిచేస్తున్నారు. టెంట్లకు వెళ్లే వంద, 200 మీటర్ల చిన్న రోడ్లనే కాదు.. ఐదారు కిలోమీటర్ల డబుల్ రోడ్లను కూడా వీటితోనే తయారు చేసేస్తున్నారు. సిమెంటు, కంకర తదితరాలతో ఇక్కడ పని లేదు. ఆ ప్రాంతాన్ని కొంచెం చదును చేయడం.. దానిపై ఇనుప రేకులు పరచడం.. అంతే అక్కడ రోడ్డు సిద్ధం!

## మహా కుంభమేళా నేటి నుంచే


### 45 రోజుల పాటు నిర్వహణ

ప్రయాగ్‌రాజ్, జనవరి 12: మహా కుంభమేళా సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఈ మహాకుంభ మేళా మొత్తం 45 రోజుల పాటు సాగనుంది. పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం తొలిపుణ్యస్నానంతో ఈ మహా క్రతువుకు యూపీ సర్కారు శ్రీకారం చుట్టనుంది. గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో నిర్వహించే మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి దాదాపు 35 కోట్ల మంది ప్రజలు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. మహాకుంభమేళా సోమవారం లాంఛనంగా ప్రారంభం కానుండగా.. దీనికి రెండు రోజుల ముందు అంటే శనివారమే 25 లక్షల మంది ప్రజలు పవిత్ర స్నానాలు ఆచరించారని అధికారులు తెలిపారు. ఇక, మహాకుంభమేళా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తరచుగా పరిశీలించిన సీఎం యోగి ఆదిత్యనాథ్.. దీనిని భారత దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. ఆధునికతకు, స్వచ్ఛతకు, భద్రతకు అతి పెద్ద ఉదాహరణగా నిలుస్తుందన్నారు. "ఇది కేవలం ఓ మతానికి సంబంధించిన కార్యక్రమం కాదు. సామాజిక, ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక" అని సీఎం ఉద్ఘాటించారు. ఇక, ప్రభుత్వ భవనాలు సహా మహా కుంభమేళా జరిగే చోట భారీ ఎత్తున హిందూ ధర్మాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే కుడ్య, తైలవర్ణ చిత్రాలను రూపొందించారు. పూర్ణ కుంభ, శంఖు ఆకృతులు భక్తులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడికక్కడ సమూహ నిర్వహణ విధానాలను అవలంబిస్తున్నారు. ఆదివారం(జనవరి 12) స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని(జాతీయ యువజన దినోత్సవం) ప్రయాగ్‌రాజ్‌లో 'యువ మహా కుంభ్'ను నిర్వహించారు.

### కుంభమేళాలో శ్రీవారి నమూనా ఆలయం

తిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం నుంచి మహాకుంభమేళా ప్రారంభం కానున్న నేపథ్యంలో టీటీడీ హిందూ ధర్మప్రచారంలో భాగంగా శ్రీవారి నమూనా ఆలయాన్ని అక్కడి నాగవాసుకి ఆలయ సమీపంలో ఆదివారం ప్రారంభించారు. నమూన ఆలయాన్ని ఇంజినీరింగ్ నిపుణులు, టీటీడీ సిబ్బంది శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్తరాది భక్తులకు కుంభమేళాలో శ్రీవారి వైభవాన్ని తెలియజేసేందుకు నమూనా ఆలయాన్ని టీటీడీ ఏర్పాటు చేసింది. కుంభమేళాకు వచ్చే భక్తులందరూ శ్రీవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసింది. ఆదివారం తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లను త్రివేణి సంగమం చెంతకు తీసుకెళ్లి గంగా జలాలను కలశంలో నింపుకొన్నారు. ఆ నీటిని నమూనా ఆలయానికి తీసుకువచ్చి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో విష్వక్సేన పూజ తదితర వైదిక క్రతువులను నిర్వహించారు.

### లోకం తీరు




### హెల్మెట్ లేదంటే పెట్రోలూ లేదు!

- యూపీలోని అన్ని నగరాల్లో అమలు

లక్‌నవూ, జనవరి 12: ద్విచక్రవాహన ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ రవాణా శాఖ ఆ రాష్ట్రంలోని నగరాలన్నిటిలో హెల్మెట్ లేకపోతే పెట్రోల్ లేదనే(నో హెల్మెట్... నో పెట్రోల్) నిబంధన అమలులోకి తీసుకువచ్చింది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు.. ముందు, వెనుక కూర్చున్నవారితో సహా హెల్మెట్ ధరించకపోతే పెట్రోల్ పోయవద్దని పెట్రోల్ పంపుల నిర్వాహకులకు ఉత్తర్‌ప్రదేశ్ రవాణా శాఖ కమిషనర్ బ్రజేష్ నారాయణ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇటీవల రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన సమీక్షలో హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్న విషయాన్ని ప్రస్తావించారు. దీంతో ఈ నిబంధన అమలులోకి తీసుకువచ్చినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

### డాకింగ్‌కు 3 మీటర్లు చేరువగా..

- ట్రయల్ రన్‌లో ఉపగ్రహాలను దరి చేర్చిన ఇస్రో

బెంగళూరు, జనవరి 12: అంతరిక్షంలో అనుసంధానం కోసం ప్రయోగించిన స్పేడెక్స్ మిషన్‌లో అత్యంత కీలకమైన డాకింగ్ కోసం ఇస్రో ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించింది. ట్రయల్ రన్‌లో భాగంగా వాటి మధ్య దూరాన్ని 3 మీటర్లకు తగ్గించి.. అనంతరం వెనక్కు తరలించినట్టు ఇస్రో ఆదివారం వెల్లడించింది. "ట్రయల్‌లో భాగంగా ఉపగ్రహాల మధ్య దూరాన్ని 3 మీటర్లకు తీసుకొచ్చాం. ఆ తర్వాత ఉపగ్రహాన్ని సురక్షిత దూరానికి తరలించాం. ఈ డేటాను మరింత విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియ చేపడతాం" అని ఇస్రో ఎక్స్‌లో పేర్కొంది. ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే రెండు ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా గత నెల 30న ఇస్రో భూకక్ష్యలోకి ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

### వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి 1.31 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో తిరుమల శ్రీవారిని 1,13,107 మంది భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం ఏకాదశి రోజున 60,094 మంది, శనివారం ద్వాదశి రోజున 53,013 మంది శ్రీవారిని దర్శించుకుని ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. కాగా, జవవరి 19వ తేదీ వరకు పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు జరగనున్న నేపథ్యంలో తొలి మూడు రోజులకు ఇప్పటికే స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసిన టీటీడీ.. 13వ తేదీకి సంబంధించిన టోకెన్లను శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జారీ చేసింది. తిరుపతి తొక్కిసలాటల్లో గాయపడి కోలుకున్న 28 మంది భక్తులకు టీటీడీ ఆదివారం ప్రొటోకాల్ కేటగిరిలో ప్రత్యేక దర్శనం కల్పించింది.

### మందా జగన్నాథం కన్నుమూత

- సీఎం చంద్రబాబు సంతాపం

హైదరాబాద్ సిటీ/నాగర్‌కర్నూల్/హైదరాబాద్/అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం కన్నుమూశారు. 22 రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం సాయత్రం తుది శ్వాస విడిచారు. కొద్ది రోజుల క్రితం ఆయన ఆరోగ్యం కాస్త మెరుగుపడినా.. మళ్లీ ఆందోళకర పరిస్థితి నెలకొంది. జగన్నాథం మూత్రపిండాలు, గుండె విఫలమయ్యాయని డాక్టర్లు తెలిపారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం కొండేరులో మందా జగన్నాథం జన్మించారు. డాక్టర్‌గా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ పిలుపుతో 1996లో టీడీపీలో చేరారు. వరుసగా 4 సార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా సేవలందించారు. 1996, 1999 2004లో టీడీపీ నుంచి.. 2009లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఒకసారి ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగారు. పేద కుటుంబం నుంచి వచ్చిన జగన్నాథం ఉన్నత చదవులు చదివి టీడీపీ తరఫున మూడు సార్లు ఎంపీగా గెలిచి ప్రజాసేవ చేశారని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. జగన్నాథం మృతి పట్ల సంతాపం తెలిపారు.

### రాబోయేది మా ప్రభుత్వమే!

- ఎల్లకాలం కూటమి సర్కారు ఉండదు
- పులివెందుల డీఎస్పీకి జగన్ వార్నింగ్!!

కడప, జనవరి 12(ఆంధ్రజ్యోతి): 'మళ్లీ రాబోయేది మా ప్రభుత్వమే ఎవరి మాటలో విని అనవసరంగా ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దు' అని పులివెందుల డీఎస్పీని మాజీ సీఎం జగన్ హెచ్చరించినట్లు తెలిసింది. శనివారం వైఎస్ అభిషేక్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు పులివెందుల వచ్చిన జగన్.. సాయంత్రం బెంగళూరుకు బయల్దేరి వెళ్లే సమయంలో హెలికాప్టర్ వద్ద పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను పిలిచి ఘాటుగా మాట్లాడినట్లు తెలిసింది. 'ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే ఉంటుందనుకోవద్దు.. మళ్లీ మేం వచ్చినపుడు వైసీపీ వారిని ఇబ్బంది పెట్టిన వారందరినీ ప్రత్యేక దృష్టితో చూస్తాం' అని హెచ్చరించినట్లు తెలిసింది. అందుకు డీఎస్పీ బదులిస్తూ.. ఎవరి మాటలో విని కేసులు బనాయించడం లేదని, చట్టప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేసినట్లు సమాచారం. దీంతో జగన్ మరోమారు అనవసరంగా ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని డీఎస్పీని హెచ్చరించినట్లు తెలిసింది.

### తెలుగు ప్రజలకు సంక్రాంతి ప్రత్యేకం

- స్వర్ణభారత్ ట్రస్టు సంక్రాంతి వేడుకల్లో వెంకయ్యనాయుడు

మొయినాబాద్ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఇది రైతుల పండుగ అని, తాను కూడా రైతు బిడ్డనని, అందుకే ఈ పండుగకు అధిక ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఓ వ్యవసాయక్షేత్రంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వెంకయ్యనాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

### బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ ఐదుగురు నక్సల్స్ మృతి

చర్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మరోమారు తుపాకీ గర్జించింది. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం పోలీసులు-మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు నక్సల్స్ మృతిచెందారు. వీరిలో ఇద్దరు మహిళలున్నాయి. శనివారం నేషనల్ పార్క్ సమీపంలో మావోయిస్టులు సమావేశమైనట్లు భద్రతాబలగాలకు ఉప్పందింది. దీంతో.. డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఆదివారం ఉదయం మావోయిస్టులు తారసపడడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని చెప్పారు. కాగా.. ఆదివారం నారాయణ్‌పూర్ జిల్లా గుమ్‌చూర్ కొండల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 15 బాణం బాంబులు, వైర్లు, ప్రెషర్‌కుక్కర్లు, రేడియోలు, ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు సుక్మా జిల్లా తిమ్మాపురంలో ఐఈడీ పేలి 11 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి.

### పాకిస్థాన్‌లో 33 టన్నుల బంగారం నిక్షేపాలు!

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేసింది. సింధు నది, హిమాలయాల దిగువన టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువగా ఉంటాయి. ఆ చర్యల వల్లే అక్కడ బంగారం అణువులు ఏర్పడుతుంటాయి. ఆ అణువులు సింధు నది ప్రవాహం ద్వారా పాక్‌లోని పరీవాహక ప్రాంతంలో వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాక్‌కు ఇక మంచిరోజులు వచ్చినట్టేనని నిపుణులు చెబుతున్నారు. సింధు నదిలో 32 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బంగారం నిల్వలను వెలికితీసేందుకు చర్యలు చేపట్టనున్నామని పంజాబ్ ప్రావిన్స్ గనుల శాఖ మంత్రి ఇబ్రహీం హసన్ మురాద్ తెలిపారు. పంజాబ్ ప్రావిన్స్, ఖైబర్ ఫంఖ్తున్వా ప్రావిన్స్‌తో పాటు పెషావర్ బేసిన్, మర్దాన్ బేసిన్ ప్రాంతాల్లో బంగారు నిల్వలున్నట్లు గుర్తించామన్నారు.

## బాబోయ్ కానిస్టేబుల్ ఉద్యోగమా?

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉండేది కాదు. తగినన్ని వాహనాలు ఉండేవి కావు. దీంతో నేరస్తులను పట్టుకునేందుకు కానిస్టేబుళ్లకు వారికంటే దేహదారుఢ్యం, బలం ఉండాలని భావించేవారు. ఇప్పుడు సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. నేరాల తీరుతెన్నుల్లోనూ మార్పు వస్తోంది. ఒకప్పటిలా దొంగలను పోలీసులు వెంబడించే పరిస్థితులు చాలా వరకూ మారాయి. ఎక్కడైనా ఘటన జరిగితే ఎస్ఐ లేదా ఇతర సిబ్బందితో కలసి టీమ్‌గా వెళ్తారు. ఇన్‌ఫార్మర్ల ద్వారా కూడా నేరస్తుల సమాచారం తెలిసిపోతుంది. అవసరమైన టెక్నాలజీ కూడా అందుబాటులో ఉంది. సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా నేరస్తులు ఎక్కడ ఉన్నారో గుర్తించవచ్చు. కీలక కేసుల ఛేదనలో టెక్నాలజీ ప్రాధాన్యమే ఎక్కువగా ఉంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కానిస్టేబుళ్లకు నేరపరిశోధనకు అవసరమైన స్టామినా ఉంటే చాలు. ఈ నేపథ్యంలో బ్రిటీష్ కాలం నాటి పరుగు, ఫిట్‌నెస్ పరీక్షలు అవసరమా? అనే ప్రశ్న అభ్యర్థుల నుంచి వినిపిస్తోంది.

#### ఎన్నో సమస్యలు

కానిస్టేబుల్ ఉద్యోగం పట్ల యువత ఆసక్తి చూపకపోవడానికి ప్రమోషన్లు లేకపోవడం, ఉద్యోగంలో ఒత్తిడి కూడా మరో కారణం. ఎస్ఐలుగా ఉద్యోగంలో చేరినవారికి పదోన్నతులు ఉంటాయి. కానీ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరిన వారికి దాదాపుగా ప్రమోషన్లు ఉండవు. ఓ పది శాతం మంది మాత్రమే హెడ్‌కానిస్టేబుల్ వరకు వెళ్లవచ్చు. ఇక విధుల విషయానికొస్తే.. వేళాపాళా ఉండదు. ఎదుగుబొదుగూ లేని జీవితం. కుటుంబానికి దూరంగా గడపాల్సిన దుస్థితి. ఒకప్పుడు పోలీసులకు సరిపడా క్వార్టర్స్ ఉండేవి. ఇప్పుడు సరైన వసతులు కూడా లేవు. ఇంత త్యాగం చేసి విధులు నిర్వహిస్తే తగిన గౌరవం ఉంటుందా? అంటే అదీ లేదు. డ్యూటీలో పైఅధికారితో తిట్లు.. ఉన్నతాధికారి ఇంట్లో గొడ్డు చాకిరీ.. కక్షసాధింపులు, వేధింపులు.. బయట అధికార పార్టీ నేతలతో బెదిరింపులు తప్పడం లేదు.

#### పరుగు పరీక్షలో...

ప్రతి ఏటా జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్ మూడేళ్లు ఆ విషయం మరిచిపోయారు. రెండేళ్ల క్రితం 6,100 కానిస్టేబుల్ పోస్టులకు రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు(ఎస్ఎల్‌పీఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. సివిల్ పోలీసు విభాగంలో 3,580 (పురుషులు, మహిళలు), ఏపీ స్పెషల్ పోలీసు విభాగంలో 2,520 (పురుషులు) పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించింది. 2023 ఫిబ్రవరిలో 4.9 లక్షల మంది పరీక్ష రాశారు. ఆ తర్వాత ఎంపిక ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అభ్యర్థులు విన్నవించడంతో ప్రక్రియ ప్రారంభమైంది. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన వారి నుంచి పీఈటీ, పీఎంటీ పరీక్షలకు పీఆర్‌బీ ఆహ్వానించింది. అర్హుల్లో 77,510 మంది పురుషులు, 16,734 మంది మహిళా అభ్యర్థులు.. మొత్తం 94,244 మంది ఉన్నారు. గతేడాది డిసెంబరు 30న రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఫిజికల్ ఎఫిషియన్సీ, ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్ ప్రారంభమైంది. పశ్చి మ గోదావరి(4,976), నెల్లూరు(4,690), ప్రకాశం (5,345), కడప(4,492), చిత్తూరు (5,238) జిల్లాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయా య్యి. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లా ల్లో మూడు రోజులు వాయిదా పడగా, ఇతర జిల్లాల్లో త్వరలో ముగియనున్నాయి. హాజరైనవారిలో దాదాపు 30 శాతం తుది రాత పరీక్షకు అర్హత సాధించలేకపోతున్నారు. పరుగు పరీక్షలో కీలకమైన 1600 మీటర్ల గమ్యం చేరలేకపోతున్నారు.

#### అభ్యర్థుల వయసుపై తప్పుడు సమాచారం

రాష్ట్రంలో పోలీసు ఫిట్‌నెస్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు వయో పరిమితి ఉన్నా అనుమతించడం లేదంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ ఎం.రవిప్రకాశ్ పేర్కొన్నారు. 2022 నవంబరు 28న విడుదల చేసిన నోటిఫికేషన్లో 2022 జూలై 1నాటికి అభ్యర్థులకు 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయసు ఉండాలని, రిజర్వేషన్ కేటగిరిలో మరో ఐదేళ్లు అంటే 31 వరకు అనుమతి ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. కాగా, కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో బ్రిటీష్ కాలం నాటి పద్ధతులకు స్వస్తి చెప్పాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కఠినతరమైన రన్నింగ్, ఫిట్‌నెస్ పరీక్షలకు బదులుగా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక నిర్వహించాలని అంటున్నారు. ఒకప్పటి ఐపీసీని మార్చేసి బీఎన్ఎస్ తెచ్చినట్లు ప్రస్తుత సైబర్, ఆర్థిక నేరాలను దృష్టిలో పెట్టుకుని సాంకేతిక నైపుణ్యం గల యువతను ఎంపిక చేస్తే పోలీసు శాఖకు ఇటు సమాజానికి ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

## హాలీవుడ్ ప్రముఖులపై ప్రజాగ్రహ జ్వాల

(మొదటి పేజీ తరువాయి)

దళాలు శక్తికి మించి చెమటోడుస్తున్నాయి. కానీ... నీటి కొరత కారణంగా ఫైర్ హైడ్రంట్స్ పనిచేయకపోవడంతో మంటలు అదుపులోకి రావట్లేదు. దీంతో ఈ ముప్పు నుంచి తమ ఇళ్లను కాపాడుకోవడానికి.. హాలీవుడ్ ప్రముఖులు, విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టే అపర కుబేరులు ప్రైవేటు ఫైర్‌ఫైటర్లకు గంటకు రూ.1.72లక్షలు.. అంటే రోజుకు దాదాపు రూ.40లక్షలు కూడా చెల్లించడానికి సిద్ధం అవుతున్నారు. దీంతో ఆయా ప్రముఖులపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. అసలు ఈ పరిస్థితికి కారణం వారేనని సామాన్యులు మండిపడుతున్నారు. ఆ కథేంటంటే.. వరుసగా మూడేళ్లుగా ఎన్నడూ లేనంత నీటి కరువు నమోదవడంతో.. అక్కడి అధికారులు 2022లో నీటి సంరక్షణ నిమిత్తం కఠిన నిబంధనలు పెట్టారు. వాటిలో ముఖ్యమైనది.. ఇంటి చుట్టూ ఉండే పచ్చికకు, మొక్కలకు వారానికి రెండుసార్లు.. అదీ ఒక్కో తడవకూ 8 నిమిషాల చొప్పున మాత్రమే నీరు పెట్టాలనే నిబంధన. దాన్ని ఉల్లంఘించినవారికి భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కానీ హాలీవుడ్ సెలబ్రిటీల్లో ఒకరైన కిమ్ కర్దాషియన్ తన ఇంటి తోటకు వాడాల్సినదానికన్నా అదనంగా 8 లక్షల లీటర్లకు పైగా నీటిని వాడారు. కిమ్ కర్దాషియన్ మాత్రమే కాదు.. లాస్ ఏంజెలెస్‌లో నివసించే సిల్వెస్టర్ స్టాలోన్, ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్, పారిస్ హిల్టన్, బిల్లీ క్రిస్టల్, ఆంథోనీ హాప్కిన్స్, మెల్ గిబ్సన్, తదితర సెలబ్రిటీలు, సంపన్నులందరిదీ అదే పద్ధతి అని సమాచారం!! నీటి కొరతతో తాము తీవ్రంగా ఇబ్బంది పడుతుంటే.. ఈ సెలబ్రిటీలు అంత విచ్చలవిడిగా నీటిని వాడేయడంపై సామాన్యుల్లో చాలాకాలంగా ఆగ్రహం ఉంది. "ఒకవైపు లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతుంటే.. ప్రాణాలు కాపాడే నీటివనరులను 'కేవలం' మీ విలాసవంతమైన భవనాలను కాపాడుకోవడానికి మళ్లించాలని అనుకుంటున్నారన్నమాట" అని దుయ్యబడుతున్నారు.




జనవరి 8న పసిఫిక్ పాలేడ్స్‌లో నివాస సముదాయాలు




జనవరి 9న కార్చిచ్చులో బుగ్గి అయిన ఇళ్లు

### నా భార్యకు నన్ను చూస్తూ ఉండడం ఇష్టం!

- 'సీరమ్' సీఈవో పూనావాలా వ్యాఖ్య
- ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్‌కు చురకలు

న్యూఢిల్లీ, జనవరి 12: ఉద్యోగులు వారానికి ఎన్ని గంటలు పనిచేయాలనే అంశంపై తాజాగా సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా స్పందించారు. పనికి, జీవితానికి మధ్య సమతుల్యత ఉండాలన్న ఆయన ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ వ్యాఖ్యలను పరోక్షంగా విమర్శించారు. మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఎక్కువ పనిగంటల విధానాన్ని వ్యతిరేకించారు. ఈ విషయంలో రాసి కంటే వాసి ముఖ్యమని, ఎన్ని గంటలు పనిచేశామన్నది కాదని.. ఎంత నాణ్యతతో చేశామనేది చూడాలన్నారు. 'నిజమే(ఆనంద్ మహీంద్రా), నా భార్య కూడా నేను అద్భుతమైన వ్యక్తిని అనుకుంటుంది. ఆదివారాలు నన్ను చూస్తూ ఉండటమే తనకు ఇష్టం' అని 'ఎక్స్' వేదికగా స్పందించారు. అంతకుముందు ఆనంద్ మహీంద్రా ఇదే అంశంపై వ్యాఖ్యానిస్తూ 48, 70 లేదా 90.. ఇలా ఎన్ని గంటలు పని చేశామన్నది ముఖ్యం కాదని ఉత్పాదకతే ప్రధానమని అభిప్రాయపడ్డారు. "నా భార్య అద్భుతమైన వ్యక్తి. ఆమెను చూస్తూ ఉండటం నాకెంతో ఇష్టం" అని ఆయన పేర్కొన్నారు. వీరిలా స్పందించడానికి ఎల్ అండ్ టీ చైర్మన్ వ్యాఖ్యలే కారణం. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతసేపు అలా మీ భార్యను చూస్తారు? భార్యలు మాత్రం ఎంతసేపు భర్తలను చూస్తూ ఉండగలరు? ఆఫీసుకు వెళ్లి పనిచేయండి' అని ఆయన వ్యాఖ్యానించారు. తాను ఆదివారం కూడా పనిచేస్తానని, ఎల్ అండ్ టీ ఉద్యోగులు కూడా ఆదివారం పనిచేస్తే సంతోషిస్తానన్నారు.



# పండక్కి ప్రత్యేకంగా...



పండుగ రోజున ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తూ ఉంటారు. పండుగ శోభ ఉట్టిపడేలా అందరిలో ప్రత్యేకంగా కనిపించాలంటే అందమైన చీర దానికి తగ్గ జాకెట్ ధరించాల్సిందే! ఏ చీర మీద ఏ రంగు జాకెట్ వేసుకోవాలో, ఏ నగలు పెట్టుకోవాలో తెలుసుకుందాం!

- పండుగ ఏదైనా సరే.... మహిళల తొలి ఎంపిక ఆకుపచ్చ రంగే! జరీ బోర్డర్ ఉన్న ముదురు ఆకుపచ్చ రంగు పట్టు చీర మీద మెరూన్ రంగు జాకెట్ వేసుకుంటే ఎవ్వరికైనా చక్కగా నప్పుతుంది. జాకెట్ చేతులకు కూడా జరీ బోర్డర్ ఉంటే మధ్య వయసు మహిళలకు హుందాగా ఉంటుంది. అదే యువతులకైతే ఆకుపచ్చని దారాలు, బంగారు రంగు గుండ్లతో ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన జాకెట్ బాగుంటుంది. మెడలో ముత్యాల గొలుసు వేసుకుంటే అందరి చూపు మీ మీదే!
- పసుపు శుభ సంకేతం. సంప్రదాయకంగా కనిపించాలనుకునేవారు పసుపు రంగు చీరతో పాటు ఎరుపు లేదంటే గులాబీ రంగు జాకెట్ ధరించవచ్చు. దీనిమీద పగడాల సెట్ లేదా కెంపుల హారం వేసుకుంటే కుందనపు బొమ్మలా కనిపిస్తారు. ఈ రంగు చీర మీద యాంటిక్ నగలు కూడా బాగుంటాయి.
- ఎరుపు రంగు ధైర్యానికి, సంప్రదాయానికి



ప్రతీక. జరీ బోర్డర్, జరీ పువ్వులతో నిండిన ఎర్రని పట్టు చీరతోపాటు అదే రంగు లేదా బంగారు రంగు జాకెట్ ధరిస్తే తెలుగుతనం మూర్తీభవించినట్లు కనిపిస్తారు. చంద్రహారం, కాసుల పేరు, వడ్డాణం లాంటి సంపదాయ నగలు ఈ చీర మీద గ్రాండ్‌గా కనిపిస్తాయి.

- యువతులు వంకాయ రంగు లేదా గులాబీ రంగు చీర మీద సీక్వెన్స్ వర్క్ చేసిన ఆకుపచ్చ రంగు జాకెట్ ధరిస్తే రాజసంగా కనిపిస్తారు. ఈ చీరల మీద బంగారు నగలు, ముత్యాల హారాలు, బ్లాక్ మెటల్ నగలు వేసుకోవచ్చు.
- సింపుల్‌గా, హుందాగా కనిపించాలనుకునేవారు ఉదా, లేత ఆకుపచ్చ, బ్రౌన్, గోధుమ రంగు చీరలు ధరించవచ్చు. వీటి మీద ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన జాకెట్లు, నెట్టెడ్ బ్లౌజ్‌లు అందంగా ఉంటాయి. ఏ వయసు వారికైనా ఇవి చక్కగా నప్పుతాయి. రంగు రంగుల బీడ్స్‌తో తయారు చేసిన నగలు లేదంటే పెద్ద లాకెట్ ఉన్న ముత్యాల హారం వేసుకుంటే ప్రత్యేకంగా కనిపించవచ్చు.

పర్వదినం

# నవ చైతన్య క్రాంతి

మన సనాతన సంప్రదాయం పండగలతో ముడిపడి ఉంది. ఈ పండగల వెనుక కొన్ని వేల సంవత్సరాల క్రితం నుంచి మన పూర్వీకులు అనుసరిస్తున్న సంప్రదాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా సంక్రాంతి దేవుళ్ళకు సంబంధించిన పండగ కాదు. ప్రకృతిని అనుసరించి చేసుకొనే పండగ. తెలుగువారి పండగలు చాంద్రమానాన్ని అనుసరించి, తిథుల ప్రకారం జరుగుతాయి. రాశులను అనుసరించి, సౌరమానం ప్రకారం నిర్వహించే పండగ మకర సంక్రాంతి. హేమంత ఋతువులో మార్గశిర, పుష్య మాసాలు ఉంటాయి. సూర్యుడు ధనూరాశిలోకి ప్రవేశించినప్పుడు... ధనుస్సంక్రమణం నుంచే సంక్రాంతి సన్నాహాలు ప్రారంభమవుతాయి. ధనుర్మాసంలో మహిళలు తెల్లవారుజామునే ఇంటి ముంగిళ్ళను శుభ్రపరచి, కల్లాపి చల్లి, రంగవల్లికలు దిద్ది, వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి, పసుపు కుంకుమలతో బొట్లు పెట్టి, గుమ్మడిపూలతో అలంకరిస్తారు. గొబ్బి పాటలు పాడుతూ, వాటి చుట్టూ ఆడుతూ సందడి చేస్తారు.

## భోగి అంటే భోగం...



రాశులను అనుసరించి ఎన్ని సంక్రాంతులున్నా... సంక్రాంతి... అంటే మకర సంక్రాంతే. ఇది మూడు రోజుల పండగ. మొదటి రోజు భోగి. ఈ పదం 'భుజ్' అనే సంస్కృత ధాతువు నుంచి వచ్చింది. అంటే 'భోగము' అని అర్థం. కాగా 'తొలినాడు' అనే అర్థాన్ని కూడా తెలుగు నిఘంటువులు చెప్పాయి. ఇది ధనుర్మాసం చివరిరోజు. దక్షిణాయనం ముగిసే రోజు కూడా. భోగి నాడు తెల్లవారుజామున ఇళ్ళ ముందు మంటలు వేస్తారు. ఇంట్లోని పనికిరాని వస్తువులను, పిడకల దండలను మంటల్లో వేస్తారు. ఆ మంటల దగ్గర పాత్రల్లో నీటిని కాచి, స్నానం చేస్తారు. ఈ భోగి స్నానం వల్ల దుష్టపీడలు తొలగిపోతాయని, శుభాలు కలుగుతాయని విశ్వాసం. ఇళ్లలో బొమ్మల కొలువులు పెడతారు. సాయంత్రం వేళ చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి, పేరంటం చేసి, పెద్దల ఆశీస్సులు పొందుతారు.

## పెద్దల పండగ



రెండో రోజు మకర సంక్రాంతి. సూర్యుడు మకరరాశిలోకి సంక్రమణం చేస్తాడు. ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. అభ్యంగనస్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి, ఉదయిస్తున్న సూర్యుడికి ప్రణామం చేసి, దైవ దర్శనంతో పాటు, పెద్దలకు నమస్కరించి ఆశీస్సులు పొందడం, నువ్వులు, బెల్లం, గుమ్మడి పండు, తాంబూలం, వస్త్రాలను దానం చేయడం శుభప్రదం. ముత్తయిదువులకు పసుపు కుంకుమలు, తాంబూలాలను ఇచ్చి ఆశీస్సులు పొందడంవల్ల సౌభాగ్యం స్థిరంగా ఉంటుందనే విశ్వాసం ఉంది. సంక్రాంతి రోజున ఇంటిపెద్దలు పూర్వీకులకు తర్పణాలు, పిండప్రదానాలు నిర్వహిస్తే... ఆ పూర్వీకులకు పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ రోజున పుట్టింటికి వచ్చే ఆడపిల్లలకు, అల్లుళ్ళకు యథోచితంగా కానుకలు ఇవ్వడం, బంధుమిత్రులతో విందు వినోదాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం ఆనవాయితీ. అందుకే దీన్ని 'పెద్దల పండగగా, 'అల్లుళ్ళ పండగగా కూడా వ్యవహరిస్తారు.

## పుడమికి, గోసంతతికి కృతజ్ఞతగా...



మూడో రోజు కనుమ. ఇది పూర్తిగా కర్షకులకు సంబంధించిన పండగ. ఈ రోజున వ్యవసాయదారులు తమ పశువుల కొట్టాలను శుభ్రపరచి, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. ఏడాది పొడుగునా తమకు సహకరించిన పశువులను కడుగుతారు. వాటి కొమ్ములకు రంగులు వేస్తారు. మెడలో గంటలు, కాళ్ళకు గజ్జెలు కట్టి అందంగా అలంకరిస్తారు. పొంగలి వండి, నివేదించి వాటికి పెడతారు. ఆ పొంగలిని కళ్ళాలలోనూ చల్లుతారు. దీన్ని 'పొలి కట్టడం' అంటారు. అలా చేయడం వల్ల తమ పంటలను దుష్ట శక్తులు పాడు చేయవని వారు నమ్ముతారు. ఇలా పుడమికి, ప్రకృతికి, గోసంతతికి కృతజ్ఞత తెలిపే అవకాశం కల్పించే మూడు రోజుల పెద్ద పండగ.. నవ చైతన్య క్రాంతి... సంక్రాంతి.

## ధర్మానికి వెలుగు దారి...

జగత్తు సక్రమమైన మార్గంలో ప్రయాణించాలని ఘన దర్మం చెబుతుంది. అలా నడిస్తే వెలుగు మార్గం కనిపిస్తుంది. చీకటి తొలగి జ్ఞానం లభిస్తుంది. ఆ వెలుగు సర్వాంతర్యామిగా... సూర్యనారాయణుడి రూపంలో మనకు నిత్యం కనిపిస్తుంది. సూర్యుడు తన వెలుగుతో జగత్తుకు చైతన్య స్ఫూర్తిని కలిగిస్తున్నాడు. ఆయన గమనాన్ని అనుసరించి చేసే పండుగలలో సంక్రాంతి ప్రధానమైనది. మన పూర్వులు అశ్విని తదితర 27 నక్షత్రాలు, వాటికి చెందిన మొత్తం 108 పాదాలను... పన్నెండు మేషాది ద్వాదశ రాశులుగా విభజించారు. భూమి సూర్యుడి



చుట్టూ తిరగడానికి పన్నెండు మాసాలు పడుతుంది. సూర్యుడు నెలకు ఒక మాసంలో ఉంటాడు. ఆయన ఒక రాశి నుంచి మరొక రాశిలోకి ప్రవేశించే సమయమే సంక్రమణం. దాన్ని ఆ సమయంలో సూర్యుడు ప్రవేశించే రాశి పేరున్న సంక్రాంతిగా పిలుస్తారు. సూర్యుడు ధనూరాశి నుంచి మకర రాశిలోకి సంక్రమణం చేసేటప్పుడు వచ్చేదే మకర సంక్రాంతి. మన పురాణ, ఇతిహాసాల ప్రకారం... మకర సంక్రమణం నుంచి కర్కాటక సంక్రమణం వరకూ దేవతలకు పగలు. అది ఉత్తరాయణం. కర్కాటకం నుంచి తిరిగి మకరం వరకూ రాత్రి. అది దక్షిణాయనం. దేవతలకు పగటి సమయమైన ఉత్తరాయణం అత్యంత పుణ్యకాలం. అందుకే భీష్ముడు ఈ కాలం కోసం అంపశయ్యమీద నిరీక్షించాడు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన తరువాత... కైవల్యం పొందాడు.

- ఆయపిళ్ళ రాజపాప

# ముగ్గు రంగుల తయారీ ఇలా....

సంక్రాంతి పండుగ రోజుల్లో ఇంటి ముందు రంగుల ముగ్గులు వేయాలంటే చాలా రంగులు కావాలి. వీటిని బజార్లో కొనుక్కునే కంటే ఇంట్లోనే తయారు చేసుకుంటే ఆనందంగా అనిపిస్తుంది. ఇంట్లో ఉండేవాటితోనే సులభంగా ముగ్గు రంగుల తయారీ విధానం తెలుసుకుందాం!


## ముగ్గు రంగుల తయారీ ఇలా చేద్దాం

- స్టవ్ మీద మందపాటి గిన్నెను పెట్టి అందులో కొన్ని రేషన్ బియ్యం పోసి దోరగా వేయించాలి. తరవాత పళ్లెంలోకి తీసి చల్లారనివ్వాలి.
- చల్లారిన బియ్యాన్ని మిక్సీ గిన్నెలో పోసి మరీ మెత్తగా కాకుండా గ్రైండ్ చేసుకోవాలి. లేదంటే పిండి గిర్నీలో ఇచ్చి బరకగా మర పట్టించుకోవచ్చు.
- ఇంట్లో ఉన్న చిన్న స్టీల్ లేదా గాజు గిన్నెల్లో కొంచెం బియ్యం పిండి వేయాలి. పిల్లలు పెయింటింగ్ కోసం ఉపయోగించే అక్రిలిక్ రంగులు లేదా వాటర్ కలర్స్ తీసుకుని ఒక్కో గిన్నెలో ఒక్కో రంగు వేయాలి. రంగు మొత్తం పిండికి పట్టేలా కొద్దిగా నీళ్ల చల్లుకుంటూ బాగా కలపాలి. పిండి ముదురు రంగులో కావాలనుకుంటే ఇంకొంచెం రంగు కలుపుకోవచ్చు.
- ఈ గిన్నెలన్నింటినీ గాలి తగిలే ప్రదేశంలో ఉంచి పిండిని ఆరనివ్వాలి.
- తరవాత ఒక్కో గిన్నెలోని పిండిని మరోసారి గ్రైండ్ చేస్తే రంగు బాగా కలుస్తుంది.
- ఒక్కో రంగు పిండిని ఒక్కో ప్లాస్టిక్ కవర్లో పోసి ఉంచుకుంటే ఏడాదంతా ఉపయోగించుకోవచ్చు.
- ఈవిధంగా తక్కువ ఖర్చులోనే మనకిష్టమైన రంగులన్నీ తయారు చేసుకోవచ్చు.

### జాగ్రత్తలు

- రేషన్ బియ్యాన్ని రాళ్లు, వడ్ల గింజలు లేకుండా శుభ్రంగా ఏరుకోవాలి. తవుడు పోయేలా చెరగాలి.
- బియ్యం పిండి మెత్తగా అయితే ముగ్గుల్లో రంగులు నింపడం కష్టమవుతుంది. అదే రవ్వలా ఉంటే రంగు అందంగా కనిపించదు. ముగ్గు పిండి చేతి నుంచి ఎలా జారుతుందో అదే తరహాలో బియ్యం పిండి ఉండేలా చూసుకోవాలి.

## ముత్యాల ముగ్గు






పి. శివజ్యోతి
కడప

15 - 8 చుక్కలు







కె. సుగుణ
బెంగళూరు

11 చుక్కలు
9 చుక్కలు రెండు వరుసలు
5 చుక్కలు రెండు వరుసలు
1 చుక్కతో నిలపాలి
రెండువైపుల

# దిక్సూచి
DIKSUCHI

## బ్యాంక్ ఆఫ్ బరోడాలో 1267 స్పెషలిస్ట్ ఆఫీసర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో వివిధ విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి 2025 జనవరి 17లోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు కోరుతున్నారు.
**పోస్టులు:** అగ్రికల్చరల్ మార్కెటింగ్ ఆఫీసర్(150), అగ్రికల్చర్ మార్కెటింగ్ మేనేజర్(50), మేనేజర్ సేల్స్(450) వంటి పలు పోస్టులు ఈ ఖాళీల్లో ఉన్నాయి.
**అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, పీహెచ్‌డీ, సీఎంఏ, సీఎస్/ సీఎఫ్ఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. ఆన్‌లైన్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 2025 జనవరి 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. వివరాల కోసం www.bankofbaroda.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

## వివిధ బ్యాంకుల్లో ఖాళీలు

### హెచ్‌డీఎఫ్‌సీలో రిలేషన్‌షిప్ మేనేజర్లు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్-ప్రొబేషనరీ ఆఫీసర్ ప్రోగ్రామ్‌కు నోటిఫికేషన్ వెలువడింది. 500 ఖాళీలు ఉన్నాయి. కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌తోపాటు, కనీసం 1-10 సంవత్సరాల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయస్సు 35 సంవత్సరాల లోపు ఉండాలి. ఆన్‌లైన్ ద్వారా 2025 ఫిబ్రవరి 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. 2025 మార్చి నెలలో పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. వివరాల కోసం www.hdfcbank.com వెబ్‌సైట్ చూడొచ్చు.

### కెనరా బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

కెనరా బ్యాంకు శాఖల్లో స్పెషలిస్టు ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులై అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం 60 ఖాళీలు ఉన్నాయి. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పోస్టులను అనుసరించి డిగ్రీ/ ఇంజనీరింగ్, బీసీఏ/ఎంసీఏ, ఎంఏ, ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయస్సు 35 సంవత్సరాల లోపు ఉండాలి. **చివరి తేదీ:** 2025 జనవరి 24 వివరాలకు canarabank.com/ వెబ్‌సైట్ చూడొచ్చు.

# ఆర్ఐఎంసీలో అడ్మిషన్స్



**డెహ్రాడూన్‌లోని 'రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్'(ఆర్ఐఎంసీ) ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ విద్యాసంస్థ భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. సంవత్సరానికి రెండు టర్మ్‌లు అంటే జనవరి, జూన్‌లో ఈ సంస్థలో అడ్మిషన్స్ ఉంటాయి. ప్రస్తుతం 2026 జనవరి టర్మ్ కోసం నోటిఫికేషన్ వెలువడింది.**

**వయస్సు:** విద్యార్థుల వయస్సు 2026 జనవరి1 తేదీ నాటికి పదకొండున్నర సంవత్సరాల నుంచి 13 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2013 జనవరి 2వ తేదీ నుంచి 2014 జూలై 1వ తేదీ మధ్యలో జన్మించిన బాల, బాలికలు దరఖాస్తుకు అర్హులు.

**ఫీజు:** జనరల్ ఓబీసీ/ విద్యార్థులకు రూ.600/-, ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులకు రూ. 555/- ఫీజు ఉంటుంది. ఈ రుసుముతో డీడీ తీయాల్సి ఉంటుంది.

**ఎంపిక:** రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది. 2025 జూన్1వ తేదీన ఈ పరీక్ష నిర్వహిస్తారు.

**పరీక్షా విధానం:** మొత్తం మూడు పేపర్లు ఉంటాయి

| సబ్జెక్టు | మార్కులు | టైమ్ |
|---|---|---|
| మేథ్స్ | 200 | ఉ. 9.30 నుంచి 11 గంటల వరకు |
| జనరల్ నాలెడ్జ్ | 75 | మ. 12 నుంచి 1 వరకు |
| ఇంగ్లిష్ | 125 | మ. 12 నుంచి సా. 4.30 వరకు |

(వైవా 50 మార్కులు - రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే) ప్రశ్నపత్రం మొత్తం 400 మార్కులకు ఉంటుంది. రాత పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్‌గా అంటే ప్రశ్నలు, జవాబుల తరహాలో ఉంటుంది. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి తదుపరి అంచెలో 'వైవా' ఉంటుంది. దీని కోసం 1:3 శాతం నిష్పత్తిలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. వైవా తర్వాత మెడికల్ టెస్ట్ కూడా క్లియర్ చేయాల్సి ఉంటుంది.

**దరఖాస్తు విధానం:** నిర్ణీత రుసుము ఫీజుతో డీడీని ఆర్ఐఎంసీకి పోస్టు ద్వారా పంపితే వారు దరఖాస్తు ఫారమ్, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలు స్పీడ్ పోస్టు ద్వారా అభ్యర్థులకు పంపుతారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారమ్‌ను సంబంధిత రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపించాలి. అంటే తెలంగాణ విద్యార్థులు టీజీపీఎస్సీ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఏపీపీఎస్సీకి పంపాలి.

**సిద్ధంగా ఉంచుకోవాల్సిన సర్టిఫికెట్స్**

- బర్త్ సర్టిఫికెట్
- ఎస్సీ/ఎస్టీ సర్టిఫికెట్
- ఆధార్ కార్డ్ జిరాక్స్
- డొమెస్టిక్/ రెసిడెన్స్ సర్టిఫికెట్
- ప్రస్తుత స్కూల్ నుంచి బోనఫైడ్
- రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు

**చివరి తేదీ:** పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలు 2025 మార్చి31లోపు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ కమిషన్ కార్యాలయానికి చేరాలి.

**పరీక్షా కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.

(ఎంట్రెన్స్ ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల ఆధ్వర్యంలో జరిగినప్పటికీ ఫలితాలను మాత్రం ఆర్ఐఎంసీ వెల్లడిస్తుంది. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో దాదాపు 90 శాతం మంది ఎన్‌డీఏకి ఎంపిక అవుతారు.

పూర్తి వివరాల కోసం rimc.gov.in/rimcindex.aspx వెబ్‌సైట్ చూడొచ్చు.



ఎస్.కళ్యాణి
ప్రిన్స్‌పాల్, క్రాంతి కీస్ అకాడమి, హైదరాబాద్

# కాయ్.. రాజా కాయ్!



పొంగళ్లు వండుతున్న పురుషులు

## పురుషుల పండుగ..!

» అన్నమయ్య జిల్లా తిప్పాయపల్లెలో ప్రత్యేక ఆచారం



పుల్లంపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పండుగలు, జాతరలు లేదా ఏ ఆధ్యాత్మిక కార్యక్రమమైనా.. సాధారణంగా స్త్రీల హడావుడి ఎక్కువగా ఉంటుంది. పొంగళ్లు, పూజల నుంచి దాదాపు అన్ని కార్యక్రమాలు వారి చేతుల మీదుగానే జరుగుతుంటాయి..! పురుషుల పాత్ర పెద్దగా ఉండదు. అయితే కేవలం మగవాళ్లకు మాత్రమే ప్రత్యేకంగా ఒక పండుగ ఉందండోయ్..! ఈ పండుగ చూడాలంటే అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం తిప్పాయపల్లె గ్రామానికి రావాల్సిందే. ఇక్కడ సంజీవరాయుడికి పొంగళ్లు పెట్టేందుకు అవసరమైన సామగ్రిని స్వయంగా ఇంటి నుంచి ఆలయానికి తెచ్చుకోవడం నుంచి పొంగళ్లు వండి.. దేవుడికి నైవేద్యం సమర్పించే వరకు అంతా మగవాళ్లే చేస్తారు. ఆడవాళ్లకు ఆలయంలోకి ప్రవేశం లేదు. ఆలయం వెలుపల నుంచి హారతి తీసుకోవడానికి మాత్రమే వారు పరిమితమవుతారు. సంక్రాంతి ముందు వచ్చే ఆదివారం సంజీవరాయ స్వామికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించడం వింత గా ఉన్నా.. ఎప్పటి నుంచో వస్తున్న ఆచారాన్ని గ్రామస్థులు పాటిస్తూ వస్తున్నారు. తిప్పాయపల్లెలోని సంజీవరాయుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో మగవారు పొంగుబాళ్లు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునే పురుషులు ఇంటి నుంచి సామగ్రిని ఆలయానికి తీసుకువచ్చి, భక్తిశ్రద్ధలతో టెంకాయ కొట్టి పొయ్యి మీద పొంగళ్లు వండారు. 200 మందికిపైగా మగవాళ్లు నైవేద్యం సమర్పించారు. టెంకాయలు కొట్టి బెల్లం, కొబ్బరి చదివింపులు చేసి మొక్కులు తీసుకున్నారు. మహిళలంతా ఆలయం ముందు ఉండి హారతి తీసుకున్నారు.

### ఆరోగ్యం బాగుండాలని వచ్చా



మా స్వస్థలం శ్రీకాకుళం. నేను వైజాగ్‌లో వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్నాను. నాకు చాలాకాలం నుంచి ఆరోగ్యం సరిగా లేదు. ఇక్కడ మగవాళ్లు మాత్రమే పొంగళ్లు పెడతారని, ఇక్కడ దేవుడిని మొక్కుకుంటే మంచి జరుగుతుందన్న నా భార్య సలహా మేరకు సంజీవరాయుడికి పొంగళ్లు పెట్టేందుకు వచ్చాను. ఆరోగ్యం బాగుంటే వచ్చే ఏడాది కూడా వస్తానని మొక్కుకున్నాను.

- హరి, వైజాగ్

**ఆలయ చరిత్ర ఏంటంటే?:** 1516వ సంవత్సరంలో తిప్పాయపల్లె ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతుండగా.. ఆ గ్రామంలోకి వచ్చిన వృద్ధ బ్రాహ్మణుడు ఓ బండరాయిపై బీజాక్షరాలు రాసి సంజీవరాయుడిగా నామకరణం చేశాడు. సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం భక్తిశ్రద్ధలతో సంజీవరాయుడికి పొంగళ్లు పెడితే గ్రామానికి అరిష్టం ఉండదని, పంటలు పండి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని చెప్పి అదృశ్యమయ్యాడని గ్రామ పెద్దలు చెబుతున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఈ ఆచారం పాటిస్తున్నారు. మగవాళ్లు పూజలు చేస్తే కోరికలు తీరతాయని నమ్మకం. గ్రామంలో ఏ పని చేయాలన్నా సంజీవరాయుడికి పూజలు చేసి మొదలుపెడతారు. చిన్న వయస్సులో ఉన్న ఆడపిల్లలకు తప్ప మహిళలకు ఆలయంలోకి ప్రవేశం లేదు. అంతేగాకుండా మహిళలు పొంగళ్లు కూడా ముట్టరు. ఆలయంలోకి దళితులు రారు.

### హెచ్చరికలు 'కామన్'

ఒకవైపు పందెం రాయుళ్లు కోడిపందేలు, పేకాట, గుండాట వంటి వాటిలో బిజీగా ఉంటే.. పోలీసులు మాత్రం హెచ్చరికలు చేస్తున్నారు. కోడి పందేలు, పేకాట, గుండాటలు జరిపితే చర్యలు తప్పవని అన్ని జిల్లాల అధికారులు చెబుతున్నారు. కానీ, పందెం రాయుళ్లు ఈ హెచ్చరికలను తేలికగా తీసుకోవడం గమనార్హం.

### విలువైన కానుకలు

కోడి పందేల బరుల వద్ద ఎన్‌ఫీల్డ్ వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బాపట్ల జిల్లా కొల్లూరు, జంపని కోడి పందాల బరుల వద్ద నిర్వాహకులు ప్రతిపాదించిన పందేలు నెగ్గిన వారికి ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలు బహుమతులుగా ఇవ్వనున్నారు. గత ఏడాది కొల్లూరు మండలం పెసర్లంక వద్ద ఏర్పాటు చేసిన కోడి పందాల బరిలో రెండు ఎన్‌ఫీల్డ్ వాహనాలను నిర్వాహకులు.. ఒక్కొక్క కోడి పుంజు ఐదు పందాలు గెలిచిన వారికి బహుమతిగా అందజేశారు.



బాపట్ల జిల్లా కొల్లూరు కోడి పందెం బరి వద్ద ఎన్‌ఫీల్డ్ వాహనం

(మొదటి పేజీ తరువాయి)

మురిపించనుంది. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు పెట్టపీట వేస్తూ పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటనున్నాయి. ఇదే సమయంలో సంక్రాంతి సంబరాల్లో భాగమైన కోడి పందేలు కూడా భారీ ఎత్తున జరగనున్నాయి. వీటితోపాటు గుండాట, లోన బయట, పేకాటలు కూడా పందెం రాయుళ్లను ఖుషీ చేయనున్నాయి. మందు-విందు-చిందు వంటి ప్రత్యేక ఏర్పాట్లతో కోస్తా సహా పలు జిల్లాల్లో కోడి పందేల బరులు ఈ దఫా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. చిత్రం ఏంటంటే.. ఈ 'సంస్కృతి'లో తరతమ బేధాలు కానీ, రాజకీయ విభేదాలు కానీ లేకుండా అందరూ చేతులు కలపడమే!!

### ఉమ్మడి కృష్ణాలో..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అంపాపురం బరిని రూ.3 కోట్లకు ఓ పార్టీ నాయకులు కొనుగోలు చేశారు. ఈ మొత్తాన్ని రాబట్టుకునేందుకు ఇక్కడ కోడిపందేలతో పాటు పేకాట, గుండాట, కోత ముక్కాట, లోనబయట నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. మద్యం విక్రయాలకు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. ఎన్టీఆర్ జిల్లాలోని అంబాపురం, జక్కంపూడిలోని పాములకాల్వ ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేయడానికి ఇద్దరు ప్రజాప్రతినిధుల అనుచరులు సిద్ధమయ్యారు. తెలంగాణకు సరిహద్దు గ్రామాలుగా ఉన్న గరికిపాడు, బూదవాడ, తొర్రగుంటపాలెం, తిరుమలగిరి, జగ్గయ్యపేటలో బరులు సిద్ధం చేశారు. పెనుగంచిప్రోలు, కంచికచర్లలో హైటెక్ జూదం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. విజయవాడ నడిబొడ్డున ఉండే రామవరప్పాడులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నివాసం ఉండే ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీ చెంతనే ఓ ప్రజాప్రతినిధి అనుచరులు కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. విజయవాడలోని పటమటలంకలో భోగి నుంచి కనుమ వరకు పందేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ వేళ బాపట్ల జిల్లాలో ఏర్పాటు చేసిన బరుల్లో కోళ్ల కాళ్లు దువ్వుతున్నాయి. మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారు. కోడి పందేలు ఒక రోజు ముందే అంటే ఆదివారమే ప్రారంభమయ్యాయి. ఇక, పేకాట మాత్రం గడచిన రెండు రోజుల నుంచి రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో జోరుగా సాగుతోంది. రేపల్లె శివారులోని ఉప్పూడి పరిధిలో రాత్రి 7 గంటల నుంచి మొదలై తెల్లవారే వరకు పేకాట కొనసాగుతోంది.

### లాడ్జిలన్నీ ఫుల్..

తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన పందెం రాయుళ్లు బాపట్లలో తిష్ట వేశారు. రెండు రోజుల క్రితమే తీర ప్రాంత గ్రామాలకు వచ్చిన వాళ్ల కొంత మంది గుంటూరులోని లాడ్జిల్లో, మరికొంత మంది రేపల్లెలో బస చేశారు. ఒక్కో ఆటకు 5 లక్షల నుంచి పది లక్షల వరకు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది.

### పశ్చిమలో జోష్

పశ్చిమగోదావరిలో సంక్రాంతి జోష్ అంబరాన్ని తాకుతోంది. ఎన్నడూ లేనివిధంగా ఈసారి పల్లెలకు కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. సంక్రాంతి అంటే పశ్చిమలో సంప్రదాయ కోడి పందేలకు నెలవు. నేతలతో సహా సామాన్య ప్రజల వరకు పందేల కోసం తహతహలాడుతుంటారు. భీమవరం మండలం డేగానగర్, పెదఅమిరం, సీసలి గ్రామాల్లో పెద్ద బరులు ఏర్పాటు చేశారు. బుల్లితెర నటులు పశ్చిమబాట పడుతున్నారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే దాదాపు 300కి పైగా బరులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని హోటళ్లు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, రాయలసీమ వాసులతో నిండి పోయాయి. వసతుల కోసం ఎన్నడూ లేని డిమాండ్ ఏర్పడింది.



విజయవాడ రామవరప్పాడు సమీపంలో ఏర్పాటు చేసిన బరి వద్ద

## భోగి రోజునే సంక్రాంతి

విజయనగరం జిల్లా అంతకాపల్లి గ్రామంలో ఆనవాయితీ

వందేళ్లుగా భోగి మంటలు కనిపించని ఊరు

(రాజాం రూరల్-ఆంధ్రజ్యోతి): ఆ ఊరిలో భోగి రోజున సంక్రాంతి వేడుకలు జరుపుకొంటారు. అదే విజయనగరం జిల్లా రాజాం మండలం అంతకాపల్లి గ్రామం ప్రత్యేకత. ఈ గ్రామంలోని వాకముళ్ల ఇంటిపేరు గల కుటుంబీకులు భోగి రోజునే సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం పూర్వీకుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో నివాసం ఉంటున్న 70 కుటుంబాలతోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం భోగి రోజున గ్రామానికి చేరుకుని వాకముళ్ల వారి సంక్రాంతి వేడుకల్లో పాల్గొంటారు. ఈ కుటుంబాలు మినహా గ్రామస్థులంతా మకర సంక్రాంతి వేడుకలను సంక్రాంతి రోజున జరుపుకొంటున్నారు. వాకముళ్ల కుటుంబీకులు గ్రామంలోని బంధుమిత్రులను భోగి రోజున విందుకు ఆహ్వానించగా, గ్రామంలోని వారి బంధుమిత్రులు సంక్రాంతి పర్వదినాన వాకముళ్ల కుటుంబీకులను విందుకు ఆహ్వానిస్తారు. ఈ పద్ధతి దశాబ్దాలుగా కొనసాగుతోంది. అలాగే, గత వందేళ్లుగా ఈ ఊరిలో భోగి మంటలు వెలగలేదు. వందేళ్ల క్రితం గ్రామంలో వేసిన భోగి మంటల్లో పిల్లి పడి మరణించింది. దీంతో ఆ తర్వాతి ఏడాది నుంచి గ్రామంలో భోగి వేడుకలు నిలిపివేశారు. తాతలు, తండ్రులు అనుసరించిన విధానానికి గౌరవమిస్తూ ఇప్పటికీ అదే ఆనవాయితీని గ్రామస్థులు కొనసాగిస్తున్నారు.



విజయనగరం జిల్లాలోని అంతకాపల్లి గ్రామం



నెల్లూరు శివార్లలోని నారాయణ మెడికల్ కాలేజీలో ఆదివారం జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. వైద్యవిద్యార్థులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని భోగిమంటలు వేశారు. పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు

## ఆ గ్రామాల్లో భోగి మంట వేయరు!

ఒక్కో గ్రామానికి ఒక్కో కథ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని గ్రామాల్లో భోగి పండగ జరపరు. దీని వెనుక ఒక్కో గ్రామానికి ఒక్కో కథ ఉంది. జలుమూరు మండలం లింగాలవలస గ్రామంలో పూర్వం భోగి మంట వేసిన ఓ వ్యక్తి చనిపోయాడని, అతనిని పులి ఎత్తుకెళ్లిపోయిందని, అప్పటి నుంచి భోగి ఊసే ఎత్తడం లేదని గ్రామస్థులు కథలుకథలుగా చెబుతున్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన ఆచారాన్ని కొనసాగిస్తున్నామంటున్నారు. అలాగే, నరసన్నపేట మండలం బసివలస, చింతువానిపేట, సుందరాపురం, గోకయ్యవలస, చోడవరం గ్రామాల్లోనూ కొన్ని తరాల నుంచి భోగి పండుగను జరుపుకోవడం లేదు. 150 ఏళ్ల క్రితం భోగి రోజు బసివలస, చింతువానిపేట గ్రామాల్లో కొట్లాటలు జరిగి కొంతమంది మృతి చెందారు. దీంతో భోగి పండుగను జరుపుకోరాదని ఆనాడు పెద్దలు నిర్ణయించారు. దీంతో ఈ గ్రామాల్లో తరాలు మారినా నేటికీ భోగి మంటలు వేయడం లేదు. గార మండలం బూరవిల్లిలోనూ పెద్దల కాలం నుంచి భోగి మంట వేయడం లేదని, అందువల్ల తాము కూడా దానికి దూరంగా ఉంటున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. కాగా, బసివలసలో సంక్రాంతి రోజు కాకుండా సంక్రాంతికి ముందు వచ్చే శనివారం పెద్దలను పూజిస్తారు. తరతరాలుగా ఈ ఆచారం కొనసాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.



శ్రీకాకుళం జిల్లా లింగాలవలస గ్రామం

## వందల కిలోమీటర్లు బైక్‌లపైనే!

రైళ్లు, బస్సులు ఫుల్.. ప్రైవేటులో చార్జీల మోత

ద్విచక్రవాహనాలపై స్వస్థలాలకు వెళుతున్న జనం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి పండగను కుటుంబసభ్యులతో జరుపుకోవడానికి హైదరాబాద్‌లో ఉండే ఏపీ ప్రజలు మూడు రోజులుగా స్వగ్రామాలకు తరలి వస్తున్నారు. పండుగ రద్దీ వలన రైళ్లలో బెర్తులు లేక, ఆర్టీసీ బస్సులు సరిపోక.. ప్రైవేటు బస్సుల దోపిడీని భరించలేక చాలామంది కార్లలో బయల్దేరి వస్తున్నారు. కార్లు లేని వారు బైక్‌లపైనే ద్విచక్రవాహనాలపై వందల కిలోమీటర్లు గంగల తరబడి ప్రయాణించి మరీ సొంతూళ్లకు చేరుకుంటున్నారు. దీంతో నిత్యం బిజీ బిజీగా ఉండే నగర రహదారులు బోసిపోయాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని రోడ్లు ఆదివారం నాడు సాధారణం కంటే ఖాళీగా కనిపించాయి. కొన్ని రహదారులైతే నిర్మానుష్యంగా మారాయి.



చౌటుప్పల్‌లో హైదరాబాద్- విజయవాడ హైవేపై రద్దీ

### ఎలాగైనా 'సంక్రాంతికి వస్తున్నాం'

'ఎలాగైనా పండగకి ఇంటికి వెళ్లాలి.' సొంతూరిని వదిలి ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వారి ఆలోచన ఇది. దీన్ని వ్యాపార వస్తువుగా మార్చుకున్న రవాణా సంస్థలు ప్రత్యేక సర్వీసుల పేరిట చార్జీల మోత మోగిస్తున్నాయి. రైళ్లు, ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్.. ఇలా అన్నీ ప్రత్యేక బాదుడు బాదేస్తున్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సును బట్టి రూ.500 నుంచి ప్రారంభమయ్యే టికెట్ ధర.. ఈ పండగ సీజన్‌లో వేలకు చేరింది. ప్రైవేట్ ట్రావెల్స్ అయితే ధరలను మూడింతలు పెంచేశాయి. ఈ ధరలు భరించలేక కొందరు ప్రమాణాలు వాయిదా వేసుకుంటే.. మరికొందరు ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నారు. కార్లు ఉన్న వారు తమ వాహనాల్లోనే బయల్దేరుతుంటే మరికొందరు దూరం, ప్రమాదాలను సైతం లెక్కచేయకుండా ద్విచక్రవాహనాలపై ఫ్యామిలీతో, లగేజీతో సొంతూళ్లకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొమరబండ వైజంక్షన్ వద్ద ఓ కారు ఢీకొట్టింది. ఆయన స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

### ఏపీ వైపు 60 వేలకు పైగా బైక్‌లు

టికెట్ చార్జీల మోత, బస్సులు, రైళ్లలో రద్దీ తాళలేక సొంత వాహనాల్లో ఏపీ వైపు ప్రయాణాలు చేస్తున్న వారి సంఖ్య భారీగా ఉంది. మూడు రోజుల్లో 2లక్షలకు పైగా వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిలోని టోల్‌గేట్‌ల సిబ్బంది చెబుతున్నారు. గత 3 రోజుల్లో 60 వేలకు పైగా ద్విచక్రవాహనాలు ఏపీ వైపు వెళ్లాయని కొర్లపహాడ్ టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. మూడు రోజులుగా హైదరాబాద్- విజయవాడ మార్గంతోపాటు ముఖ్య పట్టణాలను చేరుకునే రహదారులు వాహనాలతో కిటకిటలాడుతున్నాయి.

## పండగ పిలుస్తోంది.. పోదాం పదండి!

మూడు రోజులూ ఆటపాటలూ... విందూ వినోదం

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో వేడుకలు

యలమంచిలి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రండి రండి రండీ... దయచేయండీ.. తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ! అంటూ సంక్రాంతి సంబరాలకు అందరినీ ఆహ్వానిస్తోంది యలమంచిలి గ్రామం. పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలిలో సంక్రాంతి సంబరాల రేంజే వేరు. పండుగ మూడు రోజులూ ఎంజాయ్.. ఆడండి... పాడండి.. తినండి... అంతులేని ఆనందాన్ని పొందండి... అంటూ అందరికీ ఆహ్వానం పలుకుతోంది. నాలుగేళ్లుగా ఈ గ్రామంలో సంక్రాంతి సంబరాలను విన్నూత్న రీతిలో నిర్వహిస్తున్నారు. స్థానికులతోపాటే.. వారి బంధువులు, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినవారు, చుట్టుపక్కల గ్రామాలు.. ఇలా రాష్ట్ర నలుమూలల నుంచి ఎవరైనా ఆహ్వానితులే! ఇందుకు ఇక్కడి శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణం వేదిక కానుంది. రోజుకు సుమారు 15వేల మంది వస్తారనే అంచనాతో సర్వం సిద్ధం చేశారు. ఫొటోషూట్, సెల్ఫీలు తీసుకోవడానికి 27 రకాల పూలతో కూడిన వివిధ ఆకృతులను సిద్ధం చేశారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసే అతిథుల కోసం ఉదయాన్నే అల్పాహారం, మధ్యాహ్నం నాన్‌వెజ్ భోజనాలు, టీ, స్నాక్స్ సిద్ధం చేస్తున్నారు. సున్నుండలు, పూతరేకులు, పాకుండలు, కజ్జికాయలు, బెల్లం గవ్వలు తదితర 27 రకాల స్వీట్స్‌ను సిద్ధం చేశారు. సోమవారం ఉదయం భోగి మంట వేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. మూడు రోజులూ జబర్దస్త్ టీం కామెడీ స్కిట్లు, ఢీ ఫేం డాన్సర్ల ఆటపాటలు, సంగీతవిభావరులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. మహిళలు, చిన్నారులు, యువత కోసం వేర్వేరు విభాగాల్లో వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు 9 గోల్డ్, సిల్వర్ కాయిన్స్‌తోపాటూ మరెన్నో బహుమతులుగా అందజేస్తామని నిర్వాహకులు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి) తెలిపారు.



కొబ్బరి తోటల్లో వేసిన స్వాగత ద్వారాల సెట్టింగ్



## పెళ్లి కూతురమ్మ వేడుక!

» నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు



ఆలయంలో పెళ్లికూతురు, పెళ్లికుమారుడి విగ్రహాలు

(ఆచంట-ఆంధ్రజ్యోతి)

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు పెళ్లికూతురమ్మ చెరువు. వినడానికి విచిత్రంగా ఉంది కదూ..! ఈ పేరు వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ఉంది. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం శేషమ్మ చెరువు పంచాయతీ, పెనుగొండ మండలం దేవ గ్రామం సరిహద్దుల్లో ఈ గ్రామం ఉంది. కొన్ని దశాబ్దాల నుంచి ప్రతి ఏటా సంక్రాంతికి మూడురోజులు పాటు ఇక్కడి ఆలయంలోని పెళ్లికూతురమ్మవారికి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సమయంలో పెద్దసంఖ్యలో భక్తులు కానుకలు సమర్పించి తమ కుటుంబం చల్లగా ఉండాలని మొక్కుకుంటారు. చలిమిడి, పానకాలతో కావిడ్లు, అరటి గెలలు, ఇంకా అనేక కానుకలు సమర్పించి పూజలు చేస్తారు. ఈ ఏడాది కూడా పెళ్లి కూతురమ్మ ఉత్సవాలు 13, 14, 15 తేదీల్లో నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆచంట మండలంతో పాటు చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు.

### ఆలయ చరిత్ర ఆసక్తికరం..

కొన్ని దశాబ్దాల కిందట ఆచంటకు చెందిన ఒక యువకుడికి పెనుగొండకు చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. పెనుగొండలోని వధువు ఇంట పెళ్లి ఏర్పాటు చేశారు. సరైన రహదారులు లేని ఆ రోజుల్లో వరుడు పల్లకీలో ఆచంట నుంచి బయలుదేరి శేషమ్మచెరువు సమీపం నుంచి పెనుగొండ వెళ్తుండగా అటవీ ప్రాంతంలో ఎదురైన ఒక పామును చంపుతాడు. వివాహం అనంతరం అదే దారిలో భార్యతో కలసి వెళ్తూ సరిగ్గా అదే ప్రదేశంలో ఆగుతారు. ఆ సమయంలో అతను చంపిన పాము తల కాటేయడంతో వరుడు మరణిస్తాడు. ఇది చూసిన నవ వధువు తన బంధువులకు కబురు పెట్టించి అక్కడే నిప్పుల గుండం ఏర్పాటు చేసుకుని భర్త మృతదేహంతో పాటు కాలి బూడిదైంది. ఆమె జ్ఞాపకంగా అక్కడ ఒక చిన్నగుడిని నిర్మించారు. 1982లో ఆలయాన్ని పునరుద్ధరించారు.

## కేరళను తలపించేలా పడవ పోటీలు

» రసవత్తరంగా సర్‌ఆర్థర్ కాటన్.. గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు

ఆత్రేయపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కెనాల్‌లో సర్‌ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు 2025 రసవత్తరంగా జరిగాయి. కేరళ తరహాలో... రాష్ట్ర పర్యాటకశాఖ రెండు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆధ్వర్యంలో జరిగాయి. రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి 11 టీమ్‌లుగా 121 మంది పడవ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో జంగారెడ్డిగూడెం జెయింట్, పల్నాడు తండర్స్, ఎన్టీఆర్ ఈగల్స్, కోటిపల్లి సీతాష్, పల్నాడు పాంథర్స్ కృష్ణ లయన్స్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఫైనల్స్ జరుగుతాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారుతో పాటు రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాజమహేంద్రవరం రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి జెండా ఊపి వీటిని ప్రారంభించారు.



అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో డ్రాగన్ పడవ పోటీలు



విశాఖలో లావణ్య కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల చెక్కును అందిస్తున్న టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ. చిత్రంలో హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

## తిరుపతి తొక్కిసలాట బాధితులకు ఎక్స్‌గ్రేషియా

» బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి చెక్కుల పంపిణీ

విశాఖపట్నం/ నర్సీపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల ఎనిమిదో తేదీన జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను ఆదివారం టీటీడీ పాలకమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ తొక్కిసలాటలో విశాఖలోని మద్దిలపాలేనికి చెందిన గుడ్ల రజని, సూరిశెట్టి లావణ్య, కందిపల్లి శాంతి, అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన బొడ్డేటి నాయుడుబాబు మృతిచెందారు. గుడ్ల రజని భర్త లక్ష్మణరెడ్డి, కందిపల్లి శాంతి భర్త వెంకటేశ్, లావణ్య భర్త సతీశ్, వారి పిల్లలకు హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ బాధిత కుటుంబాల ఇళ్లకు స్వయంగా వెళ్లి రూ.25 లక్షల చొప్పున చెక్కులను అందించారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లిలో బొడ్డేడ నాయుడుబాబు భార్య మణికుమారికి రూ.25 లక్షల చెక్కును శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అందజేశారు. గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యులు, స్థానిక ఎమ్మెల్యేలు కలిసి అందజేశారు.

## ఆరు నెలల్లో 3,750 కి.మీ రోడ్లు.. 22,500 మినీ గోకులాల నిర్మాణం: పవన్ కల్యాణ్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సీసీ రోడ్ల నిర్మాణంలో రికార్డులు సృష్టించామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్యమైన మైలురాయి సాధించిందని పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో రాష్ట్రం మొత్తం 1,800 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తే, తాము ఆరు నెలల్లోనే 3,750 కి.మీ. మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 268 మినీ గోకులాలు నిర్మిస్తే.. తాము 22,500 నిర్మించామని వెల్లడించారు. పీవీటీజీ ఇళ్ల కోసం గత జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.91 కోట్లు ఖర్చు చేస్తే, తాము ఆరు నెలల్లోనే రూ.750 కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

## రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

తెలుగువారు ప్రత్యేకంగా జరుపుకొనే సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.14.73 కోట్ల స్మగ్లింగ్ బంగారం సీజ్

» మహిళ సహా 16 మందికి రిమాండ్

విజయవాడ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్ అధికారులు భారీగా స్మగ్లింగ్ బంగారాన్ని పట్టుకున్నారు. 16 మంది నుంచి 17.90 కిలోల విదేశీ బంగారాన్ని సీజ్ చేశారు. దాని విలువ రూ.14.37 కోట్లు ఉంటుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి, నెల్లూరు రైల్వేస్టేషన్లు, బొల్లపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 16 మంది నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. వారిని విశాఖపట్నంలోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది.

## గోడకు కన్నంపెట్టి.. 2.5 కోట్ల ఆభరణాలు కొట్టేశారు

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో శనివారం అర్ధరాత్రి దొంగలు సినీ ఫక్కీలో ఓ జ్యూయలరీ షాపు గోడకు రంధ్రం పెట్టి వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. వీటి విలువ రెండున్నర కోట్లు ఉంటుందని యజమాని మానేపల్లి మారుతీరఘురామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

## స్థానిక సంస్థల నుంచే భవనాలు, లేఅవుట్లకు అనుమతి

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతులు జారీ చేసే అధికారాలను ప్రభుత్వం మార్చింది. ఇక నుంచి స్థానిక సంస్థలు అనుమతులు జారీ చేస్తాయి. ప్రస్తుతం ఈ అనుమతుల అధికారాలు ఎక్కువగా పట్టణాభివృద్ధి సంస్థ(యుడీఏ)లకు ఉన్నాయి. అనుమతులు కావాల్సినవారు తొలుత యుడీఏలను, ఆ తర్వాత సంబంధిత స్థానిక సంస్థల వద్దకు వెళ్తున్నారు. దీనివల్ల అనుమతుల మంజూరులో జాప్యం, అధికార దుర్వినియోగం జరుగుతోందని భావించిన ప్రభుత్వం... యుడీఏల అధికారాలను స్థానిక సంస్థలకు బదలాయించింది. దీనిపై మున్సిపల్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

## రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

» ప్రవాసాంధ్రులకు ఏపీటీఎస్ చైర్మన్ మోహన్ కృష్ణ పిలుపు

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్నవ మోహన కృష్ణ ప్రవాసాంధ్రులకు పిలుపునిచ్చారు. ఏపీటీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారి అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా న్యూజెర్సీలో ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, లోకేశ్ అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు, నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## హీరో వెంకటేశ్ కుటుంబ సభ్యులపై కేసు

» దక్కన్ కిచెన్ కూల్చివేత వ్యవహారంలో కోర్టు ఆదేశాల మేరకు చర్యలు

బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దక్కన్ కిచెన్ కూల్చివేత వ్యవహారంలో హీరో దగ్గుబాటి వెంకటేశ్ కుటుంబసభ్యులపై కేసు నమోదయింది. దగ్గుబాటి సురేశ్ బాబు, వెంకటేశ్, రానా, అభిరామ్‌లపై కోర్టు ఆదేశాల మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే కొనుగోలు విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నందకుమార్, దగ్గుబాటి కుటుంబ సభ్యుల మధ్య ఫిలింనగర్‌లోని దక్కన్ కిచెన్‌కు సంబంధించి గతంలో వివాదం నెలకొంది. ఈ విషయంలో నందకుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా 2022 నవంబరులో జీహెచ్‌ఎంసీ సిబ్బంది హోటల్‌ను పాక్షికంగా కూల్చివేశారు. ఈ అంశంలో యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. అయితే 2024 జనవరిలో హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ దగ్గుబాటి కుటుంబం.. జీహెచ్ఎంసీ సిబ్బందిని తప్పుదోవ పట్టించి దౌర్జన్యంగా తన హోటల్‌ను కూల్చివేసిందని నందకుమార్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న కోర్టు దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని ఫిలింనగర్ పోలీసులను శనివారం ఆదేశించింది. ఈ మేరకు 448, 452, 458, 120 బి సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రయాణికుల్లేక పలు రైళ్ల రద్దు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ లేకపోవడం, ముందస్తు టికెట్ బుకింగ్‌లు లేనికారణంగా.. పలు మార్గాలకు సంబంధించిన రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే విభాగం తెలిపింది. రద్దయినవాటిలో ఈ నెల13న వెళ్లాల్సిన కాకినాడపట్టణం- చర్లపల్లి (07032), మచిలీపట్నం-తిరుపతి (07122) ట్రైన్, 14న చర్లపల్లి-కాకినాడ పట్టణం (07031), 16న సోలాపూర్- తిరుపతి (01437), 17న తిరుపతి - సోలాపూర్ (01438), 18న గుంటూరు -కొల్లాం (07181), 20న కొల్లాం-గుంటూరు (07182) ట్రైన్లను రద్దుచేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

# పేదరిక నిర్మూలనకు పీ-4

» అట్టడుగున ఉన్న 20% మందికి చేయూతనివ్వండి

» ఎన్నారైలకు సీఎం పిలుపు

» దేశ విదేశాల్లోని తెలుగువారికి సంక్రాంతి శుభాకాంక్షలు



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

● మనం బాగుండాలి. మనతో పాటు మన చుట్టూ ఉన్న వారందరూ బాగుండాలి. అప్పుడే నిజమైన పండుగ.

● తమకు లభించిన అవకాశాలను అందిపుచ్చుకుని, ఆయా రంగాల్లో అగ్రస్థానాల్లో ఉన్న వాళ్లు సమాజానికి తమ వంతు తిరిగిచ్చే ఆలోచన చేయాలి.

● పీ-4 విధానంపై ప్రతి ఒక్కరి సలహాలు, అనుభవాలు, ఆలోచనలు, సూచనలు తీసుకునేందుకు మేం సిద్ధం. దీనికోసం ప్రత్యేకంగా పోర్టల్ తీసుకొచ్చి, 30 రోజుల పాటు ప్రతి ఒక్కరి ఆలోచనలనూ స్వీకరిస్తాం. ప్రజల భాగస్వామ్యంతో జీరో పావర్టీ లక్ష్యాన్ని చేరుకుందాం. - సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగున ఉన్న పేదలకు అవకాశాలు కల్పించి, వారిని పైకి తెచ్చేందుకు ముందుకు రావాలని ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. ఎవరు ఎక్కడ స్థిరపడినా.. తమ మాతృభూమిలో ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక సమూహానికో, ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో చేయూతనందించి, వారి జీవన ప్రమాణాలు పెంచవచ్చన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి, తెలుగు రాష్ట్రాల ప్రజలకు, దేశ విదేశాల నుంచి జన్మభూమికి వచ్చి బంధుమిత్రులతో సంక్రాంతి పండుగ జరుపుకొంటున్న వారందరికీ సీఎం ఆదివారం 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతమైన మన సంస్కృతి, సంప్రదాయాలు వర్ధిల్లాలని, ప్రతి ఇంట్లో పండుగ శోభ వికసించాలని ఆకాంక్షించారు. 'జీరో పావర్టీ-పీ4 విధానం' గురించి వివరించారు. 'ఆర్థిక అసమానతలు తగ్గించి, సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అందరి ఇళ్లలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లోని పది సూత్రాల్లో మొదటిది.. జీరో పావర్టీ.. పేదరిక రహిత సమాజం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిన విధానమే పీ-4.. పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్ట్‌నర్‌షిప్. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు 1995లో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకొచ్చిన పబ్లిక్-ప్రైవేట్-పార్ట్‌నర్‌షిప్ (పీ-3) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వాళ్లు సైతం నాటి అవకాశాలతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అనేక వర్గాల వారు దేశ, విదేశాల్లో మంచి స్థానాలకు వెళ్లారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇప్పటికీ మన రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో మంది కటిక పేదరికంలో ఉన్నారు. విద్య, వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో ఉన్నారు. దీనిని మార్చేందుకు, సమాజాన్ని శక్తిమంతం చేసేందుకు పీ-4 విధానాన్ని ప్రతిపాదించి, విధాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్నాం. తమ శక్తియుక్తులతో, ప్రభుత్వ పాలసీతో అత్యున్నత స్థానాలకు చేరుకున్న 10 శాతం మంది ప్రజలు.. అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతనిచ్చి, పైకి తేవాలని కోరుతున్నాను. నాడు జన్మభూమి స్ఫూర్తితో చేపట్టిన కార్యక్రమాలు గ్రామాల్లో అద్భుత ఫలితాలిచ్చాయి. నాడు నేనిచ్చిన పిలుపుతో ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున ముందుకొచ్చి, అనేక గ్రామాల రూపురేఖలు మార్చారు. నేడు కూడా అదే స్ఫూర్తితో అట్టడుగున ఉన్న పేదలను పైకి తెచ్చేందుకు ముందుకు రావాలి' అని కోరారు.

### ప్రతి ఒక్కరూ చర్చించండి..

'పేదరికం లేని సమాజం మా నినాదం. మా విధానం' అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రగతికి ప్రతిబంధకంగా ఉన్న పేదరికాన్ని రూపుమాపడం తమ లక్ష్యమని.. ప్రభుత్వం చేసే కార్యక్రమాలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములైతే దీనిని చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్రప్రజలతో పాటు పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన ప్రతి ఒక్కరూ దీనిపై చర్చించాలని కోరుతున్నా. పొరుగు వారికి సాయం చేస్తే మీరు సాధించిన విజయానికి సార్థకత చేకూరుతుంది. పేదల జీవితాలు మార్చే కార్యక్రమంలో నేను సైతం.. అని ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా సంక్రాంతి రోజున సంకల్పం తీసుకోవాలని కోరుతున్నాను. తద్వారా ఆరోగ్య, ఆనంద, అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌ను సాధిద్దాం' అని సీఎం పేర్కొన్నారు.

### రాష్ట్ర పునర్నిర్మాణంలో యువశక్తి

'శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీకు బానిస అవుతుంది' అంటూ అద్భుత సందేశమిచ్చిన స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటున్న యువతీ,యువకులకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని నివాసంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల్పించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో, పేదరిక నిర్మూలనలో, సమసమాజ స్థాపనలో యువశక్తి భాగస్వామి కావాలని 'ఎక్స్'లో ఆకాంక్షించారు.

### నేడు, రేపు నారావారిపల్లెలోనే సీఎం

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏటా ఆనవాయితీ ప్రకారం సీఎం చంద్రబాబు ఆదివారం తమ స్వగ్రామమైన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లె చేరుకున్నారు. పురపాలక మంత్రి పొంగూరు నారాయణతో కలిసి సీఎం విజయవాడ నుంచి విమానంలో సాయంత్రం 4.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ శేముషీ బాజ్‌పాయ్, ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ తదితరులు ఘన స్వాగతం పలికారు. రాత్రి 7 గంటలకు ఆయన నారావారిపల్లె చేరుకున్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి శనివారమే స్వగ్రామం చేరుకోగా.. లోకేశ్ తన సతీమణి బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్‌తో కలసి ఆదివారం వచ్చారు. తల్లి,భార్యాబిడ్డలతో కలిసి సాయంత్రం నారావారిపల్లె సమీపంలోని శేషాపురం వెళ్లి.. శేషాచల లింగేశ్వరాలయాన్ని సందర్శించి పూజలు జరిపారు. అనంతరం కందులవారిపల్లి వెళ్లి అక్కడ వినాయకుడి ఆలయంలో పూజలు జరిపారు. తర్వాత ఆ గ్రామంలోనే ఉన్న చంద్రబాబు సోదరి హైమావతి నివాసానికి వెళ్లారు. కాగా.. చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి 15వ తేదీ వరకూ అక్కడే గడుపుతారు. సోమవారం నారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పలు పనులకు శంకుస్థాపన చేస్తారు. మంగళవారం కూడా అక్కడే ఉండి బుధవారం మధ్యాహ్నం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

# గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ

(మొదటి పేజీ తరువాయి)

అతిపెద్ద ప్రైవేటు సంస్థల్లో ఒకటైన ఏజీ అండ్ పీ సంస్థ తమ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తుండడాన్ని అభినందించారు. తిరుపతి నుంచి నూతన సీఎన్‌జీ, పీఎన్‌జీ ప్రాజెక్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఫ్యుయెల్ ఎనర్జీలో మార్పులు వస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు కట్టెల పొయ్యి మీద వంట చేసుకునే వాళ్లమని, ఉమ్మడి రాష్ట్రంలో 1995-96 నడుమ ఎల్పీజీ కనెక్షన్లు (దీపం) మంజూరు చేశామని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికీ దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. తాజాగా స్వచ్ఛమైన, సురక్షితమైన సహజ వాయువుతో కూడిన సీఎన్‌జీని పైపులైను ద్వారా ఇంటింటికీ సరఫరా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. 2014-19 నడుమ రాష్ట్రంలో రూ.11,120 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు, 99 లక్షల కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్ల మంజూరుకు మా ప్రభుత్వమే భాగ్యనగర్ గ్యాస్, గోదావరి గ్యాస్, మేఘా గ్యాస్, ఐవోసీ, ఏజీ అండ్ పీ కంపెనీలకు అనుమతి ఇచ్చింది. అప్పట్లో నేను ముఖ్యమంత్రిగా నాచురల్ గ్యాస్ ట్యాక్సేషన్ 8 శాతం ప్రకటించగా.. గడచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. పైగా పన్నులను 24 శాతానికి పెంచేయడంతో ఈ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను నిలిపివేసి పొరుగు రాష్ట్రాలకు వెళ్లాయి. ఇప్పుడు మా ప్రభుత్వం ఈ పన్నులను తిరిగి 5 శాతానికి తగ్గించింది. కొన్ని నెలల కిందట శ్రీసిటీలో గ్యాస్ ఇన్‌ఫ్రా యూనిట్ ప్రారంభించాం. గత ఐదు నెలల్లో ఆ కంపెనీ 51 సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకుని వేగంగా అభివృద్ధి చెందుతోంది' అని తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ విశాఖలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులో భాగంగా ఎన్‌టీపీసీ, జెన్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును రూ.1.80 లక్షల కోట్లతో ప్రారంభించిన సంగతిని సీఎం గుర్తు చేశారు. రిలయన్స్ సంస్థ బయో ఫ్యుయెల్‌ను రూ.60 వేల కోట్ల పెట్టుబడితో 500 ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రీన్ కో ద్వారా సోలార్ విండ్, పంప్డ్ ఎనర్జీ వంటి వాటిపైన, అలాగే కాకినాడ పోర్టులో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుపైన రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఏజీ అండ్ పీ కంపెనీ రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉపాధి అందించేందుకు కృషి చేస్తోందని, ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తర్వాత హోటల్ తాజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం సీఎన్‌జీ ఆధారిత వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా చెత్త సేకరణ కోసం సీఎన్‌జీ వాణిజ్య వాహనాలను తిరుపతి మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. రేణిగుంట మండలం గాజులమండ్యంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కును, సీఎన్‌జీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, చిత్తూరులో ఏజీ అండ్ పి ప్రథమ్ థింక్ గ్యాస్ సీఎన్‌జీ మదర్ స్టేషన్‌ను ప్రారంభించి.. నెల్లూరులో ఎస్‌సీఎన్‌జీ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఏజీ అండ్ పీ కంపెనీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన జపాన్ ప్రతినిధులతో కూడా ఆయన సమావేశమయ్యారు.

### తిరుచానూరులో పైపులైను ద్వారా వంట గ్యాస్

ముఖ్యమంత్రి ఆదివారం సాయంత్రం తిరుచానూరులో ఏజీ అండ్ పీ కంపెనీ పైపులైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరాను ప్రారంభించారు. ఆయన విమానాశ్రయం నుంచి తిరుచానూరు పాత రేణిగుంట రోడ్డులో బనియన్ ఫ్యాక్టరీ సమీపంలో శరవణ, లీలావతి దంపతుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో పైప్డ్ నాచురల్ గ్యాస్ సరఫరాను స్విచాన్ చేసి ప్రారంభించారు. స్వయంగా స్టవ్ వెలిగించి పాలు కాచి టీ తయారు చేశారు. తన చేతులతోనే ఆ దంపతులకు, అలాగే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు, ఎమ్మెల్యే పులివర్తి నానికి అందించారు. ఆ కుటుంబీకులతో కొంతసేపు ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శరవణ కుటుంబం సొంత ఇల్లు కట్టుకోవడానికి రూ.4 లక్షలు, పాడియావుల కొనుగోలుకు మరో రూ.2 లక్షలు.. మొత్తం రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని తక్షణం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సాక్షాత్తూ సీఎం తమ ఇంటికి వచ్చి స్వయంగా టీ కాచి అందించడం, తమతో కూర్చుని సమస్యలు అడిగి తెలుసుకోవడం, రూ.6 లక్షల తక్షణ ఆర్థిక సాయం ప్రకటించడంతో తమకు సంక్రాంతి ఒకరోజు ముందుగానే వచ్చిందంటూ ఆ కుటుంబం ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది.

# జే ట్యాక్స్ పోయిందిగా..

(మొదటి పేజీ తరువాయి)

పెంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జే ట్యాక్స్ కట్టాల్సిన పని లేకపోవడంతో ధరలు తగ్గించుకునేందుకు కంపెనీలు ముందుకు వస్తున్నాయి. గత రెండు నెలల కాలంలోనే 16 మద్యం కంపెనీలు ధర తగ్గింపునకు దరఖాస్తు చేశాయి. వాటిలో పది బ్రాండ్లకు ఇప్పటికే ధరలు తగ్గించారు. సవరించిన ధరలతో ఆ కంపెనీలు మద్యం కూడా సరఫరా చేస్తున్నాయి. తమ బ్రాండ్ల ధరలు కూడా తగ్గించాలని మిగిలిన కంపెనీలు కోరుతున్నాయి. వాటిలో కొన్నింటి తగ్గింపునకు అనుమతి పొందినా, లేబుల్ కోసం ఎదురు చూస్తున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం అక్రమాల వ్యవహారంలో పాత్ర ఉందని భావిస్తున్న మరికొన్ని కంపెనీల దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలిస్తోంది. సీఐడీ విచారణను కారణంగా చూపి అనుమతుల జారీ అంశాన్ని పరిశీలనలో పెట్టింది. కాగా మరికొన్ని ఇతర కంపెనీలు కూడా ధరలు తగ్గించుకునేందుకు ముందుకొస్తున్నట్లు సమాచారం. మద్యం ధరలు తగ్గించుకుంటామని కంపెనీలు క్యూ కట్టడం ఇదే తొలిసారి కావడంతో ఎక్సైజ్ వర్గాలు కూడా ఆశ్చర్యపోతున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం కంపెనీలు కోరకపోయినా ప్రభుత్వం వాటికిచ్చే ధరలను పెంచేసింది. లిక్కర్ కేసుపై రూ.200, బీరు కేసుపై రూ.50 చొప్పున అదనంగా చెల్లించింది. అలా అదనంగా చెల్లించించిన మొత్తాన్ని తిరిగి తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పంగా వసూలు చేసింది. తద్వారా కంపెనీలపై భారం పడకుండానే వైసీపీ పెద్దలకు కమీషన్లు వచ్చాయి. చివరికి మద్యం వినియోగదారుల జేబుకు చిల్లు పడింది. ఇలా దాదాపు ఐదేళ్ల పాటు కమీషన్ల ప్రక్రియ సాగింది. ప్రభుత్వం మారగానే ఈ దందాకు ఫుల్‌స్టాప్ పడింది. దీంతో కొన్ని కంపెనీలు తమకు ఇంత రేటు ఇవ్వాల్సిన అవసరం లేదని, కొంత తక్కువకే సరఫరా చేస్తామంటూ స్వచ్ఛందంగా ధరలు తగ్గించుకునేందుకు ముందుకొచ్చాయి. ఎక్సైజ్ శాఖ కూడా అనుమతిచ్చింది. దీనివల్ల మార్కెట్‌లో ధరలు తగ్గించిన కంపెనీల బ్రాండ్ల అమ్మకాలు పెరిగాయి. ఇది వ్యాపారపరంగా పోటీ కావడంతో అన్ని కంపెనీలు క్రమంగా తామూ ధరలు తగ్గించేస్తామంటూ ముందుకొస్తున్నాయి.

### భారీగా తగ్గింపు

లిక్కర్ బ్రాండ్లలో క్వార్టర్‌పైనే రూ.20 నుంచి రూ.80 వరకు ధరలు తగ్గుతున్నాయి. మాన్షన్ హౌస్ కంపెనీ క్వార్టర్ సీసాపై రూ.30 తగ్గించింది. అరిస్ట్రోకాట్ ప్రీమియం సుపీరియర్ విస్కీ ధర ఏకంగా రూ.50 తగ్గింది. కింగ్‌ఫిషర్ బీరు రూ.10 తగ్గింది. బ్యాగ్‌పైపర్ గోల్డ్ రిజర్వ్ విస్కీ ఒకేసారి రూ.80 తగ్గించుకునేందుకు దరఖాస్తు చేసింది. ఇక, ఇప్పుడు రేట్లు తగ్గిస్తున్నారంటే ఇప్పటి వరకూ అదనంగా వసూలు చేసినట్లేగా అని ప్రశ్నిస్తున్నారు. కంపెనీలు ధరలు తగ్గించుకోవడం వల్ల ప్రభుత్వానికి వచ్చే పన్నులు తగ్గిపోతాయి. కంపెనీల కంటే ప్రభుత్వం పన్నుల ద్వారా కోల్పోయేదే ఎక్కువ.

# జగన్.. నీ పనైపోయింది!

తైతక్కలాడే రోజమ్మా... నోరు అదుపులో పెట్టుకో: జేసీ



అనంతపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లో నీ పనైపోయింది. నీవో ఫేడౌట్ నాయకుడివి. నీది రాబందుల పార్టీ' అంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. తిరుపతి తొక్కిసలాటపై జగన్ వ్యాఖ్యలకు ఆయన ఆదివారం అనంతపురంలో ఘాటుగా స్పందించారు. జగన్‌వన్నీ శవ రాజకీయాలేనన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో ఘటనలు జరిగాయనీ, ఎంతోమంది ప్రాణాలు పోయాయని తెలిపారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 33 మంది చనిపోతే, అప్పుడెందుకు అక్కడికెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించలేదని జగన్‌ను నిలదీశారు. ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో 13 మంది చనిపోతే.. అక్కడికెందుకు వెళ్లలేదని, రుయా ఆస్పత్రిలో 12 మంది చనిపోతే అక్కడికెందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. 'జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి అనేక మంది చనిపోతే. అక్కడికెళ్లి పరామర్శించావా? బోటు ప్రమాదంలో 39 మంది చనిపోతే. అక్కడికెళ్లావా? మరి ఆగమేఘాల మీద ఇప్పుడెందుకు వెళ్లావ్?' అని నిలదీశారు. 'రోజక్కా... నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు. ఆనం కుటుంబం గురించి తెలుసుకుని మాట్లాడు. తైతక్కలాడే రోజమ్మా నోరు అదుపులో పెట్టుకో. నేను నోరు విప్పితే నీ బండారమంతా బయటపడుతుంది' అని హెచ్చరించారు. చంద్రబాబు పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చావన్నది మర్చిపోవద్దని, మరోసారి నోరు పారేసుకుంటే కార్యకర్తలు బయట తిరగనివ్వరని చెప్పారు. అనంతపురంలో రోజాపై చెక్‌బౌన్స్ కేసులున్నాయన్నారు.

# జల సంఘం చేతిలో 'వాల్' భవిత

» ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం!

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులపై ఒకవైపు తొందరపెడుతూనే.. మరోవైపు లేనిపోని సందేహాలతో కేంద్ర జల సంఘం జాప్యం చేస్తోంది. ఇప్పుడు సదరు వాల్ నిర్మాణ భవితవ్యం దాని చేతుల్లోనే ఉంది. దాని నిర్మాణానికి టీ-16 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వాడాలని సూచిస్తూ అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ శనివారం నివేదిక పంపింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా అది జలసంఘానికి అందింది. ఇదే సమయంలో సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) మాత్రం గతంలో డయాఫ్రం వాల్ నిర్మాణానికి వాడిన టీ-5 మిశ్రమాన్నే కొత్త వాల్‌కు కూడా వినియోగించాలని సిఫారసు చేసింది. దాని నివేదికనూ పీపీఏ జలసంఘానికి పంపింది. అటు దేశీయ నిపుణులు కూడా.. టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమమే మేలని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు నివేదికలను అంతర్గతంగా సమీక్షించుకుని ఒకట్రెండు రోజుల్లో జలసంఘం తన అభిప్రాయాన్ని వెల్లడించనుంది.

# 'అదానీ డేటా'లో కదలిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావ అంచనా సంస్థ (ఎస్ఈఐఏఏ)' ఇటీవలే జారీచేసింది. నిజానికి, అదానీ డేటా సెంటర్ నిర్మాణానికి తెలుగుదేశం హయాంలోనే (2014-19) శంకుస్థాపన జరిగింది. వైసీపీ దానిని రద్దు చేసి కొత్త ఒప్పందం చేసుకుంది. మధురవాడలో సర్వే నంబరు 409/పి నుంచి 427 వరకు విస్తరించి ఉన్న నాలుగో నంబరు కొండపై మొదట 130 ఎకరాలు కేటాయించింది. ఎకరం రూ.పది కోట్లు విలువ చేసే భూమిని కోటి చొప్పున ఇచ్చేసింది. దీనికి ముందు లీజు ఒప్పందం జరిగింది. అదానీ ఒత్తిడి పెట్టడంతో లీజు రద్దు చేసి సేల్ డీడ్ రాశారు. రిజిస్ట్రేషన్ చార్జీలు మినహాయింపు ఇచ్చారు. ఈ ప్రాజెక్టును అదానీ పేరుతో కాకుండా 'వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్' అని స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుచేశారు. ఆ కొండపై మొత్తం భూమి 276.77 ఎకరాలు ఉండగా, దఫదఫాలుగా రకరకాల కారణాలు చూపించి వైసీపీ ప్రభుత్వం కొండ మొత్తం అదానీకి రాసి ఇచ్చేసింది. 2023 మే 3న మరోసారి శంకుస్థాపన జరిగింది. ఆ తరువాత కొండ పైకి ఎవరూ వెళ్లకుండా అడ్డంగా రాళ్లు వేసి దారి మొత్తం మూసేశారు. ఎటువంటి పనులూ చేపట్టలేదు. కొండపై మొదట ఇచ్చిన 130 ఎకరాలకే పెట్టుబడి, ఉద్యోగ అవకాశాలపై ఒప్పందం జరిగింది. ఆ తరువాత ఇచ్చిన 146.77 ఎకరాల అదనపు భూమికి పెట్టుబడి, ఉద్యోగాలు వెల్లడించలేదు. మొదటి 130 ఎకరాలకు రూ.14,634 కోట్ల పెట్టుబడులు పెట్టి, 24,990 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అదానీ ఒప్పందం చేసింది. తొలుత 200 మెగవాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ పెడతామని ప్రకటించారు. ఆ తరువాత మరో 100 మెగావాట్లతో ఇంకొకటి నిర్మిస్తామన్నారు. మొత్తం 300 మెగావాట్ల డేటా సెంటర్ వస్తుందన్నారు. తొలి ఒప్పందం ప్రకారం 82 ఎకరాల్లో 200 మెగావాట్ల డేటా సెంటర్, 28 ఎకరాల్లో ఐటీ బిజినెస్ పార్క్, 11 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ పెట్టాల్సి ఉంది.

**భూ వినియోగం ఇలా....**

మధురవాడలో సర్వే నంబర్లు 409/3, 427/2లో మొత్తం 276.77 ఎకరాల కొండను కేటాయించారు.

| | | |
|---|---|---|
| ప్లాటెడ్ ఏరియా | : | 164.57 ఎకరాలు. |
| రహదారులు | : | 35.63 ఎకరాలు |
| ఓపెన్, స్లోప్ ఏరియా | : | 47.5 ఎకరాలు |
| వినియోగం | : | 2.78 ఎకరాలు |
| సౌకర్యాలు | : | 9.39 ఎకరాలు |
| విద్యుత్ సబ్ స్టేషన్ | : | 3.50 ఎకరాలు |
| పార్కింగ్ | : | 13.85 ఎకరాలు |

### ఎస్ఈఐఏఏ నిబంధనలు...

» ప్రాజెక్టు భూమి విశాఖలోని ఎకో సెన్సిటివ్ జోన్ కంబాలకొండకు 970 మీటర్ల దూరంలోనే ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కిలో మీటరు దూరం వరకు ఎటువంటి భారీ భవంతులు నిర్మించకూడదనే నిబంధన ఉన్నందున 30 మీటర్ల వెడల్పున బఫర్ జోన్ ఏర్పాటు చేయాలని, దానిని గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేయాలని నిబంధన పెట్టింది. దీనికి రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలి.

» ఈ ప్రాజెక్టుకు రోజుకు 2,644 కిలో లీటర్ల నీరు అవసరం. అందులో 1,429 కిలోలీటర్లు జీవీఎంసీ నుంచి తీసుకుంటామని, మిగిలిన 1,215 కిలో లీటర్ల నీటి కోసం సూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పెట్టి రీ సైకిల్ చేసి వినియోగిస్తామని సంస్థ పేర్కొంది.

» ఈ ప్రాజెక్టు నుంచి వెలువడే ఘన, ద్రవ, వాయు వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యం జరగకూడదని నిబంధన విధించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.